సంపుటి : 18 సంచిక : 99
Vol : 18 Issue : 99

RNI NO: TEL/TEL/2009/28544

తెలంగాణ & ఆంధ్రప్రదేశ్

# పీపుల్స్ డైరీ

సమగ్ర వార్తా దినపత్రిక

విలువలతో కూడిన నిఖార్సయిన జర్నలిజం

Editor : KONDAPARTHI KIRAN
CELL : 9493019044

కరీంనగర్, గురువారం 11 జూన్ 2026
Karimnagar, Thursday 11 June 2026

పేజీలు : 08
వెల రూ : 4-00

Pages : 08
Price : 4-00

WANTED
పీపుల్స్‌డైరీ
దినపత్రిక తెలంగాణ & ఏపీలోని వివిధ జిల్లాల్లో పనిచేయుటకు స్టాఫ్ రిపోర్టర్లు కావలెను
సెంటర్లు
◆ హనుమకొండ ◆ కరీంనగర్
◆ భూపాలపల్లి ◆ పెద్దపల్లి/రామగుండం
◆ జనగామ ◆ మహబూబాబాద్
◆ హైదరాబాద్ ◆ నిజామాబాద్
Cell : 9493019044
9618509859



7లో

## 20 కోట్ల మంది సందర్శకులు

2025లో అయోధ్యకు పోటెత్తిన పర్యాటకులు

2024లో 16.44 కోట్లు...

గణనీయంగా పెరిగిన అయోధ్య ఆదాయం



7లో

## తెలంగాణకు కేంద్రం శుభవార్త..

జీరాంజీ పథకం క్రింద రూ.3825 కోట్లు!

## తుపాకీతో భార్యను కాల్చి చంపిన భర్త

అక్కకు విడాకులిచ్చి చెల్లిని పెళ్లాడి..

తారాస్థాయికి చేరిన గొడవలు...

అనుమానంతోనే ఘాతుకం...?

7లో

# ఒంటరిపోరుకే మొగ్గు!



- తెలంగాణపై బీజేపీ ప్రత్యేక వ్యూహాలు
- కష్టపడితే అధికారం చేజిక్కించుకోవచ్చన ఆలోచన
- ఏపీ, తమిళనాడుల్లో కంటే తెలంగాణ భిన్నం...
- ఇతర పార్టీలపై ఆధారపడేకంటే సొంతంగా బలం పెంచుకునే స్కెచ్
- కేడర్, ఓటు బ్యాంకును సాధించాలనే లక్ష్యం..

**పీపుల్స్‌డైరీ–పొలిటికల్ బ్యూరో :**

తెలంగాణలో బీజేపీ, బీఆర్ఎస్ పార్టీలు కలిసే ఉన్నాయంటూ.. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి సహా కాంగ్రెస్ నేతలు పదే పదే తీవ్ర విమర్శలు చేస్తూనే ఉన్నారు. బీజేపీ, బీఆర్ఎస్ మధ్య రహస్య ఒప్పందాలు ఉన్నాయని.. అందుకే బీఆర్ఎస్ ప్రభుత్వ 10 ఏళ్ల పాలనలో జరిగిన అవినీతిపై నరేంద్ర మోదీ ప్రభుత్వం చర్యలు తీసుకోవడం లేదని హస్తం పార్టీ నేతలు తీవ్ర విమర్శలు గుప్పిస్తూనే ఉన్నారు. ఈ నేపథ్యంలోనే బీజేపీ అగ్రనేత, కేంద్ర హోం శాఖ మంత్రి అమిత్ షా కీలక ప్రకటన చేశారు. తాజాగా మీడియాతో చిట్ చాట్‌గా మాట్లాడిన కేంద్రమంత్రి అమిత్ షా.. తెలంగాణలో బీజేపీ ఏ పార్టీతో పొత్తు పెట్టుకునేది లేదని స్పష్టం చేశారు. ఒంటరిగానే ఎన్నికల్లో పోటీ చేసి.. తెలంగాణ గడ్డపై కాషాయ జెండాను ఎగురవేస్తామని ధీమా వ్యక్తం చేశారు. అయితే అమిత్ షా చేసిన

(మిగతా 7లో...)



## ప్రభుత్వ వైద్యరంగంలో కీలక అడుగు

- సర్కారు దవాఖానాల్లో విదేశీయులకు వైద్యం
- కార్యాచరణ షురూ చేసిన సర్కార్
- గ్లోబల్ మెడికల్ హబ్‌గా మారనున్న హైదరాబాద్..
- విదేశీ రోగుల కోసం ప్రత్యేక బ్లాక్‌లు, పడకలు
- తక్కువ ఖర్చుతో వైద్య సేవలు

పీపుల్స్‌డైరీ–హైదరాబాద్ : తెలంగాణ ప్రభుత్వ ఆసుపత్రులైన నిమ్స్, టిమ్స్, గాంధీ, ఉస్మానియాలలో విదేశీ రోగులకు కార్పొరేట్ తరహా సేవలు అందించేందుకు ప్రభుత్వం ఒక ఉన్నత స్థాయి కమిటీని వేసింది. ఢిల్లీ, ముంబైల తర్వాత విదేశీయులకు హైదరాబాద్ మెడికల్ టూరిజం హబ్‌గా మారడంతో ఈ నిర్ణయం తీసుకున్నారు. ప్రైవేటులో రూ.7 లక్షలుండే మోకీళ్ల మార్పిడి, బైపాస్ సర్జరీలు నిమ్స్‌లో రూ.2 లక్షలకే లభిస్తున్నాయి. మౌలిక వసతులు మెరుగుపరచి టిమ్స్‌లో ప్రత్యేక ఇంటర్నేషనల్ బ్లాక్‌ను, ఇతర ఆసుపత్రుల్లో ప్రత్యేక పడకలను విదేశీయుల కోసం కేటాయించనున్నారు. ఇప్పటి వరకు కార్పొరేట్ ఆసుపత్రులకే పరిమితమైన ఇంటర్నేషనల్ మెడికల్ టూరిజం సేవలను.. ఇకపై ప్రభుత్వ ఆసుపత్రులైన నిమ్స్, , గాంధీ, ఉస్మానియాతో పాటు త్వరలో అందుబాటులోకి

(మిగతా 7లో...)

## 3 శాతమే నీటి లభ్యత

- హైదరాబాద్‌లో దారుణ పరిస్థితులు
- 2025లోనే 99 శాతం భూగర్భ జలాల లూటీ
- కేంద్ర నివేదికలో విస్తుపోయే నిజాలు
- ఇలా అయితే భవిష్యత్తులో ఇబ్బందే

పీపుల్స్‌డైరీ–హైదరాబాద్ : హైదరాబాద్ మహానగరం శరవేగంగా విస్తరిస్తున్న వేళ నగరవాసులను ఓ పెను ముప్పు ముంచెత్తబోతోంది. గ్రేటర్ హైదరాబాద్ పరిధిలో భూగర్భ జలాలు ప్రమాదకర స్థాయిలో అడుగంటుతున్నాయని కేంద్ర జలశక్తి మంత్రిత్వ శాఖ విడుదల చేసిన డైనమిక్ గ్రౌండ్ వాటర్ రీసోర్స్ అసెస్‌మెంట్ రిపోర్ట్ 2025 స్పష్టం చేసింది. దాదాపు 2 వేల చదరపు కిలోమీటర్ల పరిధిలో విస్తరించి, తెలంగాణ రాష్ట్ర జనాభాలో దాదాపు మూడో వంతు మందికి ఆశ్రయమిస్తున్న హైదరాబాద్ నగరంలో రాష్ట్ర మొత్తం భూగర్భ


(మిగతా 7లో...)

## కలంయోధుల గొంతునొక్కే చర్యలు

- ఆర్టీఐ మాజీ కమిషన్ శంకర్‌నాయక్ ఆగడాలు...
- దొంగే 'దొంగదొంగ' అన్నట్టు అతడి తీరు
- తాటాకు చప్పుళ్లకు తలవంచేదే లేదు...
- తాడోపేడో తేల్చి... రైతుకు న్యాయం చేయడమే పీపుల్స్‌డైరీ లక్ష్యం
- చట్టం నుంచి ఎవ్వరూ తప్పించుకోలేరు...
- ఎన్ని కేసులున్నా అక్రమార్కుని టచ్ చేయని పోలీసులు...
- సామాన్య బాధితులకు మాత్రం రిమాండ్‌లు...
- పేదలకు జైలు... పెద్దలకు మాత్రం సలాంలు
- సమస్యను సీఎం వరకు తీసుకెళ్లడమే పత్రిక లక్ష్యం
- మీడియాకు ఎదురెళ్తే సూర్యుడికి చేయి అడ్డుపెట్టడమే!

2వ పేజీలో..

# కలంపై కన్నెర్ర..



# కలంపై కన్నెర్ర...

**పీపుల్స్‌డైరీ-వరంగల్**

కబ్జాలు, అక్రమాలు చేయడం మీ నైజం... బాధితుల పక్షాన నిలబడి అక్షర యుద్ధం చేయడం మా ధర్మం.... నిలువునా పేదవాడి భూమిని మింగేస్తూ, ఆ అక్రమాలను నిలదీసినందుకు 'పీపుల్స్ డైరీ' పత్రికకు పరువునష్టం నోటీసులు పంపి దొంగే దొంగదొంగ అన్నట్టు మాజీ ఆర్టీఐ కమిషనర్ శంకర్‌నాయక్ వ్యవహరించడాన్ని ఎవరూ గుర్తించడం లేదనుకుంటున్నాడో ఏమో!! హోదా, పలుకుబడి, అంగబలం ఉపయోగించి ఇష్టారాజ్యంగా వ్యవహరిస్తూ ఎదురుదాడికి దిగడం మీ అహంకారానికి పరాకాష్టగా మారగా, కాసుల కక్కుర్తితో చట్టాన్ని చుట్టంగా మార్చుకుంటే.... చూస్తూ ఊరుకోవడానికి 'పీపుల్స్‌డైరీ' పత్రిక కండ్లు మూసుకుని లేదు. కేసులు, నోటీసుల పేరుతో బెదిరిస్తే 'పీపుల్స్ డైరీ' కలం వెనక్కి తగ్గుతుందని అనుకుంటే అది అక్రమార్కుడి పగటికలే! మా పోరాటం సామాన్యుడి కోసమే... మా ప్రయాణం సత్యం వైపే! ఒక సామాన్య రైతుకు అండగా నిలిచినందుకు పత్రికపైనే పరువునష్టం దావ వేయడం సంచలనంగా మారింది. అన్యాయాన్ని ఎదిరిస్తే పత్రిక గొంతునొక్కే చర్యలపై ప్రజలు ఈసడించుకుంటున్నారు. ఇక వివరాల్లోకి వెళ్తే...

### దేవుడి పేరిట భూదోపిడీ...
### సర్వే నంబర్ల సాక్షిగా మీ పాపాలు బట్టబయలు...!

మేము రాసిన ప్రతి అక్షరం పచ్చి నిజం. అన్ని ఆధారాలు పకడ్బంధీగా ఉన్నాయి. అయినా అక్రమార్కుడు ఏ ధైర్యం చూసుకుని చెలరేగుతున్నాడో అర్థం చేసుకోవచ్చు. పత్రికా కథనాల ఆధారంగా సర్వే నంబర్లలో పచ్చిపాల వారి భూములను కబ్జా చేయడానికి పక్కా స్కెచ్ వేసింది ఎవరో నియోజకవర్గ ప్రజలందరికీతెలుసు. దేవుడి పేరు చెప్పి పరమ పవిత్రమైన భూములను నొక్కేయాలని చూసిన ఈ 'భూబకాసురుడు' పచ్చని పచ్చిపాల భూముల్లోకి రౌడీల్లా చొరబడి, జమయిల్ మొక్కలను నిస్సిగ్గుగా పీకేయించిన చరిత్ర అందరికీ తెలిసిందే.

### అమాయకులకు రిమాండ్
### అతడని మాత్రం టచ్ చేయని పోలీసులు

అక్రమార్కుడిపై ఎన్ని కేసులున్నా పోలీసులు ఎందుకు వెనుకాడుతున్నారో?

కారేపల్లి పోలీస్ స్టేషన్‌లో రికార్డయిన ఎఫ్ఐఆర్‌లో ఏ1 ముద్దాయిగా శంకర్‌నాయక్ వెలుగుతున్నా.... అమాయక రైతుల భూములను కాజేయడానికి చూస్తున్నందుకు శంకర్‌నాయక్‌పై నేటికి మూడు క్రిమినల్ కేసులు నమోదై, ఆ మూడింటిలోనూ మొదటి ముద్దాయి స్థానంలో ఉన్నది అతడే అయినా పోలీసులు కనీసం ఎందుకు రిమాండ్‌కు తరలించలేదని జనం ప్రశ్నిస్తున్నారు.

అమాయకులపై ప్రతాపం చూపించే పోలీసులు శంకర్‌నాయక్‌ను కనీసం టచ్ చేసేందుకు ఎందుకు వెనుకాడుతున్నారు? కేవలం అతడికి ఉన్న బ్యాక్‌గ్రౌండ్ చూసి భయపడుతున్నారా? లేక అతడిపై చర్యలు తీసుకోకుండా మామూళ్లు అందుకుంటున్నారా? అని ప్రజలతో పాటు బాధితులు ప్రశ్నిస్తున్నారు. బాధితుల భూములపైకి రౌడీలా వెళ్లి వారు వేసుకున్న పంటలను ధ్వంసం చేసిన ఆధారాలు ఉన్నా పోలీసులు అక్రమార్కుడిపై ఎందుకు కనికరం చూపిస్తున్నారు? అక్రమార్కుడికి అంతగా భయపడాల్సిన అవసరం పోలీసులకు ఏముంది అనే ప్రశ్నలు తలెత్తుతున్నాయి.

### పోలీసుల ఉచిత సలహాలు...

ఇక ఈ వ్యవహారంలో పోలీసులు అక్రమార్కుడి వైపే నిలుస్తూ కేసులో రాజీపడాలని ఒత్తిడి తెస్తూ అందులో సగం భూమిని అక్రమార్కుడికి కట్టబెట్టాలని సూచిస్తున్నారని బాధితులు ఆవేదన వ్యక్తంచేస్తున్నారు. తమ భూమిని అప్పనంగా అక్రమార్కుడికి ఎందుకు కట్టబెట్టాలని, ఈవిషయంలో ఎంతవరకైనా పోరాటం చేస్తామని బాధితులు పేర్కొంటున్నారు. మాకు న్యాయం చేయాల్సిందిపోయి అక్రమార్కుడికే భూమి ఇవ్వాలని పోలీసులు సూచించడం ఎంతవరకు సమంజసం అని బాధితులు ప్రశ్నిస్తున్నారు.

### ఈ లొసుగు ఏంది శంకర్‌నాయక్...?
### తన తప్పును తానే ఒప్పుకున్నాడుగా...

'పీపుల్స్‌డైరీ' దినపత్రికకు పంపించిన నోటీసులో తమ భూమి సర్వే నెంబర్ 548/37/5/4 (బానోతు లక్ష్మి) అని పేర్కొన్నాడు. కానీ బాధితుడు పచ్చిపాల భద్రయ్యకు చెందిన సర్వే నెంబర్ మాత్రం 548/37/అ/4 గా పేర్కొన్న విషయం తెలిసిందే. మరి శంకర్‌నాయక్ సర్వే నెంబర్ 548/37/5/4 అయినప్పుడు పచ్చిపాల భద్రయ్యకు చెందిన 548/37/అ/4 నెంబర్ భూమిలోకి ఎందుకు అక్రమంగా చొరబడుతున్నాడు? పత్రికకు పంపిన నోటీసులో కూడా పచ్చిపాల భద్రయ్యకు చెందిన సర్వే నెంబర్‌ను మెన్షన్ చేయాలి కదా? ఇక్కడ నోటీసుల్లో తప్పుడు సర్వే నెంబర్‌ను ఎందుకు రాశాడు? ఇక్కడ తన తప్పును తానే ఒప్పుకున్నట్టు స్పష్టంగా తెలుస్తున్నది.

### బెదిరింపులకు తలొగ్గం...
### తాడోపేడో తేల్చేస్తాం... : పీపుల్స్‌డైరీ

ఒక సామాన్య రైతు వారి భూమి కోసం సాగుతున్న ఈ పోరాటంలో బాధితుల గుండె కోతను, కన్నీటి గాథను సమాజం ముందుకు తెచ్చాం. అక్రమార్కుల గుండెల్లో అది నిద్రపోకుండా చేస్తోంది. బెదిరింపులకు భయపడి వెనుకడుగు వేసే ప్రసక్తే లేదు. ఈ విషయంలో ప్రభుత్వం దృష్టికి, సీఎం దృష్టికి అక్రమార్కుడి ఆగడాలు వెళ్లేలా చూస్తాం. తాడోపేడో తేల్చుకుని బాధిత కుటుంబానికి న్యాయం జరిగే వరకు అక్షర పోరాటాన్ని కొనసాగిస్తాం.

### ఎన్నాళ్లు చట్టం నుంచి తప్పించుకు తిరుగుతాడు?

అర్థ, అంగబలం, హోదా, చట్టంలోని లొసుగులతో ప్రస్తుతం తాత్కాలికంగా విజయం సాధిస్తున్నా చట్టం నుంచి ఎప్పటికైనా తప్పించుకోలేనని విషయాన్ని సదరు అక్రమార్కుడు గుర్తించాల్సి ఉంది. తప్పు చేయకపోతే పోలీసుల కళ్లు గప్పి, ఊళ్లు పట్టుకుని ఎందుకు తప్పించుకు తిరుగుతున్నాడో అర్థం చేసుకోవచ్చు. పక్కా ఆధారాలతో, సెక్షన్లతో సహా కేసులు నమోదైనా... సదరు ఏ1 ముద్దాయిని అరెస్ట్ చేయడంలో పోలీసులు ఎందుకు వెనకడుగు వేస్తున్నారు? ఈ జాప్యం వెనుక ఉన్న రాజకీయ ఒత్తిళ్లు ఏంటి? తెర వెనుక ఉండి ఈ భూకబ్జా ఆటను ఆడిస్తున్న అసలు సూత్రధారులు ఎవరో త్వరలోనే వారి ముసుగులు తీసి జనాల ముందుకు రాకతప్పదు.

### అక్రమార్కుడిపై కలమెత్తిన అనేక పత్రికలు
### 'పీపుల్స్‌డైరీ'కి మాత్రమే నోటీసులు...

సామాన్య పేద రైతు భూమిని కాజేసిన అక్రమార్కుడిపై అనేక పత్రికల్లో కూడా కథనాలు వచ్చాయి. ఏదో ఒక్క పత్రికలో మాత్రమే కథనం వచ్చిందంటే ఏదో అనుకోవచ్చుగానీ అన్ని పత్రికలు కూడా ఇతడి అక్రమాలపై గర్జించాయంటే ఇతడి యవ్వారాలు ఏ స్థాయిలో ఉన్నాయో అర్థం చేసుకోవచ్చు. అయితే ఇతడి తతంగాలపై అనేక పత్రికల్లో కథనాలు ప్రచురితమైనా కేవలం 'పీపుల్స్‌డైరీ' పత్రికను మాత్రమే టార్గెట్ చేయడం వెనుక ఆంతర్యం ఏమిటని బాధితులు, ప్రజలు ప్రశ్నిస్తున్నారు.

- 'పీపుల్స్‌డైరీ' దినపత్రిక గొంతునొక్కే చర్యలు
- ఆర్టీఐ మాజీ కమిషన్ శంకర్‌నాయక్ ఆగడాలు...
- దొంగే 'దొంగదొంగ' అన్నట్టు అతడి తీరు
- తాటాకు చప్పుళ్లకు తలవంచేదే లేదు...
- తాడోపేడో తేల్చి... రైతుకు న్యాయం చేయడమే పత్రిక లక్ష్యం
- చట్టం నుంచి ఎవ్వరూ తప్పించుకోలేరు...
- ఎన్ని కేసులున్నా అక్రమార్కుని టచ్ చేయని పోలీసులు...
- సామాన్య బాధితులకు మాత్రం రిమాండ్‌లు...
- పేదలకు జైలు... పెద్దలకు మాత్రం సలాంలు...
- సమస్యను సీఎం వరకు తీసుకెళ్లడమే పత్రిక లక్ష్యం
- మీడియాకు ఎదురెళ్తే సూర్యుడికి చేయి అడ్డుపెట్టడమే!





మా భూమికి హక్కులు కల్పించండి







07 Jul 2024 - Page 4

పచ్చిపాల భాగ్యమ్మ ను ఫోన్లో పరామర్శిస్తున్న ఎమ్మెల్యే రాందాస్ నాయక్








రైతు ఆత్మహత్యాయత్నంపై ఏసీపీ విచారణ







పేదల భూమి ఆక్రమణ


పేదల భూమి ఆక్రమణ


WWW.MANANETITELANGANA.COM


అఖిల పక్షం ఆధ్వర్యంలో బాధితుల సమావేశం

























Under RTI Act


Under RTI Act



Under RTI Act







SPECIMEN COPY

Under RTI Act


Under RTI Act



# నరేంద్ర మోదీ ప్రజా సంక్షేమ 12 సంవత్సరాల ప్రస్థానం



**ఏటూరు నాగారం జూన్ 10 (పీపుల్స్ డైరీ) :** మండల కేంద్రంలో బుధవారం ప్రధానమంత్రి నరేంద్ర మోదీ నేతృత్వంలోని కేంద్ర ప్రభుత్వం విజయవంతంగా 12 సంవత్సరాల పాలనను పూర్తి చేసుకున్న సందర్భంగా నరేంద్ర మోడీకి ప్రత్యేక పూజలు. ఈ సందర్భంగా పలువురు సీనియర్ నాయకులు మాట్లాడుతూ బిజెపి కేంద్రంలో సుపరిపాలన మరియు ప్రజా సంక్షేమ 12 సంవత్సరాల ప్రస్థానం వికసిత్ భారత్' వైపు అడుగులు మండల కేంద్రంలో రామాలయంల గుడిలో పూజ నిర్వహించడం జరిగినది. ప్రధానమంత్రి నేతృత్వంలోని ఎన్డీయే ప్రభుత్వం నేటితో విజయవంతంగా 12 సంవత్సరాల పరిపాలనను పూర్తి చేసుకుంది. 2014 మే నెలలో దేశ బాధ్యతలు చేపట్టిన నాటి నుండి, 'సబ్‌కా సాథ్, సబ్‌కా వికాస్, సబ్‌కా విశ్వాస్, సబ్‌కా ప్రయాస్' అనే మంత్రంతో దేశాన్ని ప్రగతి పథంలో నడిపిస్తూ, అత్యధిక కాలం నిరంతరాయంగా సేవలందించిన ప్రజాస్వామ్య ప్రధానిగా నరేంద్ర మోదీ సరికొత్త చరిత్ర సృష్టించారు. గడిచిన 12 ఏళ్ల కాలంలో భారతదేశాన్ని ప్రపంచంలోనే అత్యంత వేగంగా అభివృద్ధి చెందుతున్న ఆర్థిక శక్తిగా మార్చడంలోనూ, దేశ ప్రజల ఆత్మవిశ్వాసాన్ని పెంపొందించడంలోనూ మోదీ ప్రభుత్వం అపూర్వ విజయాన్ని సాధించింది. గడిచిన 12 ఏళ్ల ప్రధాన విజయాలు మరియు మైలురాళ్లు ఆర్థిక ప్రగతి మరియు డిజిటల్ విప్లవం ఆర్థిక వ్యవస్థ విస్తరణ 2014లో దాదాపు 2 ట్రిలియన్ డాలర్లుగా ఉన్న భారత ఆర్థిక వ్యవస్థ పరిమాణం, నేడు 4 ట్రిలియన్ డాలర్ల మార్కును దాటి ప్రపంచంలోనే నాలుగో అతిపెద్ద ఆర్థిక శక్తిగా ఎదిగింది. యూపీఐ విప్లవం ప్రపంచంలోనే అతిపెద్ద డిజిటల్ చెల్లింపుల వ్యవస్థగా భారత్ రికార్డు సృష్టించింది. చిన్న వ్యాపారుల నుండి పెద్ద మాల్స్ వరకు డిజిటల్ లావాదేవీలు దేశ ఆర్థిక రూపురేఖలను మార్చేశాయి. స్టార్టప్ ఎకోసిస్టమ్ 2014లో కేవలం కొన్ని వందలుగా ఉన్న స్టార్టప్‌ల సంఖ్య నేడు 2.3 లక్షలకు పైగా విస్తరించి, లక్షలాది మంది యువతకు ఉపాధి కల్పిస్తోంది. సామాజిక సంక్షేమం అంత్యోదయ స్ఫూర్తి ఉచిత రేషన్ దేశంలోని సుమారు 81 కోట్లకు పైగా ప్రజలకు ప్రతి నెలా ఉచిత రేషన్ అందిస్తూ ఆహార భద్రతను కల్పించింది. ఆయుష్మాన్ భారత్: 70 కోట్లకు పైగా పేద ప్రజలకు రూ. 5 లక్షల వరకు ఉచిత వైద్య బీమా సౌకర్యం కల్పించబడింది. నివాసం మరియు మౌలిక వసతులు: 'పీఎం ఆవాస్ యోజన' కింద 4 కోట్లకు పైగా ఇళ్లు, 'స్వచ్ఛ భారత్' కింద 10.5 కోట్లకు పైగా శౌచాలయాలు, మరియు 'జల్ జీవన్ మిషన్' ద్వారా 15.7 కోట్లకు పైగా ఇళ్లకు తాగునీటి కనెక్షన్లు అందించడం జరిగింది. ఆర్థిక సమ్మిళితం 58 కోట్లకు పైగా జన్ ధన్ ఖాతాల ద్వారా ప్రభుత్వ లబ్ధిని నేరుగా లబ్ధిదారుల ఖాతాల్లోకే ( డైరెక్ట్ బెనిఫిట్ ట్రాన్స్ఫర్) జమ చేస్తున్నారు. రాకెట్ వేగంతో మౌలిక సదుపాయాల (ఇన్ ఫ్రాస్ట్రక్చర్) కల్పన రహదారులు ఒ ఎయిర్‌పోర్టులు: దేశంలో జాతీయ రహదారుల సంఖ్య 91 నుండి 164కు, విమానాశ్రయాల సంఖ్య 74 నుండి 164కు పెరిగింది. రైల్వే ఆధునీకరణ దేశీయ సాంకేతికతతో రూపొందిన 164 వందే భారత్ రైళ్లు పట్టాలెక్కాయి. రైల్వే లైన్ల విద్యుద్దీకరణ 99% పూర్తి కావచ్చింది. నూతన చిహ్నాలు నూతన పార్లమెంట్ భవనం, సెంట్రల్ విస్టా, అటల్ సేతు, మరియు కాశ్మీర్ రైల్ లింక్ వంటి ప్రతిష్టాత్మక ప్రాజెక్టులు పూర్తయ్యాయి. మహిళా, రైతు మరియు యువత సాధికారత:రైతు సంక్షేమం: 'పీఎం కిసాన్ సమ్మాన్ నిధి' ద్వారా రైతుల ఖాతాల్లోకి నేరుగా రూ. 4.3 శ్రీఖనిష్త్ర కోట్లు బదిలీ చేయబడ్డాయి. మహిళా సాధికారత: 10 కోట్లకు పైగా మహిళలు స్వయం సహాయక సంఘాల (ఎస్ హెచ్ జి ఎస్) ద్వారా ఆర్థికంగా స్థిరపడ్డారు. ఉజ్వల యోజన కింద 10 కోట్లకు పైగా ఉచిత గ్యాస్ కనెక్షన్లు పంపిణీ చేశారు. యువతకు ముద్రా రుణాలు: స్వయం ఉపాధి కోసం రూ. 40 లక్షల కోట్లకు పైగా ముద్రా రుణాలు మంజూరు చేయబడ్డాయి. అంతరిక్షం మరియు రక్షణ రంగం వ్యూహాత్మక రంగాలైన అంతరిక్షం మరియు అణు ఇంధన రంగాలను ప్రైవేట్ భాగస్వామ్యానికి తెరవడం ద్వారా అంతరిక్ష స్టార్టప్‌ల సంఖ్య 400కు చేరింది. 'మిషన్ గగన్‌యాన్' దిశగా దేశం వేగంగా దూసుకుపోతోంది. 'ఆత్మనిర్భర్ భారత్'లో భాగంగా రక్షణ ఎగుమతులు రికార్డు స్థాయిలో రూ. 38,400 కోట్లకు చేరాయి. ఈ కార్యక్రమంలో వావిలాల జనార్ధన్ దళిత మోర్చా జిల్లా అధ్యక్షులు విను కోళ్ల చక్రవర్తి మాజీ మండల అధ్యక్షులు దుర్గం దుర్గారావు మండల ఉపాధ్యక్షులు ఎర్రెల్ల ఎల్లయ్య మాజీ ఎంపీటీసీ మండల సీనియర్ నాయకులు ఇర్సవడ్ల జగన్ మండలం దుర్గం మల్లిక్ నాయకుడు తదితరులు పాల్గొన్నారు.

# ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణం త్వరితగతిన పూర్తి చేయాలి

## కలెక్టర్ బోర్డే హేమంత్ సహదేవరావు



**ఏటూరు నాగారం జూన్ 10 (పీపుల్స్ డైరీ) :**ఉపాధి హామీ పథకం పనుల్లో కూలీల భాగస్వామ్యాన్ని పెంచి పనులు వేగవంతం చేయాలని, ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణ పనులను త్వరితగతిన పూర్తిచేయాలని జిల్లా కలెక్టర్ బోర్డే హేమంత్ సహదేవరావు అధికారులను ఆదేశించారు. బుధవారం కలెక్టరేట్‌లోని తన ఛాంబర్‌లో జిల్లా పలు శాఖల అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ వీవో భవనాల నిర్మాణ పనులను వెంటనే ప్రారంభించి యుద్ధ ప్రాతిపదికన నాణ్యత ప్రమాణాలతో పూర్తి చేసేలా చూడాలని తెలిపారు. రానున్న వర్షాకాలాన్ని దృష్టిలో ఉంచుకుని చేపడుతున్న మొక్కల నాటే కార్యక్రమంలో నిర్దేశించిన లక్ష్యాలను తప్పనిసరిగా చేరుకోవాలని, నాటిన మొక్కల సంరక్షణపై కూడా ప్రత్యేక దృష్టి సారించాలని సూచించారు. ప్రజా దర్బార్ కార్యక్రమంలో అందిన పెన్షన్ దరఖాస్తులను ఎప్పటికప్పుడు పరిశీలించి అర్హులైన వారి జాబితాను సిద్ధం చేయాలని, జిల్లా ఇందిరా మహిళా శక్తి కేంద్రం భవనం ప్రారంభోత్సవానికి అవసరమైన అన్ని ఏర్పాట్లు పూర్తి చేయాలని అన్నారు. జిల్లా సమాఖ్య ఆధ్వర్యంలో జిల్లా కేంద్రంలో ఏర్పాటు చేయనున్న పెట్రోల్ బంక్‌కు అవసరమైన అన్ని అనుమతులు పొందేలా చర్యలు తీసుకోవాలని, గిరిజన మహిళలు తయారు చేస్తున్న ఉత్పత్తులకు విస్తృత ప్రచారం కల్పించాలని తెలిపారు. స్థానిక ఉత్పత్తులకు బ్రాండింగ్, ప్యాకేజింగ్, మార్కెటింగ్ సదుపాయాలు కల్పించి ఆదాయాన్ని పెంచే దిశగా కృషి చేయాలని వివరించారు. సమావేశంలో జిల్లా అదనపు కలెక్టర్ (స్థానిక సంస్థలు) సంపత్ రావు, డీఆర్‌డీఏ పిడి చంద్రశేఖర్, అదనపు పీడి శ్రీనివాస్, సంబంధిత అధికారులు పాల్గొన్నారు.

# గ్రాండ్యూర్ వెంచర్ సమస్యను తక్షణమే పరిష్కరించాలి


- ప్రజల ఆస్తి హక్కులను కాపాడటం ప్రభుత్వ బాధ్యత
- బీజేపీ కంటెస్టెడ్ ఎమ్మెల్యే ఏనుగు సుదర్శన్ రెడ్డి డిమాండ్



**మేడ్చల్, జూన్ 10(పీపుల్స్ డైరీ):** మేడ్చల్ పట్టణంలోని గ్రాండ్యూర్ వెంచర్‌ను "ప్రొహిబిటెడ్" జాబితాలో చేర్చడంతో అక్కడ ప్లాట్లు, ఇళ్లను కొనుగోలు చేసిన యజమానులు తీవ్ర ఆందోళనకు గురవుతున్నారని బీజేపీ కంటెస్టెడ్ ఎమ్మెల్యే ఏనుగు సుదర్శన్ రెడ్డి అన్నారు. ఈ నేపథ్యంలో ఆయన బుధవారం గ్రాండ్యూర్ వెంచర్‌ను ప్రత్యక్షంగా సందర్శించి బాధితులతో మాట్లాడి వారి సమస్యలను తెలుసుకున్నారు. అనంతరం మేడ్చల్ తహసీల్దార్‌ను కలిసి సమస్యపై చర్చించారు. ఎన్నో సంవత్సరాలుగా కష్టపడి సంపాదించిన డబ్బుతో ప్రజలు కొనుగోలు చేసిన ప్లాట్లు, ఇళ్ల విషయంలో ప్రస్తుతం నెలకొన్న అనిశ్చితి బాధాకరమని ఆయన పేర్కొన్నారు. ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా అధికారులు వెంటనే చర్యలు తీసుకుని సమస్యను పరిష్కరించాలని కోరారు. ప్రజల ఆస్తి హక్కులను కాపాడటం ప్రభుత్వ బాధ్యత అని, కాంగ్రెస్ ప్రభుత్వం ఈ అంశాన్ని నిర్లక్ష్యం చేయకుండా తక్షణమే పరిష్కార మార్గం చూపాలని డిమాండ్ చేశారు. బాధితులకు న్యాయం జరగకపోతే భారతీయ జనతా పార్టీ ప్రజల తరఫున పెద్ద ఎత్తున ఉద్యమం చేపట్టేందుకు వెనుకాడబోదని హెచ్చరించారు. ప్రజల సమస్యల పరిష్కారమే బీజేపీ లక్ష్యమని, బాధితులకు పూర్తి న్యాయం జరిగే వరకు పార్టీ తరఫున పోరాటం కొనసాగిస్తామని ఏనుగు సుదర్శన్ రెడ్డి స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో మేడ్చల్ డివిజన్ అధ్యక్షురాలు శైలజా రినాథ్, జిల్లా ఉపాధ్యక్షులు గౌరారం జగన్ గౌడ్, ప్రధాన కార్యదర్శి జాకట ప్రేమదాస్, ఉపాధ్యక్షులు మైసర్ రాజు, కార్యదర్శి విష్ణుమూర్తి గౌడ్, మాజీ సర్పంచ్ మురళీధర్ గుప్తా, సీహెచ్ శ్రీనివాస్ గౌడ్, బీజేవైఎం జిల్లా కార్యదర్శి బొజ్జ రాఘవరెడ్డి, సీనియర్ నాయకులు బుజ్జా వంశీధర్ రెడ్డి, సీహెచ్ శ్రీపాల్ రెడ్డి, మహేష్ గౌలికర్, ప్లాట్ యజమానులు శ్రీనివాస్, సంజయ్, సుబ్బరాజు తదితరులు పాల్గొన్నారు.

# సాయి గీత ఆశ్రమంలో ఆస్తమా బాధితులకు ఉచిత ఔషధం

## ఆరోగ్య సేవలో ఆధ్యాత్మికత.. మృగశిర కార్తి సందర్భంగా విశేష స్పందన




**మేడ్చల్ జూన్10 (పీపుల్స్ డైరీ):** గుండ్ల పోచంపల్లి డివిజన్ పరిధిలోని కండ్లకోయ గల సాయి గీత ఆశ్రమంలో పరిధి లోని మృగశిర కార్తి పర్వదినం రాగానే ఆస్తమా బాధితుల చూపు ప్రత్యేక వైద్య శిబిరాలపై పడుతుంది. శ్వాసకోశ సంబంధిత సమస్యల తో బాధపడుతున్న వారికి ఉపశమనం కలిగించాలనే లక్ష్యంతో దేశంలోని పలు ప్రాంతాల్లో నిర్వహించే సంప్రదాయ వైద్య కార్యక్రమాలకు విశేష ఆదరణ లభిస్తోంది. ఈ క్రమంలో సాయి గీత ఆశ్రమం ఆధ్వర్యంలో నిర్వహించిన ఉచిత ఆస్తమా వైద్య శిబిరం మరోసారి వేలాది మందికి ఆశాకిరణంగా నిలిచింది. పూజ్య సద్గురు శ్రీ శ్రీ శ్రీ సాయికుమార్ మార్గదర్శకత్వంలో నిర్వహించిన ఈ శిబిరానికి తెలంగాణతో పాటు పొరుగు రాష్ట్రాల నుంచి కూడా పెద్ద సంఖ్యలో ప్రజలు తరలివచ్చారు. చిన్నారుల నుంచి వృద్ధుల వరకు వివిధ వయసుల వారు ఆశ్రమానికి చేరుకుని ఉచితంగా అందజేసిన ఆస్తమా ఔషధాన్ని స్వీకరించారు.

**పరంపరగా కొనసాగుతున్న విశ్వాసం :**ఆస్తమా వ్యాధిగ్రస్తులకు మృగశిర కార్తి రోజున ప్రత్యేక ఆయుర్వేద ఔషధాన్ని అందించే సంప్రదాయం పరాశర మహాముని కాలం నుంచి కొనసాగుతోందని చెబుతారు. ఈ విశ్వాసాన్ని కొనసాగిస్తూ సాయి గీత ఆశ్రమం గత మూడు దశాబ్దాలకు పైగా ప్రతి ఏడాది ఈ సేవా కార్యక్రమాన్ని నిర్వహిస్తోంది. శిబిరానికి వచ్చే అనేక మంది గతంలో పొందిన ఆరోగ్య ప్రయోజనాలను గుర్తు చేసుకుంటూ తమ అనుభవాలను పంచుకోవడం విశేషం.

# మార్కండేయ స్వామి ఆలయంలో ప్రత్యేక పూజలు

## ప్రధాని మోదీ చారిత్రాత్మక రికార్డు సందర్భంగా ..



**హసన్‌పర్తి, జూన్ 10 (పీపుల్స్ డైరీ) :** భారత ప్రధానమంత్రి శ్రీ నరేంద్ర మోదీ ప్రధానమంత్రిగా నిరంతర సేవల్లో చారిత్రాత్మక రికార్డు సాధించిన సందర్భంగా హసన్‌పర్తి మండల కేంద్రంలోని మార్కండేయ స్వామి ఆలయంలో బీజేపీ నాయకులు ప్రత్యేక అర్చనలు నిర్వహించారు. బీజేపీ మండల అధ్యక్షులు మారం తిరుపతి ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమానికి రాష్ట్ర నాయకులు, తాజా మాజీ 66వ డివిజన్ కార్పొరేటర్ గురుమూర్తి శివకుమార్ ముఖ్య అతిథిగా హాజరై పార్టీ నాయకులతో కలిసి ప్రధాని మోదీ పేరు మీద ప్రత్యేక పూజలు చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. శ్రీ నరేంద్ర మోదీ గారు 2014 మే 26న తొలిసారిగా ప్రధానమంత్రిగా బాధ్యతలు స్వీకరించారని తెలిపారు. 2026 జూన్ 10 నాటికి ఆయన 4,399 రోజుల పాటు ప్రధానమంత్రిగా సేవలందించి, మాజీ ప్రధాని జవహర్‌లాల్ నెహ్రూ గారి 4,398 రోజుల రికార్డును అధిగమించారని పేర్కొన్నారు. ఎన్నికైన ప్రధానమంత్రుల్లో అత్యధిక కాలం నిరంతరాయంగా సేవలందించిన ప్రధానమంత్రిగా చరిత్ర సృష్టించారని తెలిపారు. ఈ సందర్భంగా ప్రధాని మోదీ కి ఆయురారోగ్యాలు, దీర్ఘాయుష్షు కలగాలని, దేశం మరింత అభివృద్ధి చెందాలని ఆలయంలో ప్రార్థనలు చేశారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర కౌన్సిల్ సభ్యులు మారపల్లి రామచంద్రారెడ్డి, మాజీ ఎంపీటీసీ పిట్టల కుమారస్వామి, బీజేపీ నాయకులు దాసరి రాజు, జీల సురేష్ యాదవ్, చెకిలం రాజేశ్వరరావు, మట్టెడ సుమన్, శీలం బిక్షపతి, ఆర్మీ శ్రీనివాస్, కోయడ రాజు, కుంబర్కర్ సాయి, శ్రీకాంత్ తదితరులు పాల్గొన్నారు.

# ఘనంగా ఎమ్మెల్యే డాక్టర్ కవ్వంపల్లి సత్యనారాయణ జన్మదిన వేడుకలు



**శంకరపట్నం జూన్ :10 పీపుల్స్ డైరీ:** శంకరపట్నం మండలం లోని అంబేద్కర్ చౌరస్తా వద్ద మానకొండూరు ఎమ్మెల్యే డాక్టర్ కవ్వంపల్లి సత్యనారాయణ జన్మదిన వేడుకలను కాంగ్రెస్ పార్టీ నాయకులు ఘనంగా నిర్వహించారు. మండల కాంగ్రెస్ అధ్యక్షులు బండారి తిరుపతి ఆధ్వర్యంలో జరిగింది. ఈ కార్యక్రమంలో కేక్ కట్ చేసి స్వీట్లు పంపిణీ చేశారు. ఎమ్మెల్యే ప్రజలకు మరింత సేవ చేయాలని ఆకాంక్షిస్తూ నాయకులు శుభాకాంక్షలు తెలిపారు. కార్యక్రమంలో మాజీ జెడ్పీటీసీ బత్తిని శ్రీనివాస్ గౌడ్. మరియు కాంగ్రెస్ సీనియర్ నాయకులు, కార్యకర్తలు పెద్ద సంఖ్యలో అజరయ్యారు. ఎమ్మెల్యే నాయకత్వంలో నియోజకవర్గం అభివృద్ధి చెందాలని కోరుతూ సభలో ప్రసంగించారు.

# కాంగ్రెస్ పార్టీ బలోపేతానికి కృషి చేయాలి


## హుజురాబాద్‌లో కాంగ్రెస్ నాయకులతో ప్రత్యేక సమావేశం.



**హుజురాబాద్:జూన్ 9, (పీపుల్స్ డైరీ) :** హుజురాబాద్ పట్టణంలోని కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో పట్టణ, మండల, వార్డు అధ్యక్షులు, గ్రామ శాఖ అధ్యక్షులతో ప్రత్యేక సమావేశాన్ని హుజురాబాద్ కాంగ్రెస్ పార్టీ నియోజకవర్గ ఇన్‌చార్జి వొడితల ప్రణవ్ నిర్వహించారు. ఈ సందర్భంగా పార్టీ బలోపేతం, సంస్థాగత నిర్మాణం, భవిష్యత్ కార్యాచరణపై నాయకులతో విస్తృతంగా చర్చించారు. కాంగ్రెస్ పార్టీ భవిష్యత్‌లో మరింత బలోపేతం అవుతుందని, అందుకు ప్రతి నాయకుడు గ్రామ, వార్డు స్థాయిలో కష్టపడి పనిచేయాలని సూచించారు. అలాగే బూత్ స్థాయిలో ప్రత్యేక అవగాహన కార్యక్రమాలను త్వరలో నిర్వహించనున్నట్లు తెలిపారు. కాంగ్రెస్ ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలను ప్రజలకు చేరవేసే బాధ్యత పార్టీ నాయకులు తీసుకోవాలని కోరారు. రానున్న రోజుల్లో మరిన్ని ప్రజా సంక్షేమ పథకాలను ప్రభుత్వం ప్రవేశపెట్టనున్నట్లు పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో హుజురాబాద్ మున్సిపల్ చైర్‌పర్సన్ సుహాసిని, కౌన్సిలర్లు, పార్టీ అధికార ప్రతినిధులు, పట్టణ మరియు మండల అధ్యక్షులు, మహిళా అధ్యక్షురాళ్లు, అనుబంధ సంఘాల నాయకులు, సీనియర్ నాయకులు తదితరులు పాల్గొన్నారు

# మూడేళ్ల వయసులోనే అద్భుత ప్రతిభ

## రాష్ట్రాలు - రాజధానులు గడగడా చెబుతూ అందరినీ ఆశ్చర్యపరుస్తున్న చిన్నారి ఇశాన్ కౌండిన్య.



**హుజురాబాద్, జూన్ 10 (పీపుల్స్ డైరీ)** :మూడేళ్ల వయసులో పిల్లలు సాధారణంగా ఆటపాటలతో కాలం గడుపుతుంటారు. కొందరు ఇంకా స్పష్టంగా మాట్లాడటం నేర్చుకుంటుంటారు. అయితే హుజురాబాద్ పట్టణానికి చెందిన ఓ చిన్నారి తన అసాధారణ జ్ఞాపకశక్తి, ప్రతిభతో అందరినీ ఆశ్చర్యపరుస్తున్నాడు. హుజురాబాద్ పట్టణంలోని బండ అంకుశ్‌వాడకు చెందిన స్నేహా--అర్జున్ దంపతుల కుమారుడు వడ్లకొండ ఇశాన్ కౌండిన్య ప్రస్తుతం వరంగల్‌లోని ఢిల్లీ పబ్లిక్ స్కూల్‌లో నర్సరీ చదువుతున్నాడు. కేవలం మూడేళ్ల వయసులోనే భారతదేశంలోని అన్ని రాష్ట్రాలు, వాటి రాజధానుల పేర్లను వరుసగా చెప్పగలుగుతున్నాడు. అంతేకాకుండా భక్తి శ్లోకాలు, పద్యాలను కూడా స్పష్టంగా, చక్కగా పఠిస్తూ తన ప్రతిభను చాటుకుంటున్నాడు. సాధారణంగా పెద్ద పిల్లలకు కూడా కష్టంగా అనిపించే విషయాలను ఇంత చిన్న వయసులోనే గుర్తుంచుకుని చెప్పడం అందరినీ ఆకట్టుకుంటోంది. ఈ సందర్భంగా బాలుడి తల్లిదండ్రులు స్నేహా, అర్జున్ మాట్లాడుతూ, చిన్నప్పటి నుంచే ఇశాన్ విషయాలను త్వరగా గ్రహించే స్వభావం కలిగి ఉన్నాడని తెలిపారు. అతని ఆసక్తిని గుర్తించి తాము ప్రోత్సహించడంతో ఈ స్థాయిలో ప్రతిభ కనబరుస్తున్నాడని చెప్పారు. తమ కుమారుడి ప్రతిభ పట్ల ఎంతో గర్వంగా ఉందని ఆనందం వ్యక్తం చేశారు. ఇశాన్ కౌండిన్య ప్రతిభను స్థానికులు, పాఠశాల యాజమాన్యం, పలువురు ప్రముఖులు అభినందిస్తున్నారు. భవిష్యత్తులో ఈ చిన్నారి మరిన్ని ఉన్నత శిఖరాలను అధిరోహించాలని ఆకాంక్షిస్తున్నారు.

# మార్కెట్ సాధారణ సమావేశానికి హాజరైన మున్సిపల్ చైర్మన్



**జమ్మికుంట. జూన్ 10పీపుల్స్ డైరీ** : జమ్మికుంట వ్యవసాయ మార్కెట్ కమిటీ సాధారణ సమావేశంలో పాల్గొన్న మున్సిపల్ చైర్మన్ శ్రీ మొలుగు ప్రశాంత్ కుమార్ దిలీప్ మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్రంలో అతిపెద్ద మార్కెట్లో ఒకటైన జమ్మికుంట వ్యవసాయ మార్కెట్లో రైతులకు అన్ని విధాలుగా పాలకవర్గం అండగా ఉంటుందని తెలుపుతూ రానున్న వర్షాకాలం వేసేటువంటి పంటలకు సంబంధించిన విత్తనాలు నాణ్యమైనవి ఎంచుకొని మంచి దిగుబడి వచ్చేటువంటి పంటలను ఎంచుకొని సకాలంలో ఎరువులు అందించి మంచి దిగుబడితో కుటుంబ సభ్యులతో సుఖ సంతోషాలతో ఉండాలని రైతులకు సూచించారు అనంతరం జమ్మికుంట నుండి బదిలీపై వెళ్తున్న ఉద్యోగి విజయ్ ని ఘనంగా సన్మానించారు ఈ కార్యక్రమంలో చైర్మన్ శ్రీమతి పుల్లూరి స్వప్న సదానందం వైస్ చైర్మన్ సతీష్ రెడ్డి,గౌరవ డైరెక్టర్స్ తదితరులు పాల్గొన్నారు..

# పెంచిన చమురు గ్యాస్ సిలిండర్ ధరలను వెంటనే తగ్గించాలి: సిపిఐ




**ఏటూరు నాగారం జూన్ 10 (పీపుల్స్ డైరీ) :** కేంద్ర ప్రభుత్వం పెంచిన చమురు, గ్యాస్ సిలిండర్ ధరలను వెంటనే తగ్గించాలని సిపిఐ జిల్లా సహాయ కార్యదర్శి జంపాల రవీందర్ డిమాండ్ చేశారు. బుధవారం సిపిఐ పార్టీ ఆధ్వర్యంలో కలెక్టర్ కార్యాలయం ముందు నిరసన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా రవీందర్ మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం ఎన్నికల ముందు ఒక మాట ఎన్నికల తరువాత మరొక మాట అమలు చేస్తూ మొత్తం ప్రభుత్వ రంగ సంస్థలు ఆదానీ, అంబానీలకు కట్టబెడుతున్నదని ఆరోపించారు. ఇప్పటికైనా పెంచిన ధరలను వెంటనే తగ్గించాలని, సకాలంలో రైతులకు ఎరువులు, పురుగు మందులు, విత్తనాలు అందించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో పార్టీ నాయకులు ముత్యాల రాజు, బండి నర్సయ్య,ఇంజం కొమురయ్య, ఏఐటీయూసీ కార్యధర్శులు గుంజె శ్రీనివాస్, పోలం కొండయ్య తదితరులు పాల్గొన్నారు.

# యువత మత్తుకు బానిసై విలువైన జీవితాన్ని నాశనం చేసుకోవద్దు

**వినూత్న కార్యక్రమం చేపట్టిన జిల్లా ఎస్పీ సుధీర్ రామ్నాథ్ కేకన్**



**ఏటూరు నాగారం జూన్ 10 (పీపుల్స్ డైరీ) :** యువత మత్తుకు బానిసై ఎంతో విలువైన తమ శేష జీవితాన్ని నాశనం చేసుకోవద్దని, ప్రతి ఒక్కరూ ఉన్నత చదువులు చదివి తల్లిదండ్రుల ఆశలను నెరవేర్చాలని జిల్లా ఎస్పీ సుధీర్ రామ్నాథ్ కేకన్ అన్నారు. ఇటీవల గంజాయి కేసులో పట్టుబడి కోర్టు శిక్షణ అనుభవించిన నలుగురు వ్యక్తులచే మొక్కలు నాటే కార్యక్రమాన్ని బుధవారం వినూత్నంగా చేపట్టారు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ వ్యక్తిత్వ వికాసం కోసం వృక్షారోపణ కార్యక్రమం చేపట్టామని, ప్రతి వ్యక్తి జీవితంలో మార్పు సాధ్యమేనని, గత తప్పిదాలను పునరావృతం చేయకుండా సమాజానికి ఉపయోగపడే మార్గంలో ముందుకు సాగాలని పిలుపు నిచ్చారు. మొక్కలు నాటడం ద్వారా పర్యావరణ పరిరక్షణకు తోడ్పడటమే కాకుండా జీవితంలో సానుకూల మార్పుకు ఇది ఒక ప్రతీకగా నిలుస్తుందని అన్నారు. కార్యక్రమంలో అదనపు ఎస్పీ (ఏఆర్) బొంగోని సదానందం, ములుగు డీఎస్పీ నలువాల రవీందర్, ఇన్స్పెక్టర్ ప్రతాప్, ములుగు సీఐ దారం సురేష్, ఆర్ ఐ అడ్మిన్ రాధారపు స్వామి, ములుగు ఎస్ఐ ఉపేందర్, పీఎస్ఐ బుట్ట చంద్రశేఖర్ తదితరులు పాల్గొన్నారు.


# పిఆర్ సి వెంటనే ప్రకటించాలి

**టిపిటిఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శి జోగ రాంబాబు**



**ఆళ్ళపల్లి జూన్ 10 (పీపుల్స్ డైరీ) :** రాష్ట్రంలోని ఉపాధ్యాయులు, ఉద్యోగులు ఎంతోకాలం గా ఎదురుచూస్తున్న పి.ఆర్ .సి (వేతన సవరణ సంఘం) నివేదికను ప్రభుత్వం వెంటనే ప్రకటించాలని టి పిటిఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శి జోగరాంబాబు డిమాండ్ చేశారు. ప్రస్తుతం పెరుగుతున్న నిత్యా వసర వస్తువుల ధరలు. జీవన వ్యయం కారణంగా ఉపాధ్యాయులు ,ఉద్యోగులు తీవ్ర ఆర్థిక ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని ఆయన పేర్కొన్నారు. ఉద్యోగుల సంక్షేమం, వారి సేవలకు తగిన గుర్తింపు ఇవ్వాలంటే పి. ఆర్. సి ని ఆలస్యం చేయకుండా అమలు చేయవలసిన అవసరం ఉందన్నారు. అదేవిధంగా పెండింగులో ఉన్న డి ఏ బకాయిలను విడుదల చేయాలని, ఉద్యోగులు మరియు ఉపాధ్యాయుల సమస్యల పరిష్కారానికి ప్రభుత్వం ప్రత్యేక చర్యలు తీసుకోవాలని కోరారు. ప్రభుత్వ విద్యాభివృద్ధికి, రాష్ట్ర పురోగతికి ఉపాధ్యాయులు కీలక పాత్ర పోషిస్తున్న నేపథ్యంలో వారి న్యాయమైన డిమాండ్లను ప్రభుత్వం వెంటనే నెరవేర్చాలని విజ్ఞప్తి చేశారు.పి అర్ సి ప్రకటించే విషయంలో ప్రభుత్వం మరింత జాప్యం చేస్తే ఉపాధ్యాయ, ఉద్యోగ సంఘాలతో కలిసి ఉద్యమ కార్యాచరణ చేపట్టాల్సి వస్తుందని హెచ్చరించారు.

# ఎమ్మెల్యే కృషితో చేతి పంపు,,,



**ఆళ్ళపల్లి జూన్ 10(పీపుల్స్ డైరీ) :** ఆళ్ళపల్లి మండల పరిధిలో ని రాయిపాడు గ్రామ పంచాయతీ హనుమాన్ ఆలయ ప్రాంగణంలో బోర్ వేపిస్తానన మండల పర్యటన సందర్భంగా మాట ఇవ్వడం జరిగింది ఇచ్చిన మాట ప్రకారం పినపాక శాసనసభ్యులు పాయం వెంకటేశ్వర్లు ఆదేశాల మేరకు రాయిపాడు సర్పంచ్ ఊకె చిన్నపాపయ్య ఆధ్వర్యంలో బోర్ వెల్ సహాయంతో బోర్ వేపించడం జరిగింది అలాగే తక్షణమే దానికి చేతి పంపు సహాయం నీటిని వినియోగించుకునేలా ఏర్పాటు చేయడం జరుగుతుంది. ఈ సందర్భంగా ఆలయ కమిటీ సభ్యులు మరియు రాయిపాడు గ్రామ ప్రజలు లిపినపాక నియోజకవర్గ శాసనసభ్యులు శ్రీ పాయం వెంకటేశ్వర్లు ప్రత్యేక ధన్యవాదములు తెలపడం జరిగింది.ఈ కార్యక్రమంలో ఆనంతోగు సర్పచ్ కల్తీ వెంకటేశ్వర్లు ఆనంతోగు మాజీ సర్పంచ్ గలిగే సమ్మక్క ఆళ్ళపల్లి మండల కాంగ్రెస్ పార్టీ కో ప్రచార కమిటీ అధ్యక్షులు వాసం శ్రీకాంత్ వార్డు సభ్యులు మాజీ ఉపసర్పంచ్ వాగబోయిన సమ్మయ్య కాంగ్రెస్ పార్టీ నాయకులు నాయకులు గ్రామ దొర పటేల్ మహిళలు గ్రామస్థులు తదితరులు పాల్గొన్నారు

# ప్రైవేటు విద్య పేరిట దోపిడీ-విద్య హక్కా..? వ్యాపార వస్తువా..?

- జూన్ నెలలో తల్లిదండ్రులపై పెరుగుతున్న ఆర్థిక భారం
- కార్పొరేట్ విద్యాసంస్థల దోపిడీకి అడ్డుకట్ట ఎప్పుడు?
- జూన్ నెల వచ్చిందంటే..తల్లిదండ్రులకు గుబులు
- ప్రైవేటు స్కూళ్ల దోపిడీపై ప్రభుత్వం దృష్టి సారించాలి

**మేడ్చల్, జూన్10 (పీపుల్స్ డైరీ):** జూన్ నెల వచ్చిందంటే విద్యార్థుల్లో కొత్త ఆశలు, కొత్త లక్ష్యాలు, కొత్త విద్యా సంవత్సరంపై ఉత్సాహం కనిపిస్తుంది. అయితే అదే సమయంలో తల్లిదండ్రుల్లో మాత్రం ఆందోళన మొదలవుతోంది. కారణం పిల్లల విద్య కోసం భరించాల్సిన భారీ ఖర్చులు. పాఠశాలలు, జూనియర్ కళాశాలల అడ్మిషన్లు ప్రారంభమైన వెంటనే ఫీజులు, పుస్తకాలు, యూనిఫాంలు, రవాణా ఖర్చులు కుటుంబాలపై భారంగా మారుతున్నాయి. ప్రత్యేకించి ప్రైవేటు, కార్పొరేట్ విద్యాసంస్థలు విద్యను సేవగా కాకుండా వ్యాపారంగా మార్చాయనే విమర్శలు రోజురోజుకు పెరుగుతున్నాయి. ట్యూషన్ ఫీజులతో పాటు అడ్మిషన్ ఫీజులు, అభివృద్ధి నిధి, స్మార్ట్ క్లాస్‌రూమ్ ఫీజు, ప్రత్యేక కోచింగ్ ఫీజు, వార్షిక నిర్వహణ రుసుము వంటి పేర్లతో వేలాది రూపాయలు అదనంగా వసూలు చేస్తున్నట్లు తల్లిదండ్రులు ఆరోపిస్తున్నారు.

### పుస్తకాలు, యూనిఫాంల పేరిట మరో దోపిడీ

అధిక ఫీజులతో పాటు పుస్తకాలు, నోట్‌బుక్స్, యూనిఫాంల విక్రయాలు కూడా తల్లిదండ్రులకు తలనొప్పిగా మారాయి. కొన్ని విద్యాసంస్థలు నిర్దిష్ట దుకాణాల నుంచే కొనుగోలు చేయాలని ఒత్తిడి తీసుకురావడం వల్ల తల్లిదండ్రులకు ప్రత్యామ్నాయ అవకాశాలు లేకుండా పోతున్నాయి. మార్కెట్‌లో తక్కువ ధరలకు లభించే వస్తువులను రెట్టింపు ధరలకు విక్రయిస్తున్నారనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. విద్యార్థుల సంఖ్య పెరుగుతున్న కొద్దీ విద్యా సామగ్రి విక్రయం కూడా కోట్ల రూపాయల వ్యాపారంగా మారిందనే విమర్శలు ఉన్నాయి. పాఠశాలల యాజమాన్యాలు మరియు కొందరు వ్యాపారుల మధ్య ఏర్పడుతున్న అవగాహనల వల్ల చివరకు నష్టపోతున్నది తల్లిదండ్రులేనని సామాజిక వర్గాలు పేర్కొంటున్నాయి.

### అప్పుల బాట పట్టిస్తున్న విద్యా ఖర్చులు

పెరుగుతున్న నిత్యావసర వస్తువుల ధరలు, ఇంటి అద్దెలు, వైద్య ఖర్చులతో ఇప్పటికే ఇబ్బందులు ఎదుర్కొంటున్న మధ్యతరగతి కుటుంబాలకు విద్యా ఖర్చులు అదనపు భారంగా మారుతున్నాయి. కొందరు తల్లిదండ్రులు పిల్లల చదువుల కోసం అప్పులు చేయాల్సిన పరిస్థితి ఏర్పడుతోంది. ఒక కుటుంబంలో ఇద్దరు లేదా అంతకంటే ఎక్కువ మంది పిల్లలు చదువుతుంటే పరిస్థితి మరింత క్లిష్టంగా మారుతోంది.

కనీస మౌలిక వసతులు లేని పాఠశాలలు

విద్యార్థుల నుంచి భారీ ఫీజులు వసూలు చేస్తున్న కొన్ని విద్యాసంస్థల్లో కనీస మౌలిక వసతులు కూడా లేకపోవడం ఆందోళన కలిగిస్తోంది. సరైన ఆటస్థలాలు, భద్రతా ప్రమాణాలు, విశాలమైన తరగతి గదులు, అర్హత కలిగిన అధ్యాపకులు లేకపోయినా కొన్ని సంస్థలు విద్యార్థులను ఆకర్షించేందుకు భారీ ప్రకటనలు చేస్తున్నాయి. ర్యాంకులు, ఫలితాలు, ఆకర్షణీయ ప్రచారాలతో తల్లిదండ్రులను ఆకట్టుకుంటున్నప్పటికీ, వాస్తవ పరిస్థితులు భిన్నంగా ఉన్నాయనే విమర్శలు ఉన్నాయి.

### ప్రభుత్వ పర్యవేక్షణ ఎక్కడ?

ప్రతి ఏడాది ఫీజుల పెంపు జరుగుతున్నప్పటికీ వాటిపై సమర్థవంతమైన నియంత్రణ లేకపోవడం తల్లిదండ్రుల ఆందోళనకు ప్రధాన కారణంగా మారింది. విద్యాశాఖ అధికారులు పర్యవేక్షణ చేస్తున్నామని చెబుతున్నప్పటికీ, ఫలితాలు మాత్రం కనిపించడం లేదని ప్రజాసంఘాలు విమర్శిస్తున్నాయి. నిబంధనలు ఉల్లంఘించే విద్యాసంస్థలపై కఠిన చర్యలు తీసుకోవడంలో నిర్లక్ష్యం కనిపిస్తోందని వారు ఆరోపిస్తున్నారు.

### ఫీజు నియంత్రణ చట్టం అవసరం

విద్య అందరికీ అందుబాటులో ఉండాలంటే ప్రభుత్వం ప్రత్యేక ఫీజు నియంత్రణ చట్టాన్ని తీసుకురావాలని తల్లిదండ్రులు డిమాండ్ చేస్తున్నారు. పుస్తకాలు, యూనిఫాంల బలవంతపు విక్రయాలను అరికట్టడంతో పాటు, ప్రతి పాఠశాల ఫీజుల వివరాలను పారదర్శకంగా ప్రకటించే విధానం అమలు చేయాలని కోరుతున్నారు. అలాగే అనుమతులు, మౌలిక వసతులు, అధ్యాపకుల అర్హతలపై ప్రత్యేక తనిఖీలు నిర్వహించి నిబంధనలు ఉల్లంఘించే విద్యాసంస్థలపై కఠిన చర్యలు తీసుకోవాలని విజ్ఞప్తి చేస్తున్నారు.విద్య సమాజ అభివృద్ధికి పునాది. అలాంటి విద్య వ్యాపారంగా మారితే భవిష్యత్తు తరాలపై తీవ్ర ప్రభావం పడుతుంది. జూన్ నెల విద్యార్థులకు కొత్త ఆశలను అందిస్తుంటే, తల్లిదండ్రులకు మాత్రం ఆర్థిక ఆందోళనల నెలగా మారుతోంది. విద్య హక్కు గానీ, భారంగా మారకూడదంటే ప్రభుత్వం, విద్యాశాఖ అధికారులు వెంటనే స్పందించి ప్రైవేటు విద్యాసంస్థల ఫీజుల దోపిడీకి అడ్డుకట్ట వేయాల్సిన అవసరం ఎంతైనా ఉంది.

# ఎమ్మెల్యే పాడి కౌశిక్ రెడ్డి సమక్షంలో గులాబీ గూటికి కాంగ్రెస్, బీజేపీ నాయకులు

**హుజురాబాద్‌లో బీఆర్ఎస్‌లోకి భారీ చేరికలు**

**హుజురాబాద్, జూన్ 10: (పీపుల్స్ డైరీ) :** హుజురాబాద్ నియోజకవర్గంలో బీఆర్ఎస్ పార్టీలోకి చేరికల పరంపర కొనసాగుతోంది. ఎమ్మెల్యే పాడి కౌశిక్ రెడ్డి నాయకత్వంపై విశ్వాసం వ్యక్తం చేస్తూ రాజపల్లి గ్రామానికి చెందిన పలువురు కాంగ్రెస్, బీజేపీ నాయకులు బీఆర్ఎస్ పార్టీలో చేరారు. రాజపల్లి గ్రామ సర్పంచ్ కటుకూరి మల్లారెడ్డి, జూపాక సింగిల్ విండో చైర్మన్ అలుమల్ల శ్యాంసుందర్ రెడ్డి ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమంలో బీజేపీ తరఫున ఎన్నికైన ఉపసర్పంచ్ శనిగరం అయిలయ్య, వార్డు సభ్యులు, బీజేపీ బూత్ అధ్యక్షుడు ఈర్ల రాజు, ఈర్ల ప్రవీణ్, మునిగాల పోచయ్య, శనిగరపు సమ్మయ్య, నోముల కరుణాకర్, పత్తి శ్రీనివాస్ రెడ్డి, శనిగరపు రవి బీఆర్ఎస్ పార్టీలో చేరారు. అలాగే కాంగ్రెస్ పార్టీ బూత్ అధ్యక్షుడు ఎండి రమీజ్, కాంగ్రెస్ సోషల్ మీడియా



ఇన్‌చార్జ్ చెవుల సాయి కుమార్ తదితరులు కూడా ఎమ్మెల్యే పాడి కౌశిక్ రెడ్డి సమక్షంలో గులాబీ కండువా కప్పుకొని పార్టీలో చేరారు.ఈ సందర్భంగా పార్టీలో చేరిన నాయకులకు ఎమ్మెల్యే గులాబీ కండువాలు కప్పి సాదరంగా ఆహ్వానించారు. అనంతరం ఎమ్మెల్యే పాడి కౌశిక్ రెడ్డి మాట్లాడుతూ, ప్రజల ఆకాంక్షలకు అనుగుణంగా పనిచేస్తున్న బీఆర్ఎస్ పార్టీకి గ్రామ గ్రామాన ఆదరణ పెరుగుతోందన్నారు. హుజురాబాద్ నియోజకవర్గ సమగ్ర అభివృద్ధి కోసం మరింత బలోపేతంగా పనిచేస్తామని తెలిపారు.రాజపల్లి గ్రామంలో వివిధ పార్టీలకు చెందిన కీలక నాయకులు బీఆర్ఎస్‌లో చేరడం పార్టీ బలోపేతానికి దోహదపడు తుందని పేర్కొన్నారు. కొత్తగా పార్టీలో చేరిన నాయకులు గ్రామ అభివృద్ధి, ప్రజా సమస్యల పరిష్కారంలో చురుకైన పాత్ర పోషించాలని కోరారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎస్సీ కార్పొరేషన్ చైర్మన్ బండ శ్రీనివాస్, మాజీ ఎంపీపీ రాణి సురేందర్ రెడ్డి, బీఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలు, గ్రామ ప్రజలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

# 5 కిలోమీటర్ల పరిధిలో వారికే 2బిహెచ్‌కే ఇండ్ల కేటాయింపు

- ఇళ్లలో నివసించని లబ్ధిదారులకు మరోసారి నోటీసులు
- పనులను త్వరితగతిన పూర్తి చేయాలని ఆదేశాలు

**మేడ్చల్ జూన్ 10( పీపుల్స్ డైరీ) :** జిల్లాలోని డబుల్ బెడ్‌రూమ్ కాలనీల్లో మంజూరైన ఇళ్లలో లబ్ధిదారులు తప్పనిసరిగా నివసించేలా చర్యలు తీసుకోవాలని రాష్ట్ర హౌసింగ్ శాఖ ప్రత్యేక కార్యదర్శి, హౌసింగ్ కార్పొరేషన్ ఎండీ వి.పి. గౌతం అధికారులను ఆదేశించారు. ఇప్పటికే ఇళ్లు కేటాయించబడినా కాలనీల్లోకి తరలిరాని వారికి మరోసారి నోటీసులు జారీ చేసి, నిర్లక్ష్యం కొనసాగితే కేటాయింపులను రద్దు చేసే చర్యలు తీసుకోవాలని సూచించారు. బుధవారం జిల్లా కలెక్టర్ మను చౌదరితో కలిసి బౌరంపేట, గండిమైసమ్మ, దుండిగల్ ప్రాంతాల్లోని 2బిహెచ్‌కే కాలనీలను సందర్శించిన గౌతం, మౌలిక వసతులు, నిర్మాణ పనుల పురోగతిని పరిశీలించారు. దుండిగల్ ఫేజ్-1 కాలనీలో అనేక మంది లబ్ధిదారులు ఇంకా నివాసం ఉండకపోవడంపై అసంతృప్తి వ్యక్తం చేస్తూ, వారిని వెంటనే కాలనీల్లోకి తరలించేలా చర్యలు చేపట్టాలని అధికారులకు సూచించారు. పేదలకు గౌరవప్రదమైన జీవన వసతి కల్పించడమే ప్రభుత్వ లక్ష్యమని పేర్కొన్న ఆయన, ఇళ్లు కావాలంటూ వేలాది మంది దరఖాస్తు చేసుకున్న నేపథ్యంలో కేటాయించిన ఇళ్లలో నివసించని వారి కేటాయింపులను రద్దు చేసి అర్హులైన ఇతరులకు అవకాశం కల్పిస్తామని స్పష్టం చేశారు.అలాగే దుండిగల్ ఫేజ్-2లో కొనసాగుతున్న నిర్మాణ పనులను పరిశీలించిన ఆయన, మిగిలిన పనులను యుద్ధప్రాతి పదికన పూర్తి చేసి అన్ని మౌలిక సదుపాయాలు కల్పించాలని కాంట్రాక్టర్లకు ఆదేశించారు. ఇకపై 2బిహెచ్‌కే ఇండ్లను ఆయా కాలనీలకు సమీపంలోని 5 కిలోమీటర్ల పరిధిలో నివసించే అర్హులకే కేటాయిం చాలని ప్రభుత్వం విధానపరమైన నిర్ణయం తీసు కున్నట్లు వి.పి. గౌతం తెలిపారు. ఈ మేరకు గండిమైసమ్మ ప్రాంతంలో జరుగుతున్న సర్వేను పరిశీలించిన ఆయన, ప్రజాపాలనలో దరఖాస్తు చేసుకున్న ఎల్-2 జాబితాలోని అర్హులను గుర్తించే ప్రక్రియను వేగవంతం చేయాలని



సూచించారు. సర్వే వివరాలను యాప్‌లో నమోదు చేయడం, అర్హతల నిర్ధారణ ప్రక్రియను క్షుణ్ణంగా నిర్వహించడం, సర్వే పూర్తైన వెంటనే లబ్ధిదారుల ఎంపిక చేపట్టాలని జిల్లా అధికారులకు ఆదేశాలు జారీ చేశారు. ఈ కార్యక్రమంలో హౌసింగ్ కార్పొరేషన్, హౌసింగ్ బోర్డు, రెవెన్యూ, వాటర్‌వర్క్స్, విద్యుత్ శాఖల ఉన్నతాధికారులు పాల్గొన్నారు.

# ప్రతిపక్ష నాయకులను చూసి బిజెపి పార్టీ భయపడుతుంది

- పార్లమెంట్‌లో ప్రశ్నించే ప్రజా సమస్యలను వినిపించే ములుగు జిల్లా డీసీసీ అధ్యక్షులు శ్రీ పైడాకుల అశోక్

**ఏటూరు నాగారం జూన్ 10 (పీపుల్స్ డైరీ) :** మీనాక్షి నటరాజన్ రాజ్యసభ నామినేషన్‌ను సాంకేతిక కారణాల సాకుతో తిరస్కరించడం కేవలం ఒక వ్యక్తికి జరిగిన అన్యాయం కాదు, ఇది ప్రజాస్వామ్య స్ఫూర్తికి, రాజ్యాంగ విలువలకు పూర్తిగా విరుద్ధం. విపక్షాల గొంతు నొక్కడమే ధ్యేయంగా పెట్టుకున్న బీజేపీ, వ్యవస్థలను తన చేతుల్లోకి తీసుకుని నడుపుతోంది. ఈ నామినేషన్ తిరస్కరణ వెనుక బీజేపీ రాజకీయ కుట్ర స్పష్టంగా కనిపిస్తోంది. ఎన్నికల బరిలో ప్రజాస్వామ్యబద్ధంగా ఎదుర్కోలేక, ఇలాంటి తెరవెనుక కుతంత్రాలతో కాంగ్రెస్ నాయకులను అడ్డుకోవాలని చూడడం బీజేపీ దిగజారుడు రాజకీ యాలకు నిదర్శనం. కాంగ్రెస్ పార్టీ ఎల్లప్పుడూ రాజ్యాంగాన్ని, ప్రజాస్వామ్య విలువలను కాపాడేందుకు కట్టుబడి ఉ



ంటుంది. ఇలాంటి బెదిరింపులకు, కుట్రలకు మా కాంగ్రెస్ పార్టీ భయపడదు..బిమీనాక్షి నటరాజన్ నిఖార్సైన కాంగ్రెస్ వాది, తెలంగాణ వ్యవహారాల ఇన్‌ఛార్జ్‌గా ఆమె అందించిన సేవలు, పార్టీ పట్ల ఆమెకున్న నిబద్ధత అమోఘం.ఆమె గొంతును చట్టసభల్లో వినపడకుండా చేయాలని చూస్తే, దేశవ్యాప్తంగా లక్షలాది మంది కాంగ్రెస్ కార్యకర్తలు ఆమెకు అండగా నిలబడతారు.వ్యవస్థలను అడ్డుపెట్టుకుని బీజేపీ ఎన్ని అడ్డంకులు సృష్టించినా, ప్రజల పక్షాన నిలబడి పోరాడే కాంగ్రెస్ పార్టీ సంకల్పాన్ని ఎవరూ బలహీనపర చలేరు. రాజ్యాంగ సంస్థలను అధికార బీజేపీ పార్టీ తన స్వార్థానికి వాడుకోవడం ప్రజాస్వామ్యానికి చేటు. ఈ అప్రజాస్వామిక చర్యను దేశంలోని మేధావులు, ప్రజాస్వామ్యవాదులు ఖండించాల్సిన అవసరం ఉంది.న్యాయం, ధర్మం ఎప్పుడూ ప్రజల పక్షానే ఉంటాయి. బీజేపీ చేస్తున్న ఈ కుట్రలను ప్రజలు గమనిస్తూనే ఉన్నారు, తగిన సమయంలో వారు ఖచ్చితంగా బుద్ధి చెప్తారు.ములుగు నియోజకవర్గ ప్రజాదరణ పొందిన శాసనసభ్యులు మరియు మంత్రి శ్రీమతి సీతక్క ఆధ్వర్యంలో. ప్రజాస్వామ్య వ్యతిరేక బీజేపీ విధి, విధానాలపై పోరాటాన్ని మరింత ఉధృతం చేస్తామని హెచ్చరించారు.

# ధాన్యం కొనుగోళ్లలో వేగం పెంచాలి-మిల్లుల్లో జాప్యానికి చెక్

## అదనపు కలెక్టర్ ఆకస్మిక తనిఖీలు



**మేడ్చల్, జూన్ 10(పీపుల్స్ డైరీ):-** రైతులు పండించిన ధాన్యం కొనుగోలు ప్రక్రియలో ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా ప్రభుత్వం చర్యలు వేగవంతం చేస్తోంది. కొనుగోలు కేంద్రాల నుంచి మిల్లులకు చేరుతున్న ధాన్యాన్ని త్వరితగతిన అన్‌లోడ్ చేసి నిల్వ చేయాలని, రైతులు మరియు రవాణా వాహనాలు అనవసరంగా నిరీక్షించకుండా చూడాలని జిల్లా యంత్రాంగం స్పష్టమైన ఆదేశాలు జారీ చేసింది. బుధవారం మేడ్చల్--మల్కాజిగిరి జిల్లా అదనపు కలెక్టర్ డి. విజయేందర్ రెడ్డి, జిల్లా పౌర సరఫరాల అధికారి శ్రీనివాస్ రెడ్డితో కలిసి కొల్తూర్‌లోని వెంకటరమణ రైస్ మిల్లును ఆకస్మికంగా తనిఖీ చేశారు. మిల్లులో జరుగుతున్న ధాన్యం దిగుమతి, అన్‌లోడింగ్, నిల్వ ప్రక్రియలను పరిశీలించి అధికారులకు, మిల్లర్లకు పలు సూచనలు చేశారు. వాహనాల నిరీక్షణకు ముగింపు కొనుగోలు కేంద్రాల నుంచి ధాన్యం తీసుకొచ్చే లారీలను మిల్లుల వద్ద ఎక్కువసేపు నిలిపివేయకుండా వెంటనే అన్‌లోడ్ చేయాలని అదనపు కలెక్టర్ ఆదేశించారు. వాహనాల రద్దీ కారణంగా రైతులు, డ్రైవర్లు ఎదుర్కొంటున్న ఇబ్బందులను తగ్గించేందుకు అన్‌లోడింగ్ ప్రక్రియను వేగవంతం చేయాలని సూచించారు. అవసరమైతే హమాలీల సంఖ్యను పెంచి ధాన్యం దింపే పనులను మరింత వేగంగా నిర్వహించాలని స్పష్టం చేశారు. పెండింగ్ రసీదులపై ఆగ్రహం ధాన్యం మిల్లులకు చేరిన వెంటనే మిల్లర్ అక్‌నాలెడ్జ్‌మెంట్‌లను జారీ చేయాలని, వాటిని పెండింగ్‌లో ఉంచకూడదని హెచ్చరించారు. రైతులకు సంబంధించిన రసీదులు ఆలస్యం అయితే చెల్లింపుల ప్రక్రియ కూడా ప్రభావితమవుతుందని అధికారులు పేర్కొన్నారు.

### పారదర్శకతకు ప్రాధాన్యం

ధాన్యం నిల్వలు, హమాలీల అందుబాటు, వాహనాల కదలికలు తదితర అంశాలను స్వయంగా పరిశీలించిన అదనపు కలెక్టర్, ప్రభుత్వ మార్గదర్శకాలకు అనుగుణంగా అన్ని ప్రక్రియలను పారదర్శకంగా నిర్వహించాలని మిల్లర్లకు సూచించారు.

### గోడౌన్ల కొరతపై దృష్టి

అనంతరం బొమ్మరాశిపేటలోని గోడౌన్‌ను సం దర్శించిన ఆయన, ఇప్పటివరకు నిల్వ చేసిన ధాన్యం పరిమాణం, అందుబాటులో ఉన్న నిల్వ సామర్థ్యం గురించి అధికారులను అడిగి తెలుసుకున్నారు. కొనుగోలు ప్రక్రియ చివరి దశకు చేరుకుంటున్న నేపథ్యంలో నిల్వ సమస్యలు తలెత్తకుండా అదనపు గోడౌన్లను వెంటనే గుర్తించాలని సంబంధిత శాఖలకు ఆదేశించారు. రైతులకు ఇబ్బందులు లేకుండా చర్యలు ప్రభుత్వం లక్ష్యం రైతులు తమ పంటను విక్రయించేందుకు ఎలాంటి ఆటంకాలు లేకుండా చూడడమేనని అధికారులు పేర్కొన్నారు. కొనుగోలు కేంద్రం నుంచి గోడౌన్ వరకు ప్రతి దశలో సమన్వయం పెంచి, ధాన్యం కొనుగోళ్లను త్వరితగతిన పూర్తి చేయాలని జిల్లా యంత్రాంగం కసరత్తు చేస్తోంది. ధాన్యం కొనుగోళ్లలో జాప్యం, నిల్వ సమస్యలు, రసీదుల ఆలస్యం వంటి అంశాలపై ప్రత్యేక దృష్టి పెట్టిన జిల్లా యంత్రాంగం చర్యలు రైతులకు ఊరటనిచ్చే అవకాశ ముంది అన్నారు.

# సేవా కార్యక్రమాల్లో ముందుండే రాఘవేంద్ర గౌడ్

## ఎర్ర విజయరావుకు నూతన ఆటో బహుకరణ



**మేడ్చల్ జూన్ 10 (పీపుల్స్ డైరీ) :** మేడ్చల్ ప్రాంతంలో సామాజిక సేవా కార్యక్రమాలతో ప్రత్యేక గుర్తింపు పొందిన కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు రామన్న గారి రాఘవేంద్ర గౌడ్ మరోసారి తన సేవా దృక్పథాన్ని చాటుకున్నారు. మేడ్చల్ ఐఎన్‌టీయూసీ అధ్యక్షుడు ఎర్ర విజయరావు సతీమణి జన్మదిన వేడుకల్లో పాల్గొన్న ఆయన, ఈ సందర్భంగా ఎర్ర విజయరావుకు నూతన ఆటోను బహుకరించారు. ఈ కార్యక్రమం స్థానికంగా విశేష ఆకర్షణగా నిలిచింది. కుటుంబ సభ్యులు, మిత్రులు, పార్టీ నాయకులు, కార్యకర్తల సమక్షంలో జరిగిన ఈ వేడుకలో రాఘవేంద్ర గౌడ్ చేసిన సహాయం పట్ల పలువురు అభినందనలు వ్యక్తం చేశారు. ఉపాధి కల్పనకు దోహదపడే విధంగా నూతన ఆటోను అందించడం ద్వారా విజయరావు కుటుంబానికి ఆర్థికంగా అండగా నిలిచారని వారు పేర్కొన్నారు. ఈ సందర్భంగా ఎర్ర విజయరావు మాట్లాడుతూ, ప్రజా సేవలో ఎప్పుడూ ముందుండే రాఘవేంద్ర గౌడ్ అనేక సేవా కార్యక్రమాలు నిర్వహిస్తూ నిరుపేదలకు, అవసరమైన వారికి సహాయం అందిస్తున్నారని కొనియాడారు. తనకు నూతన ఆటోను బహుకరించినందుకు ప్రత్యేక కృతజ్ఞతలు తెలియజేస్తూ, ఈ సహాయం తన కుటుంబానికి ఎంతో ఉపయోగ పడుతుందని అన్నారు. రాఘవేంద్ర గౌడ్ గతంలో కూడా విద్య, వైద్యం, ఉపాధి, సామాజిక సంక్షేమ రంగాల్లో పలు సేవా కార్యక్రమాలు నిర్వహించి ప్రజల ప్రశంసలు పొందారు. సమాజంలోని వివిధ వర్గాల ప్రజలకు అండగా నిలుస్తూ సేవా కార్యక్రమాలను కొనసాగిస్తున్న ఆయనకు స్థానికులు అభినందనలు తెలియజేశారు. జన్మదిన వేడుకలు ఆనందోత్సాహాల మధ్య ఘనంగా నిర్వహి ంచబడగా, హాజరైన నాయకులు, కార్యకర్తలు ఎర్ర విజ యరావు కుటుంబ సభ్యులకు శుభాకాంక్షలు తెలి యజేశారు. రాఘవేంద్ర గౌడ్ చేసిన ఈ సహాయం సేవాభావానికి నిదర్శనంగా నిలిచిందని పలువురు అభిప్రాయపడ్డారు.

# గ్రీన్ బిజినెస్ మోడల్స్‌తో స్థిరమైన అభివృద్ధికి పరిశ్రమల అడుగులు




**మేడ్చల్ జూన్ 10 (పీపుల్స్ డైరీ) :** పర్యావరణ పరిరక్షణతో పాటు ఆర్థికాభివృద్ధిని సాధించడం నేటి కాలంలో అత్యంత ముఖ్యమైన అవసరంగా మారింది. ఈ నేపథ్యంలో తెలంగాణ ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా నిర్వహిస్తున్న 99 రోజుల ప్రజాపాలన--ప్రగతి ప్రణాళిక కార్యక్రమంలో భాగంగా తెలంగాణ కాలుష్య నియంత్రణ మండలి మేడ్చల్ ప్రాంతీయ కార్యాలయం ఆధ్వర్యంలో జీడిమెట్లలో నిర్వహించిన "గ్రీన్ బిజినెస్ మోడల్స్" అవగాహన సదస్సు ప్రాధాన్యత సంతరించుకుంది. ప్రపంచవ్యాప్తంగా పెరుగుతున్న కాలుష్యం, వాతావరణ మార్పులు, సహజ వనరుల క్షీణత వంటి సమస్యలు పరిశ్రమలను మరింత బాధ్యతాయుతమైన ఉత్పత్తి విధానాల వైపు మళ్లిస్తున్నాయి. ఈ నేపథ్యంలో గ్రీన్ బిజినెస్ మోడల్స్ అనేవి కేవలం పర్యావరణ పరిరక్షణకే కాకుండా దీర్ఘకాలిక ఆర్థిక లాభాలకు కూడా దోహదపడే మార్గాలుగా గుర్తింపు పొందుతున్నాయి. సదస్సులో క్లీనర్ టెక్నాలజీస్, వ్యర్థాల తగ్గింపు, పునరుత్పాదక ఇంధన వినియోగం, సింగిల్ యూజ్ ప్లాస్టిక్స్‌కు ప్రత్యామ్నాయాలు, సౌరశక్తి విని యోగం, ఎలక్ట్రిక్ వాహనాల ప్రోత్సాహం, నీటి నిర్వహణ, స్థిరమైన వ్యర్థాల నిర్వహణ వంటి అంశాలపై విస్తృతంగా చర్చించారు. పరిశ్రమలు తమ ఉత్పత్తి ప్రక్రియల్లో పర్యావరణహిత సాంకేతికతలను అనుసరిస్తే కాలుష్యాన్ని తగ్గించడంతో పాటు ఉత్పాదకతను పెంచుకో వచ్చని నిపుణులు వివరించారు. ప్రత్యేకంగా సింగిల్ యూజ్ ప్లాస్టిక్స్ వినియోగాన్ని తగ్గించడం నేటి సమాజం ముందున్న ప్రధాన సవాలు. ప్లాస్టిక్ కాలుష్యాన్ని తగ్గించేందుకు పర్యావరణహిత ప్రత్యామ్నాయాలను ఉపయోగించడం, వ్యర్థాలను వర్గీకరించి నిర్వహించడం, రీసైక్లింగ్‌ను ప్రోత్సహించడం వంటి చర్యలు అత్యవసరమని సదస్సులో పేర్కొన్నారు. కార్యక్రమంలో ఏర్పాటు చేసిన అవగాహన ప్రదర్శన స్టాల్ సందర్శకులను ఆకట్టుకుంది. ఘన వ్యర్థాల నిర్వహణ నియమావళి ప్రకారం రంగు-కోడ్ చెత్త బిన్‌ల వినియోగం, ప్లాస్టిక్‌కు ప్రత్యామ్నాయ ఉత్పత్తుల ప్రదర్శన ద్వారా పర్యావరణ పరిరక్షణలో ప్రతి ఒక్కరి బాధ్యతను గుర్తు చేశారు. పరిశ్రమల ప్రతినిధులు సదస్సులో చురుకుగా పాల్గొని తమ అభిప్రాయాలను పంచుకోవడం విశేషం. ఇటువంటి కార్యక్రమాలు పరిశ్రమలు, ప్రభుత్వ శాఖలు, పర్యావరణ సంస్థల మధ్య సమన్వయాన్ని పెంపొందించి స్థిరమైన అభివృద్ధి లక్ష్యాల సాధనకు దోహదపడతాయి. పర్యావరణ పరిరక్షణ అనేది ప్రభుత్వ బాధ్యత మాత్రమే కాదు, ప్రతి పరిశ్రమ, ప్రతి సంస్థ, ప్రతి పౌరుడి బాధ్యత కూడా. గ్రీన్ బిజినెస్ మోడల్స్‌ను ఆచరణలోకి తీసుకురావడం ద్వారా పరిశ్రమలు లాభదాయకతతో పాటు భవిష్యత్ తరాలకు స్వచ్ఛమైన, ఆరోగ్యకరమైన పర్యావరణాన్ని అందించే దిశగా ముందడుగు వేయగలవు.

# సభ్యత్వ నమోదు కార్యక్రమాలను విజయవంతం చేయాలి

- బీఆర్ఎస్ బలోపేతానికి కార్యకర్తలే మూలస్థంభాలు-ఎమ్మెల్యే పాడి కౌశిక్ రెడ్డి.



**హుజురాబాద్, జూన్ 10 (పీపుల్స్ డైరీ) :**బీఆర్ఎస్ పార్టీ బలోపేతానికి కార్యకర్తలే నిజమైన బలమని హుజురాబాద్ ఎమ్మెల్యే పాడి కౌశిక్ రెడ్డి అన్నారు. నియోజకవర్గంలో పార్టీ సభ్యత్వ నమోదు, ఎస్ఐఆర్ ఓటరు నమోదు ప్రక్రియ, బూత్ లెవల్ ఏజెంట్ల (బీఎల్ఏ) విధులు, బాధ్యతలపై అవగాహన కల్పించే లక్ష్యంతో సర్పంచులు, కౌన్సిలర్లు, మాజీ ప్రజాప్రతినిధులతో నిర్వహించిన సమన్వయ సమావేశంలో ఆయన పాల్గొని మాట్లాడారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ .... పార్టీ నిర్దేశించిన లక్ష్యాలకు అనుగుణంగా గ్రామ, వార్డు స్థాయిలో సభ్యత్వ నమోదు కార్యక్రమాన్ని విస్తృతంగా చేపట్టాలని పిలుపునిచ్చారు. ప్రతి గ్రామం, ప్రతి వార్డులో వంద శాతం సభ్యత్వ నమోదు లక్ష్యాన్ని సాధించాలని సూచించారు. అలాగే అర్హులైన ప్రతి ఒక్కరు ఓటరుగా నమోదయ్యేలా ప్రజల్లో విస్తృత అవగాహన కల్పించాలని కోరారు. బూత్ స్థాయిలో బీఎల్ఏలు చురుకుగా వ్యవహరిస్తూ ఓటరు జాబితాల సవరణ, పరిశీలన ప్రక్రియను సమర్థవంతంగా పర్యవేక్షించాలని సూచించారు. పార్టీని మరింత బలోపేతం చేసేందుకు ప్రజాప్రతినిధులు, నాయకులు, కార్యకర్తలు సమిష్టిగా పనిచేయాలని ఆయన అన్నారు. ఈ నెల 12న హుజురాబాద్‌లోని ఎంపీఆర్ గార్డెన్స్‌లో బీఆర్ఎస్ సభ్యత్వ నమోదు, ఎస్ఐఆర్ ఓటరు నమోదు, బీఎల్ఏల అవగాహన సదస్సును నిర్వహించనున్నట్లు ఎమ్మెల్యే వెల్లడించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా మాజీ మంత్రి టి. హరీష్ రావు హాజరుకానున్నారని తెలిపారు. పార్టీ శ్రేణులు, ప్రజాప్రతినిధులు, ముఖ్య నాయకులు పెద్ద సంఖ్యలో పాల్గొని కార్యక్రమాన్ని విజ యవంతం చేయాలని ఆయన కోరారు.

# మృతుల కుటుంబాలను పరామర్శించిన టీపీసీసీ డెలిగేట్ కల్వకుంట్ల సుజి త్ రావు



**మెట్ పల్లి జూన్ 10:(పీపుల్స్ డైరీ)** :మెట్ పల్లి పట్టణం లో సా జిద్ ,వాజిద్ ల తండ్రి గత కొన్ని రోజులుగా అనారో గ్యంతో బాధపడుతూ ఇటీ వల మరణించగా వారి కు టుంబ సభ్యులను బుధవా రం రోజు బీడీ కాలనీ లోని వారి నివాసంలో టీపీసీసీ డెలిగేట్ సుజిత్ రావు పరా మర్శించారు అనంతరం వా రి కుటుంబ సభ్యులకు ప్రగ డ సానుభూతి తెలిపారు. వారి వెంట కిసాన్ సెల్ స్టేట్ కోఆర్డినేటర్ వాకిటి సత్యం రెడ్డి, మెట్ పల్లి కాంగ్రెస్ పా ర్టీ మాజీ అధ్యక్షులు ఖుతు బోదీన్ పాషా, ఇబ్రహీంప ట్నం మండల యూత్ కాం గ్రెస్ నల్లూరి సాగర్,వెంకట గిరి,బైండ్ల శ్రీకాంత్ తదితరు లు పాల్గొన్నారు.

# ప్రధాని మోదీ దీర్ఘాయుష్షు కోసం కీసరగుట్టలో ఈటల రాజేందర్ ప్రత్యేక పూజలు



**మేడ్చల్ కీసర, జూన్ 10(పీపుల్స్ డైరీ) :** భారత ప్రధానమంత్రి నరేంద్ర మోదీ ప్రధానిగా 12 సంవత్సరాల పాలన పూర్తి చేసుకున్న సందర్భంగా కీసరగుట్ట శ్రీ రామలింగేశ్వర స్వామి ఆలయంలో బుధవారం ప్రత్యేక పూజలు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా మల్కాజిగిరి పార్లమెంట్ సభ్యుడు ఈటల రాజేందర్ స్వామివారికి ప్రత్యేక అభిషేకాలు నిర్వహించి, ప్రధాని మోదీ ఆయురారోగ్యాలతో నిండు నూరేళ్లు జీవించాలని ప్రార్థించారు. దేశ అభివృద్ధి, ప్రజా సంక్షేమం, ప్రపంచ వేదికపై భారతదేశ ప్రతిష్ఠను మరింత పెంపొందించేందుకు ప్రధాని మోదీకి భగవంతుని ఆశీస్సులు ఎల్లప్పుడూ ఉండాలని ఈటల రాజేందర్ కోరారు. గత 12 సంవత్సరాలుగా మోదీ నాయకత్వంలో దేశం పలు రంగాల్లో అభివృద్ధి సాధించిందని, ప్రజలకు సంక్షేమ పథకాల ద్వారా విశేష ప్రయోజనాలు అందాయని ఆయన పేర్కొన్నారు. ప్రత్యేక పూజల అనంతరం ఆలయ అర్చకులు ఈటల రాజేందర్‌కు తీర్థప్రసాదాలు అందజేసి ఆశీర్వచనాలు అందించారు. ఈ కార్యక్రమంలో బీజేపీ నాయకులు, కార్యకర్తలు, భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. ప్రధాని మోదీ నాయకత్వం దేశానికి మరింత కాలం అందాలని, భారతదేశం ప్రపంచంలో అగ్రగామి దేశంగా ఎదగాలని వారు ఆకాంక్షించారు. కీసరగుట్ట ఆలయంలో నిర్వహించిన ఈ ప్రత్యేక పూజలు భక్తిపూర్వక వాతావరణంలో సాగగా, ప్రధాని మోదీ దీర్ఘాయుష్షు, దేశాభివృద్ధి కోసం భక్తులు ప్రత్యేక ప్రార్థనలు చేశారు.

# బాధిత విద్యార్థి కుటుంబానికి ఆర్థిక సాయం



**మెట్ పల్లి జూన్ 10:(పీపుల్స్ డైరీ) :** అయిలాపూర్ గ్రామానికి చెందిన విద్యార్థి రాహుల్ మరణం బాధాకరమని డా క్టర్ రఘు అన్నారు. బాధిత కుటుంబానికి అయన సా నుభూతి తెలిపారు. రాహు ల్ మరణంతో దుఖంలో మునిగిపోయిన కుటుంబా నికి అండగా నిలిచారు. రాహుల్ తల్లిదండ్రులను ప రామర్శించి, బాధిత కుటుం బానికి రూ. 10,000 ఆర్థిక సాయం అందించారు. అలా గే రాహుల్ సోదరి చదువు కోసం అన్ని విధాలా అండ గా ఉంటానని కూడా భరో సా ఇచ్చారు.

# వీణవంక కారు ఓనర్ అసోసియేషన్ నూతన కమిటీ ఎన్నిక



**వీణవంక జూన్ 10( పీపుల్స్ డైరీ) :** మండలం లోని పలు గ్రామలాలో ఉన్న కార్ ఒనర్స్ అందరు కలిసి నూతనంగా మండల కమిటీని ఎన్నుకోవడం జరిగింది. అధ్యక్షులుగా ఓరం అవినాష్ ఉపాధ్యక్షుడిగా ఈదునూరి అజేష్ కార్యదర్శిగా అంబాల నవీన్ ప్రధాన కార్యదర్శిగా సంతోష్ గౌరవ అధ్యక్షులుగా ఎండి రజాక్ మట్టి రవీందర్ ను ఎన్నుకోవడం జరిగింది. అనంతరం అధ్యక్షులు మాట్లాడుతూ నా ఎన్నికకు కృషిచేసిన ప్రతి ఒక్కరికి ప్రత్యేక ధన్యవాదాలు అలాగే రానున్న రోజుల్లో కార్ డ్రైవర్ ఓనర్స్ అసోసియేషన్ కు తన వంతు సహాయ సహకారాలు అందిస్తానని ఆయన తెలిపారు. ఈ కార్యక్రమంలో డ్రైవర్లు ఓనర్స్ తదితరులు పాల్గొన్నారు.

# చేట్లను నాటిన ఎస్సై ఆవుల తిరుపతి

## ప్రజాపాలన ప్రగతి ప్రణాళిక లో భాగంగా ...



**వీణవంక జూన్ 10( పీపుల్స్ డైరీ) :** మండలంలోని కనపర్తి, హిమ్మత్ నగర్ గ్రామాలలో ప్రజాపాలన ప్రగతి ప్రణాళిక కార్యక్రమంలో భాగంగా వన మహోత్సవంలో ఎస్సై ఆవుల తిరుపతి ఆధ్వర్యంలో పాలకవర్గం సభ్యులు మొక్కలను నాటారు. ఈ సందర్భంగా ఎస్సై ఆవుల తిరుపతి మాట్లాడుతూ. పర్యావరణం కలుషితం కాకుండా ప్రతి ఒక్కరూ బాధ్యత తీసుకొని ఇంటి ముందు చెట్లను నాటాలని సూచించారు. అదేవిధంగా గ్రామీణ ప్రాంతాలలో ఉన్న విద్యార్థులు మత్తు పదార్థాలకు అలవాటు పడకుండా వారి జీవితాలకు బంగారు బాటలు వేసుకోవాలని వారు కోరారు. డ్రగ్స్ కు సంబంధించిన సమాచారం ఉన్నట్లయితే పోలీసులకు అందజేయాలన్నారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ లు జడల శ్రీకాంత్, మహాకళ ఉమా శ్యాంసుందర్ రెడ్డి, ఉపసర్పంచ్ లు మేక శ్రీనివాస్, బొందయ్య పర్లపెల్లి, కర్ణ కంటి సప్న భాస్కర్ రెడ్డి, దాస రమేష్, గెల్లు కొమురయ్య, సంపత్ తిరుపతిరెడ్డి ప్రభాకర్, తిరుపతి గ్రామ ప్రజలు యువకులు మహిళలు తదితరులు పాల్గొన్నారు

## నకిలీ విత్తనాలను అరికట్టాలి

**రైతాంగానికి నాణ్యమైన విత్తనాలు అందించాలి: వి హెచ్ పి ఎస్ అధ్యక్షులు బిక్షపతి**



**సైదాపూర్ జూన్ 10 ( పీపుల్స్ డైరీ ) :** కరీంనగర్ జిల్లాలో వర్షాకాలం సీజన్ ప్రారంభమవుతున్న సందర్భంగా వ్యవసాయ శాఖ అధికారులు నకిలీ విత్తనాల విక్రయాలను కట్టడి చేసి, రైతాంగానికి నాణ్యమైన విత్తనాలు అందుబాటులో ఉంచాలని ప్రభుత్వాన్ని అధికారులను కోరారు.ప్రతి ఏడాది నకిలీ విత్తనాల వల్ల రైతులు తీవ్రంగా నష్టపోతున్నారని ఆయన ఆందోళన వ్యక్తం చేశారు. అధికారులు కఠిన చర్యలు తీసుకొని నకిలీ విత్తనాల వ్యాపారులపై కేసులు నమోదు చేయాలని డిమాండ్ చేశారు.వ్యవసాయ శాఖ ఆధ్వర్యంలో గ్రామ స్థాయిలో తనిఖీలు నిర్వహించి, రైతులకు ధృవీకరించిన నాణ్యమైన విత్తనాలను అందించాలని కోరారు. రైతులు మోసపోకుండా అవగాహన కార్యక్రమాలు చేపట్టాలని ప్రభుత్వాన్ని కి బిక్షపతి విజ్ఞప్తి చేశారు.

## కర్ణ వేదన కార్యక్రమనికి హాజరైన కాంగ్రెస్ నాయకులు



**వీణవంక జూన్ 10( పీపుల్స్ డైరీ) :** మండల కేంద్రంకు చెందిన రసపల్లి దివ్య –శ్రీనివాస్ ల కూతురు శివాత్మిక కర్ణ వెదవ కార్యక్రమానికి హాజరైన కాంగ్రెస్ మండల నాయకులు శ్రీ వెంకటేశ్వర గార్డెన్ కోరపల్లి లో జరిగింది.ఈ కార్యక్రమనికి హాజరై చిన్నారిని ఆశీర్వదించిన మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు ఎక్కటి రఘుపాల్ రెడ్డి, మాజీ అధ్యక్షులు ఎండీ సాహెబ్ హుస్సేన్, నాయకులు గంగాడి తిరుపతి రెడ్డి, కొమ్మిడి రాకేష్ రెడ్డి, సర్పంచ్ ల ఫోరం అధ్యక్షులు గెల్లు శ్రీనివాస్, కలికొండ మధుకర్, జిల్లా కార్యదర్శి కంకణాల జగదీశ్వర్ రెడ్డి, మార్కెట్ డైరెక్టర్ లు మాదాసు సునీల్, ఎండీ రషీద్, మాజీ సర్పంచ్ లు పంజాల సతీష్, పానుగంటి మధుకర్ తదితరులు పాలుగోన్నారు.

## రెండు నెలలుగా నీటి కష్టాలు..



**మేడ్చల్ కీసర జూన్ 10 (పీపుల్స్ డైరీ) :** చీర్యాల గ్రామ ప్రధాన ఎస్సీ కాలనిలో తీవ్ర నీటి కొరత నెలకొంది. దాదాపు రెండు నెలలుగా మంచినీటి సరఫరా నిలిచిపోవడంతో సుమారు 200 కుటుంబాలు తీవ్ర ఇబ్బం దులు ఎదుర్కొంటున్నాయి. కాలనికి నీటిని అందించే బోరు మరియు భూగర్భ సప్లై పైప్‌లైన్లు రస్ట్ పట్టి పూర్తిగా దెబ్బతినడంతో పరిస్థితి మరింత దారుణంగా మారింది. ప్రతిరోజూ తాగునీరు, వంట, ఇతర గృహ అవసరాల కోసం కాలనీవాసులు అవస్థలు పడుతు న్నారు. అంతేకాకుండా స్థానిక దేవాల యాన్ని శుభ్రపరచడం వంటి కార్యక్ర మాలు కూడా నీటి కొరత కారణంగా నిలిచిపోయాయని గ్రామ–స్తులు వాపోతు న్నారు. ఈ నేపథ్యంలో కాలనీవాసులు కీసర డివిజన్ డిప్యూటీ కమిషనర్‌ను వేడుకుం టూ, సమస్యను అత్యవసరంగా గుర్తించి దెబ్బతిన్న బోరు మరియు పైప్‌లైన్ల మరమ్మతులు చేపట్టి తక్షణమే మంచినీటి సరఫరాను పునరుద్ధరించాలని కోరుతున్నారు.మంచినీరు ప్రతి పౌరుడి ప్రాథమిక హక్కు రెండు నెలలుగా నీటి కోసం పడుతున్న కష్టాలకు ముగింపు పలికేలా అధికారులు వెంటనే స్పందించి చర్యలు తీసుకోవాలి" అని స్థానికులు విజ్ఞప్తి చేస్తున్నారు.

## ప్రజా పాలన ప్రగతి ప్రణాళికలో ప్రజా సమస్యలపై చర్చ

సమావేశంలో మాట్లాడుతున్న 19వ వార్డు కౌన్సిలర్ పట్లూరి రోజా నాగరాజు



**సదాశివపేట, జూన్ 10 :** సదాశివపేట పట్టణంలోని 19వ వార్డులో బుధవారం ప్రజా పాలన ప్రగతి ప్రణాళిక కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా మున్సిపల్ చైర్‌పర్సన్ మునిపల్లి అంజమ్మ సత్యనారాయణ, వైస్ చైర్‌పర్సన్ రేణుక, మున్సిపల్ కమిషనర్ హాజరయ్యారు.ఈ సందర్భంగా 19వ వార్డు కౌన్సిలర్ పట్లూరి రోజా నాగరాజ్ గౌడ్ మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ, అభివృద్ధి పథకాలను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. అలాగే ప్రత్యేక ఓటరు నమోదు కార్యక్రమం (ఎస్ఐఆర్)లో భాగంగా ఓటర్ మ్యాపింగ్‌ను ప్రతి ఒక్కరూ నమోదు చేసుకోవాలని కోరారు. అలాగే మహిళలకు ఇందిరమ్మ చీరలు పంపిణీ చేయడం జరిగింది.వార్డులో నెలకొన్న సమస్యలను ప్రజలు తమ దృష్టికి తీసుకొస్తే ప్రాధాన్యత ఆధారంగా పరిష్కరిస్తామని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో వార్డు అభివృద్ధి, ప్రజా సమస్యలు, ప్రభుత్వ పథకాల అమలుపై చర్చించారు.ఈ కార్యక్రమంలో పట్టణ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు పట్లూరి నాగరాజు గౌడ్, కాంగ్రెస్ నాయకులు అవసలి బ్రహ్మానందం, మంగలి విజయ్ కుమార్, శోభారాణి, ఆర్పీలు, ఓబీలు, వార్డు ప్రజలు, మున్సిపల్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## గ్రీన్ బిజినెస్ మోడల్స్‌పై అవగాహన సదస్సు

**పరిశ్రమల్లో పర్యావరణహిత విధానాల అమలుపై చర్చ**




**మేడ్చల్, జూన్ 10(పీపుల్స్ డైరీ) :** తెలంగాణ ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన 99 రోజుల ప్రజాపాలన -- ప్రగతి ప్రణాళిక కార్యక్రమంలో భాగంగా తెలంగాణ కాలుష్య నియంత్రణ మండలి ప్రాంతీయ కార్యాలయం, మేడ్చల్ ఆధ్వర్యంలో "గ్రీన్ బిజినెస్ మోడల్స్"పై అవగాహన సదస్సు జీడిమెట్ల ఇండస్ట్రియల్ అసోసియేషన్ సమావేశ మందిరంలో బుధవారం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి పర్యావరణ ఇంజనీర్ మరియు నోడల్ అధికారి బి. రాజేందర్ అధ్యక్షత వహించారు. జీడిమెట్ల ఇండస్ట్రీస్ అసోసియేషన్, ఐఏఎల్ఏ, బీడీఎంఏ, ప్లాస్టిక్ తయారీదారుల సంఘం ప్రతినిధులతో పాటు వివిధ పరిశ్రమలకు చెందిన ప్రతినిధులు పాల్గొన్నారు. సదస్సులో క్లీనర్ టెక్నాలజీలు, వ్యర్థాల నిర్వహణ, వ్యర్థాల తగ్గింపు, పునరుత్పాదక ఇంధన వినియోగం వంటి అంశాలపై పవర్‌పాయింట్ ప్రజెంటేషన్లు నిర్వహించారు. సింగిల్ యూజ్ ప్లాస్టిక్స్ వినియోగాన్ని తగ్గించే మార్గాలు, పర్యావరణహిత ప్రత్యామ్నాయ ఉత్పత్తులు, గ్రీన్ మోడలింగ్ టెక్నాలజీలు, సౌరశక్తి, ఎలక్ట్రిక్ వాహనాల వినియోగం, నీటి సంరక్షణ, మొక్కల పెంపకం, స్థిరమైన వ్యర్థాల నిర్వహణ తదితర అంశాలపై అవగాహన కల్పించారు. అలాగే సింగిల్ యూజ్ ప్లాస్టిక్స్‌కు ప్రత్యామ్నాయ ఉత్పత్తులు, ఘన వ్యర్థాల నిర్వహణ నియమావళి ప్రకారం రంగు–కోడ్ చెత్త బిన్‌ల వినియోగంపై ప్రత్యేక అవగాహన ప్రదర్శన స్టాల్‌ను ఏర్పాటు చేశారు.సదస్సులో పాల్గొన్న ప్రతినిధులు ఆసక్తిగా చర్చల్లో పాల్గొని పర్యావరణ పరిరక్షణకు పరిశ్రమల పాత్రపై అభిప్రాయాలను పంచుకున్నారు. కార్యక్రమానికి హాజరైన వారికి జనపనార (జూట్) సంచులను పంపిణీ చేశారు. ఈ అవగాహన సదస్సులో సుమారు 60 మంది ప్రతినిధులు పాల్గొన్నారు. కార్యక్రమానికి సంబంధించిన ఛాయాచిత్రాలను అధికారులు విడుదల చేశారు.

## ప్రభుత్వ కళాశాల గ్రౌండ్‌ను కబ్జాల నుంచి కాపాడాలి

- **బాధ్యులపై వెంటనే చర్యలు తీసుకోవాలి: బీజేపీ పట్టణ అధ్యక్షుడు తూర్పాటి రాజు.**



**హుజూరాబాద్, జూన్ 10, (పీపుల్స్ డైరీ) :** హుజూరాబాద్ పట్టణ నడిబొడ్డున ఉన్న ప్రభుత్వ జూనియర్ మరియు డిగ్రీ కళాశాల ఆవరణలోని విలువైన ప్రభుత్వ భూమి, క్రీడా ప్రాంగణాన్ని కబ్జా చేసేందుకు కొందరు ప్రయత్ని స్తున్నారని భారతీయ జనతా పార్టీ హుజూరాబాద్ పట్టణ అధ్యక్షుడు తూర్పాటి రాజు ఆందోళన వ్యక్తం చేశారు. ఈ మేరకు విడుదల చేసిన ప్రకటనలో ఆయన మాట్లాడుతూ, ప్రభుత్వ జూనియర్, డిగ్రీ కళాశాలల్లో చదువుతున్న పేద, మధ్యతరగతి విద్యార్థులకు ఈ స్థలం భవిష్యత్తులో క్రీడా మైదానంగా, విద్యార్థుల అభివృద్ధికి ఉపయోగపడే కీలక ఆస్తి అని పేర్కొన్నారు. అలాంటి ప్రభుత్వ భూములను పరిరక్షించడం ప్రభుత్వ బాధ్యత అని అన్నారు.విద్యార్థుల భవిష్యత్తుకు ఉపయోగపడాల్సిన స్థలాలను కొందరు అక్రమంగా ఆక్రమించుకునేందుకు ప్రయత్నించడం దురదృష్టకరమని పేర్కొంటూ, రెవెన్యూ మరియు విద్యాశాఖ అధికారులు వెంటనే స్పందించి సమగ్ర సర్వే నిర్వహించి ప్రభుత్వ భూమి హద్దులను స్పష్టంగా గుర్తించాలని డిమాండ్ చేశారు. అదేవిధంగా కళాశాల చుట్టూ పటిష్టమైన ప్రహరీ గోడను నిర్మించి, భవిష్యత్తులో ఎలాంటి ఆక్రమణలు జరగకుండా చర్యలు తీసుకోవాలని కోరారు. ప్రభుత్వ ఆస్తుల పరిరక్షణలో నిర్లక్ష్యం ప్రదర్శించే అధికారులపై కూడా చర్యలు తీసుకోవాలని ప్రభుత్వాన్ని విజ్ఞప్తి చేశారు.ప్రభుత్వ భూములను కాపాడడంలో ప్రభుత్వం విఫలమైతే, బాధ్యులపై చర్యలు తీసుకోకపోతే భారతీయ జనతా పార్టీ ఆధ్వర్యంలో విద్యార్థులు, ప్రజలతో కలిసి పెద్ద ఎత్తున ఉద్యమాలు చేపడతామని హెచ్చరించారు."ప్రభుత్వ భూమి ప్రజల ఆస్తి.. దానిని పరిరక్షించడం ప్రతి ఒక్కరి బాధ్యత" అని తూర్పాటి రాజు పేర్కొన్నారు.

## తుగ్లక్ పాలనను తలపిస్తున్న రేవంత్ నిర్ణయాలు

- **27 వేల బడులను 4 వేలకు కుదించే ప్రతిపాదనను వెంటనే ఉపసంహరించుకోవాలి**
- **బిఆర్ఎస్ మండల మాజీ అధ్యక్షులు మండల సురేందర్**

**భీమదేవరపల్లి జూన్ 10 (పీపుల్స్ డైరీ ):** రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వ హయాంలో విద్యాశాఖ నిర్వహణ పూర్తిగా అధ్వానంగా మారిందని, ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి తీసుకుంటున్న నిర్ణయాలు తుగ్లక్ పాలనను తలపిస్తున్నాయని బీఆర్ఎస్ పార్టీ మాజీ మండల అధ్యక్షులు మండల సురేందర్ తీవ్రస్థాయిలో ధ్వజమెత్తారు. బుధవారం నాడు ఆయన భీమదేవరపల్లిలో మీడియాతో మాట్లాడుతూ.. ప్రభుత్వ విద్యను బలోపేతం చేయాల్సిన సమయంలో, దాన్ని పూర్తిగా బలహీనపరిచే విధానాలను అవలంబించడం ఆందోళన కలిగిస్తోందన్నారు. ఒకవైపు ప్రభుత్వ విద్యను అభివృద్ధి చేస్తామని ప్రగల్భాలు పలుకుతూనే, మరోవైపు రాష్ట్రంలోని 27 వేల ప్రభుత్వ పాఠశాలలను కేవలం 4 వేలకు కుదించేందుకు ప్రయత్నించడం రేవంత్ సర్కారు అసమర్థతకు నిదర్శన మన్నారు. భారత రాజ్యాంగంలోని ఆర్టికల్ 21ఎ ప్రకారం 6 నుండి 14 సంవత్సరాల వయస్సు గల ప్రతి బాలబాలికకు ఉచిత,నిర్బంధ విద్యను అందించడం ప్రభుత్వ ప్రాథమిక బాధ్యతని తెలిపారు.పాఠశాలల కుదింపు నిర్ణయం విద్యా హక్కు చట్టం (ఆర్టీఈ–2009) స్ఫూర్తికి పూర్తిగా విరుద్ధమన్నారు. పాఠశాలల విలీనం లేదా కుదింపు కారణంగా గ్రామీణ ప్రాంత పేద విద్యార్థులు విద్యా సౌకర్యాలకు దూరమై, తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొనే ప్రమాదం ఉందన్నారు. విద్యారంగంపై చేసే ఖర్చును ప్రభుత్వం వ్యయంగా కాకుండా, దేశ భవిష్యత్ తరాలపై పెట్టే పెట్టుబడిగా చూడాలన్నారు.గ్రామీణ పాఠశాలలను బలోపేతం చేయడం ద్వారానే సామాన్యుల పిల్లలకు నాణ్యమైన విద్య అందుతుందన్నారు. రేవంత్ ప్రభుత్వ విద్యా వ్యతిరేక విధానాలను నిరసిస్తూనే విద్యా కమిషన్ చైర్మన్ తన పదవికి రాజీనామా చేశారని, ఈ ఒక్క ఘటనతోనే విద్యాశాఖలో పరిస్థితి ఎంత దారుణంగా ఉందో అర్థమవుతోందని విమర్శించారు.కాంగ్రెస్ ప్రభుత్వం ఇప్పటికైనా తన మొండి వైఖరిని వీడి,



పాఠశాలల కుదింపు నిర్ణయాన్ని వెంటనే ఉపసంహరించుకోవాలని మండల సురేందర్ డిమాండ్ చేశారు. తక్షణమే ఉపాధ్యాయుల ఖాళీలను భర్తీ చేయాలని, పాఠశాలల్లో మౌలిక వసతులను మెరుగుపరిచి ప్రభుత్వ విద్యా ప్రమాణాలను పెంపొందించేలా చర్యలు చేపట్టాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు.

## వ్యాధుల నివారణకు పరిశుభ్రతే ప్రధాన ఆయుధం..

- **మన ఇంటి నుండే మార్పు రావాలి**
- **చెత్త సేకరణతో పరిశుభ్రమైన పట్టణంగా మారుద్దాం..**
- **జగిత్యాల ఎమ్మెల్యే డాక్టర్ సంజయ్ కుమార్**
- **జిల్లా కలెక్టర్ బి. సత్య ప్రసాద్**

**జగిత్యాల జిల్లా ప్రతినిధి, జూన్ 10 :** జగిత్యాల పట్టణంలో ప్రజాపాలన ప్రగతి ప్రణాళికలో భాగంగా బుధవారం నిర్వహించిన వార్డు సభలు, ఇందిరమ్మ చీరల పంపిణీ కార్యక్రమాలు పట్టణంలోని పలు వార్డులలో ఏర్పాటు చేసిన వార్డు సభల్లో జగిత్యాల ఎమ్మెల్యే డాక్టర్ సంజయ్ కుమార్, జిల్లా కలెక్టర్ బి. సత్య ప్రసాద్, మున్సిపల్ చైర్ పర్సన్ సమీండ్ల వాణి శ్రీనివాస్, ముఖ్య అతిథులుగా హాజరై, లబ్ధిదారులైన మహిళలకు ఇందిరమ్మ చీరలను అందజేశారు.



జిల్లా కలెక్టర్ బి. సత్య ప్రసాద్ మాట్లాడుతూ

### ఎమ్మెల్యే సంజయ్ కుమార్ మాట్లాడుతూ

పట్టణాన్ని పరిశుభ్రంగా, అభివృద్ధి పథంలో ముందుకు తీసుకెళ్లేందుకు ప్రభుత్వం కట్టుబడి ఉందన్నారు. వర్షాకాలాన్ని దృష్టిలో ఉంచుకుని పారిశుద్ధ్య నిర్వహణపై ప్రత్యేక శ్రద్ధ అవసరమని తెలిపారు. ప్రతి ఇంటి నుంచి వచ్చే తడి చెత్త, పొడి చెత్తను వేర్వేరుగా సేకరించి మున్సిపల్ సిబ్బందికి అందించాలని, దీంతో చెత్త నిర్వహణ మరింత సమర్థవంతంగా సాగుతుందని అన్నారు. అలాగే మెడికల్ వ్యర్థాలు, ప్రమాదకర వ్యర్థాలను సాధారణ చెత్తతో కలపకుండా ప్రత్యేకంగా నిర్వహించడం ద్వారా ప్రజారోగ్యాన్ని కాపాడవచ్చని పేర్కొన్నారు. కాలువలు, డ్రైనేజీలను పరిశుభ్రంగా ఉంచడం ద్వారా వర్షాకాలంలో నీటి నిల్వలు, దోమల వ్యాప్తి వంటి సమస్యలను నివారించవచ్చన్నారు. ప్రతి ఒక్కరూ తమ పరిసరాలను పరిశుభ్రంగా ఉంచడంలో బాధ్యతగా వ్యవహరించాలని కోరారు. అదేవిధంగా ఓటు హక్కు ఉన్న వారందరూ సర్ లో తమ పేర్లను నమోదు చేసుకోవాలని సూచించారు. ఇప్పటికే డబుల్ బెడ్ రూమ్ సముదాయాల వద్ద ప్రైమరీ స్కూల్, హెల్త్ సెంటర్ మొదలైనవి ప్రారంభించుకోవడం జరిగిందని, జగిత్యాల పట్టణాన్ని రాష్ట్రంలోనే అగ్రగామిగా, ఆదర్శ పట్టణంగా తీర్చిదిద్దే బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉందన్నారు. పర్యావరణ వ్యవస్థను, వృక్ష, జంతుజాలాన్ని దెబ్బతీస్తున్న ప్లాస్టిక్, కాలుష్య వ్యర్థాల పట్ల అప్రమత్తంగా ఉండాలని పిలుపునిచ్చారు. మన నిర్లక్ష్యం వల్ల తాగే నీరు, పీల్చే గాలి, తినే తిండి కలుషితం అవుతున్నాయని ఆవేదన వ్యక్తం చేస్తూ, ఈ పరిస్థితిని మార్చడానికి ప్రతి ఇల్లూ ఒక పునాదిగా మారాలని కోరారు. ఇళ్ల నుండి వచ్చే వ్యర్థాలను రోడ్లపై వేయకుండా తడి చెత్త, పొడి చెత్త, శానిటరీ వ్యర్థాలు, హానికరమైన కెమికల్ వ్యర్థాలుగా నాలుగు రకాలుగా వేరు చేసి మున్సిపల్ వాహనాలకు అందించాలని స్పష్టం చేశారు. వంటగది వ్యర్థాలైన తడి చెత్త ద్వారా మేలైన ఎరువుల తయారీ జరుగుతుందని, ప్లాస్టిక్, పేపర్ల వంటి పొడి చెత్తను రీసైక్లింగ్‌కు పంపవచ్చని వివరించారు. చిన్నపిల్లల డైపర్లు, ప్యాడ్ల వంటి శానిటరీ వ్యర్థాలను, అలాగే బ్యాటరీలు, కెమికల్ బాటిళ్ల వంటి ప్రమాదకర వ్యర్థాలను విడిగా ఇవ్వడం ద్వారా పారిశుధ్య కార్మికులకు ఎంతో మేలు జరుగుతుందన్నారు. పట్టణంలోని వార్డులలో ఈ సరికొత్త 4–డబ్బాల చెత్త సేకరణ విధానాన్ని ప్రయోగాత్మకంగా అమలు చేయబోతున్నట్లు ప్రకటించారు. మనం కలిపి ఇచ్చే చెత్త వలన డబుల్ బెడ్ రూమ్ సముదాయాల వాసులకు ఇబ్బందులు ఏర్పడుతాయని, ప్రజలు సహకరించాలని కోరారు. రాష్ట్ర సంక్షేమ శాఖ మంత్రి అడ్లూరి లక్ష్మణ్ కుమార్ చేతుల మీదుగా మరిన్ని అభివృద్ధి పనులు చేపడుతున్నామని తెలిపారు.

వర్షాకాలంలో వ్యాధుల నివారణకు పరిశుభ్రతే ప్రధాన ఆయుధమని అన్నారు. తడి చెత్త, పొడి చెత్తను విడదీసి ఇవ్వడం వల్ల చెత్త శాస్త్రీయ నిర్వహణకు అవకాశం కలుగుతుందని, ప్రజలు ఈ విధానాన్ని తప్పనిసరిగా పాటించాలని సూచించారు. ఇంటి పరిసరాలు, ఖాళీ స్థలాలు, కాలువలు పరిశుభ్రంగా ఉంచడం ద్వారా దోమల ద్వారా వ్యాపించే వ్యాధులను నివారించవచ్చన్నారు. వాడిన సూదులు, మందుల సీసాలు, వైద్య సంబంధిత వ్యర్థాలను సాధారణ చెత్తతో కలపకుండా ప్రత్యేకంగా పారవేయాలని, ప్రజారోగ్య పరిరక్షణలో ఇది ఎంతో ముఖ్యమని తెలిపారు. పారిశుద్ధ్య కార్యక్రమాల్లో ప్రజల భాగస్వామ్యం కీలకమని, మున్సిపాలిటీ చేపట్టే కార్యక్రమాలకు ప్రతి ఒక్కరూ సహకరించాలని కోరారు. అలాగే ఓటు హక్కు ఉన్న వారందరూ సర్ లో తమ పేర్లను నమోదు చేసుకోవాలని తెలిపారు. 18 ఏళ్లు నిండిన అర్హులైన మహిళలందరికీ ఇందిరమ్మ చీరలను అందజేస్తున్నామని, వార్డు సభలలో ప్రజల నుంచి వచ్చిన వినతులను వీలైనంత త్వరగా పరిష్కరిస్తామని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ సామిండ్ల వాణి, మున్సిపల్ కమిషనర్ సత్య ప్రణవ్, జగిత్యాల అర్బన్ తహసిల్దార్ రామ్మోహన్, టౌన్ సీఐ కరుణాకర్, కౌన్సిలర్లు, సంబంధిత శాఖల అధికారులు, స్థానిక ప్రజా ప్రతినిధులు, మున్సిపల్ సిబ్బంది, మహిళ సంఘాల సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

# 20 కోట్ల మంది సందర్శకులు

- 2025లో అయోధ్యకు పోటెత్తిన పర్యాటకులు
- 2024లో 16.44 కోట్లు...
- గణనీయంగా పెరిగిన అయోధ్య ఆదాయం



**పీపుల్స్‌డైరీ–అయోధ్య :** రామ మందిర నిర్మాణంతో అయోధ్య రూపురేఖలే మారిపోయాయి. బీజేపీ తన చిరకాల కల అయిన రామ మందిరాన్ని 2024లో పూర్తి చేసింది. దేశం గర్వించదగ్గ స్థాయిలో, ప్రపంచం మనవైపు చూసేలా నిర్మించిన రామ మందిరాన్ని వీక్షించేందుకు సందర్శకులు పోటీ పడుతున్నారు. 2024లో ఆలయ ప్రారంభోత్సవం తర్వాత అయోధ్య నగరానికి పర్యాటకుల రద్దీ భారీగా పెరిగింది. ఆలయ నిర్మాణంతో పాటు నగరంలో మౌలిక వసతులు కూడా కల్పించడంతో పర్యాటకులు వచ్చేందుకు ఆసక్తి చూపుతున్నారు.

ప్రెస్ ఇన్ఫర్మేషన్ బ్యూరో విడుదల చేసిన వివరాల ప్రకారం 2020లో అయోధ్యను సందర్శించిన వారి సంఖ్య 60.22 లక్షలు ఉండగా.. 2024 నాటికి అది 16.44 కోట్లకు పెరిగింది. 2025 తొలి మూడు నెలల్లోనే 20 కోట్లకు పైగా సందర్శకులు వచ్చినట్లు అధికారిక గణాంకాలు వెల్లడించాయి. అయోధ్యకు సరైన రవాణా సౌకర్యం ఉండటం కూడా పర్యాటకుల సంఖ్య పెరగడంలో ప్రధానంగా కనిపిస్తోంది.

ఉత్తరప్రదేశ్ పర్యాటక శాఖ వివరాల ప్రకారం 2017లో అయోధ్యను 28.4 లక్షల మంది సందర్శించగా, 2022లో 2.39 కోట్ల మంది, 2023లో 5.79 కోట్ల మంది, 2024లో 16.44 కోట్ల మంది సందర్శించారు. 2025లో తొలి మూడు నెలల్లోనే ఆ సంఖ్య 20 కోట్లను దాటడం విశేషం.

అయోధ్యకి పర్యాటకులు రావడానికి అనుకూలమైన రవాణా సౌకర్యం ఉంది. అయోధ్య ధామ్ రైల్వే స్టేషన్‌ను పునర్నిర్మాణం చేయగా, మహర్షి వాల్మీకీ ఇంటర్నేషనల్ ఎయిర్‌పోర్టును కూడా ప్రారంభించారు. దాంతో అయోధ్యకు చేరుకోవడం చాలా ఈజీ అయింది. ఢిల్లీ, ముంబై, బెంగళూరు, చెన్నై, కోల్‌కతా వంటి ప్రధాన నగరాల నుంచి నేషనల్ హైవేలు కూడా ఉన్నాయి.

పర్యాటకుల సంఖ్య పెరగడంతో వ్యాపార రంగాలు కూడా అభివృద్ధి చెందాయి. హోటల్ రంగం, రిటైల్ వ్యాపారాలు, రవాణా సేవలు, యాత్రికులకు సంబంధించిన సేవలు పెరిగాయి. ఐఐఎం లక్నో అధ్యయనం ప్రకారం రామ మందిరం ప్రారంభానికి ముందు ఒక్కో షాప్‌కి రోజుకు రూ. 400 – 500 ఆదాయం ఉంటే.. ఇప్పుడు సగటున రూ. 2,500 వరకు సంపాదిస్తున్నారని చెబుతున్నారు. రెండేళ్లలోనే ఐదు రెట్ల ఆదాయం పెరిగింది. అంతేకాకుండా అయోధ్య నుంచి సుమారు రూ. 400 కోట్ల జీఎస్టీ ఆదాయం వచ్చినట్లు అధ్యయనం వెల్లడించింది.

# తెలంగాణాకు కేంద్రం శుభవార్త..

**జీరాంజీ పథకం క్రింద రూ.3825 కోట్లు!**

**పీపుల్స్‌డైరీ–హైదరాబాద్ :** గ్రామీణ ఆర్థిక వ్యవస్థను బలోపేతం చేయడం, వలసలను నివారించడమే లక్ష్యంగా కేంద్రప్రభుత్వం సరికొత్త వ్యూహంతో ముందుకు వచ్చింది. దశాబ్దాలుగా దేశవ్యాప్తంగా అట్టడుగు వర్గాలకు జీవనోపాధిని కల్పిస్తున్న మహాత్మాగాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం స్వరూపాన్ని మార్చేస్తూ, దాని స్థానంలో 'జీరాంజీ' అనే సరికొత్త వినూత్న పథకాన్ని ప్రవేశపెడుతోంది. ఈ చారిత్రాత్మక మార్పు రాబోయే జులై 1వ తేదీ నుంచి దేశవ్యాప్తంగా అన్ని రాష్ట్రాల్లో ఏకకాలంలో అధికారికంగా అమలులోకి రానుంది.

ఈ నూతన విధానం కింద తెలంగాణ రాష్ట్రానికి పెద్ద ఎత్తున నిధులను మంజూరు చేస్తూ కేంద్ర ప్రభుత్వం కీలక ఉత్తర్వులు జారీ చేసింది. కేంద్ర పంచాయతీరాజ్ మరియు గ్రామీణాభివృద్ధి శాఖ వెల్లడించిన తాజా నివేదికల ప్రకారం.. 2026–27 ఆర్థిక సంవత్సరానికి గానూ మిగిలి ఉన్న తొమ్మిది నెలల కాలానికి ఈ నిధుల కేటాయింపులు జరిగాయి. కొత్త నిబంధనల ప్రకారం ఈ జీరాంజీ పథకంలో కేంద్ర ప్రభుత్వ వాటా 60 శాతంగా ఉంటుంది.

ఈ 60 శాతం వాటా కింద తెలంగాణ రాష్ట్రానికి అత్యంత ప్రాధాన్యత ఇస్తూ రూ. 3,825.31కోట్లను కేటాయిస్తూ కేంద్ర మంత్రిత్వ శాఖ మంగళవారం అధికారికంగా ఉత్తర్వులు జారీ చేసింది. ఈ నిధులు నేరుగా రాష్ట్ర అకౌంట్లకు చేరనున్నాయి. ఈ నూతన జీరాంజీ పథకం కింద రాబోయే తొమ్మిది నెలల కాలంలో తెలంగాణ రాష్ట్రవ్యాప్తంగా వివిధ గ్రామీణాభివృద్ధి పనుల కోసం మొత్తం రూ. 6,375.52 కోట్లను ఖర్చు చేయాల్సి ఉంటుందని అంచనా వేశారు.

ఇందులో కేంద్రం అందించే నిధులు పోగా, మిగిలిన 40 శాతం నిధులను రాష్ట్ర ప్రభుత్వం తన సొంత వనరుల నుంచి తప్పనిసరిగా సమకూర్చుకోవాలని కేంద్రం స్పష్టం చేసింది. దీని ప్రకారం తెలంగాణ ప్రభుత్వం తన వాటా కింద రూ. 2,550.21కోట్లను వెచ్చించి ఈ పనులను విజయవంతంగా నిర్వహించాల్సి ఉంటుంది. ఒకవేళ రాష్ట్ర ప్రభుత్వం తన వాటాను సకాలంలో విడుదల చేయకపోతే, కేంద్ర నిధుల వినియోగంలో సాంకేతిక ఇబ్బందులు తలెత్తే అవకాశం ఉంటుంది.

గతంలో ఉన్న ఉపాధి హామీ పథకంతో పోలిస్తే ఈ 'జీరాంజీ' పథకంలో కేవలం కూలీ పనులకే పరిమితం కాకుండా, గ్రామీణ ప్రాంతాలలో శాశ్వత మౌలిక వసతుల కల్పనకు ఎక్కువ ప్రాధాన్యత ఇవ్వనున్నారు. గ్రామాల్లో అంతర్గత రహదారులు, వైకుంఠ ధామాలు, రైతు వేదికల నిర్వహణ మరియు ప్రభుత్వ పాఠశాలల ప్రహరీల నిర్మాణానికి ఈ నిధులను వాడుకోవచ్చు. కొత్త పథకంలో భాగంగా డిజిటల్ అటెండెన్స్ మరియు బయోమెట్రిక్ విధానాన్ని మరింత కఠినతరం చేయనున్నారు. దీనివల్ల నకిలీ కూలీల పేరిట జరిగే నిధుల దుర్వినియోగానికి అడ్డుకట్ట పడుతుంది.

# 3శాతమే నీటి లభ్యత

(మొదటి పేజీ తరువాయి)

జల వనరుల్లో కేవలం 3 శాతం మాత్రమే లభ్యత ఉండటం గమనార్హం. జనాభా సాంద్రతకు, నీటి లభ్యతకు మధ్య ఉన్న ఈ తేడా నగర జీవనాన్ని ప్రశ్నార్థకం చేస్తోంది.

కేంద్ర నివేదిక ప్రకారం.. తెలంగాణ రాష్ట్రవ్యాప్తంగా ఏడాదికి సగటున 19.8 లక్షల హెక్టార్ మీటర్ల మేర భూగర్భ జల వనరులు ఉన్నాయి. అయితే.. హైదరాబాద్, మేడ్చల్–మల్కాజిగిరి, రంగారెడ్డి జిల్లాల పరిధిలోకి వచ్చే గ్రేటర్ హైదరాబాద్ రీజియన్‌కు మాత్రం కేవలం 66 వేల హెక్టార్ మీటర్ల నీరు మాత్రమే అందుబాటులో ఉంది. రాష్ట్రంలోని 33 జిల్లాల సగటును పరిశీలిస్తే.. ప్రతి జిల్లాకు దాదాపు 63 వేల హెక్టార్ మీటర్ల భూగర్భ జలాలు లభిస్తున్నాయి. జనాభా పరంగా ఎంతో చిన్నవైన ఆసిఫాబాద్, సిద్దిపేట, నాగర్‌కర్నూల్ వంటి జిల్లాలు కూడా గ్రేటర్ హైదరాబాద్ మొత్తం వనరులతో సమానమైన భూగర్భ జల సంపదను కలిగి ఉండటం, రాష్ట్రంలోని ప్రాంతాల మధ్య ఉన్న తీవ్ర వ్యత్యాసాన్ని బహిర్గతం చేస్తోంది.

ఆందోళనకరమైన అంశం ఏంటంటే.. హైదరాబాద్ జిల్లా వ్యాప్తంగా ఏడాదికి లభించే భూగర్భ జలం కేవలం 6,100 హెక్టార్ మీటర్లు మాత్రమే కాగా.. 40 లక్షలకు పైగా ఉన్న నగర జనాభా తమ గృహ, వాణిజ్య అవసరాల కోసం 2025 సంవత్సరంలోనే అందులోని దాదాపు 99 శాతం నీటిని పూర్తిగా తోడేశారు. దీనివల్ల భూగర్భ జలాలు సహజసిద్ధంగా రీఛార్జ్ అవ్వడానికి అసలు అవకాశమే లేకుండా పోయింది. ఇదే విధమైన ధోరణి పక్కనే ఉన్న మేడ్చల్–మల్కాజిగిరి జిల్లాలోనూ కనిపిస్తోంది. అక్కడ లభ్యమయ్యే 9700 హెక్టార్ మీటర్ల జలాల్లో ఇప్పటికే 7700 హెక్టార్ మీటర్ల నీటిని తోడేయడంతో ఆ ప్రాంతం కూడా ఎడారిగా మారే ప్రమాదం పొంచి ఉంది.

మహానగరం కాంక్రీట్ జంగిల్ పెరిగిపోవడం, వర్షపు నీటి సంరక్షణ మౌలిక సదుపాయాలు లేకపోవడమే ఈ దుస్థితికి ప్రధాన కారణమని నిపుణులు హెచ్చరిస్తున్నారు. గ్రేటర్ హైదరాబాద్ పరిధిలో కేవలం 15 శాతం విస్తీర్ణంలో మాత్రమే పనితీరు బాగున్న రైన్ వాటర్ హార్వెస్టింగ్, భూగర్భ జల రీఛార్జ్ వ్యవస్థలు ఉన్నాయని అధికారులు అంచనా వేస్తున్నారు. నగరంలో అత్యధిక శాతం భూమి కాంక్రీట్, రోడ్లతో నిండిపోవడం వల్ల వర్షం పడినా నీరు భూమిలోకి ఇంకే మార్గం లేకుండా పోయిందని చెబుతున్నారు. దీనికి తోడు హైదరాబాద్‌లోని రాతి భూగర్భ పొరలు, తగ్గిపోతున్న ఖాళీ స్థలాలు సహజ రీఛార్జ్ ప్రక్రియను పూర్తిగా దెబ్బతీశాయని జేఎన్‌టీయూహెచ్ వాటర్ రీసోర్సెస్ విభాగం రిటైర్డ్ ప్రొఫెసర్ బి. వెంకటేశ్వరరావు ఆందోళన వ్యక్తం చేశారు. ఇప్పటికైనా నగరవాసులు, ప్రభుత్వం అప్రమత్తమై ఇంకుడు గుంతల నిర్మాణం చేపట్టకపోతే భవిష్యత్తులో తీవ్ర నీటి ఎద్దడి తప్పదని ఆయన హెచ్చరించారు.

# తుపాకీతో భార్యను కాల్చి చంపిన భర్త

**అక్కకు విడాకులిచ్చి చెల్లిని పెళ్లాడి..**
**తారాస్థాయికి చేరిన గొడవలు...**
**అనుమానంతోనే ఘాతుకం...?**

పీపుల్స్‌డైరీ–హైదరాబాద్ : అనుమానమే పెను భూతమై.. హైదరాబాద్‌కు చెందిన ఓ స్థిరాస్తి వ్యాపారి.. తన భార్యను తుపాకీతో కాల్చి హత్య చేశాడు. భార్యపై అనుమానం పెంచుకున్న భర్త.. గత కొంతకాలంగా ఆమెతో నిత్యం గొడవకు దిగేవాడు. ఈ క్రమంలోనే వారి మధ్య విబేధాలు తారస్థాయికి చేరాయి. ఈ క్రమంలోనే తాజాగా ఆమెను గన్‌తో కాల్చి హతమార్చాడు. ఆపై అతడు అక్కడి నుంచి పరారయ్యాడు. ఇరుగు పొరుగు వాళ్లు ఇచ్చిన ఫిర్యాదుతో రంగంలోకి దిగి విచారణ చేపట్టారు. పరారీలో ఉన్న భర్త కోసం గాలింపు చేపట్టారు. అయితే ఆ వ్యక్తి ఆమెను పెళ్లి చేసుకోవడానికి ముందు.. ఆమె అక్కను పెళ్లి చేసుకుని, విడాకులు ఇచ్చినట్లు పోలీసుల దర్యాప్తులో వెల్లడైంది. అంతేకాకుండా అక్రమంగా తుపాకీ కలిగి ఉన్నట్లు తేలి.. కొన్ని రోజులు జైలుకు కూడా వెళ్లి వచ్చాడు.

మల్కాజిగిరి పోలీస్ స్టేషన్ పరిధిలోని మారుతీనగర్‌లో నివాసం ఉంటున్న అరుణ్‌కుమార్ రియల్ ఎస్టేట్ వ్యాపారం చేస్తూ జీవిస్తున్నాడు. గత కొంతకాలంగా అతడికి, ఆమె భార్య నిషారాణికి మధ్య తీవ్రంగా గొడవలు జరుగుతున్నాయి. ఈ క్రమంలోనే మాట్లాడుకుందామని చెప్పి మరో వ్యక్తిని తీసుకుని ఆమె ఇంటికి తెల్లవారుజామున వచ్చిన అరుణ్ కుమార్.. మాట్లాడుతుండగానే గొడవ ప్రారంభమైంది. ఈ నేపథ్యంలోనే తన వెంట తెచ్చుకున్న తుపాకీ తీసిన అరుణ్ కుమార్.. తన భార్య నిషారాణిపై 3 రౌండ్ల కాల్పులు జరిపాడు. ఆ తర్వాత అక్కడి నుంచి పారిపోయాడు.


తుపాకీ కాల్పులతో నిషారాణి తీవ్రంగా గాయపడింది. రక్తపు మడుగులో పడి ఆమె అక్కడికక్కడే ప్రాణాలు కోల్పోయింది. తుపాకీ కాల్పుల శబ్దం విన్న స్థానికులు.. పోలీసులకు సమాచారం అందించారు. రంగంలోకి దిగిన పోలీసులు.. ఘటనాస్థలికి చేరుకుని నిషారాణి మృతదేహాన్ని సికింద్రాబాద్ గాంధీ ఆస్పత్రికి తరలించారు. కేసు నమోదు చేసిన పోలీసులు దర్యాప్తు చేపట్టారు. తన మొదటి భార్యకు విడాకులిచ్చిన అరుణ్ కుమార్.. ఆ తర్వాత ఆమె చెల్లెలిని ప్రేమ వివాహం చేసుకున్నట్లు గుర్తించారు.

కొన్ని నెలల క్రితం అంబర్‌పేటలో వాహనాల తనిఖీలు చేసిన పోలీసులు అక్రమంగా తుపాకీ కలిగి ఉండి అరుణ్ కుమార్ ప్రయాణిస్తున్నట్లు గుర్తించారు. దీంతో అతడి తుపాకీని సీజ్ చేయడంతో పాటు.. అతడ్ని అరెస్ట్ చేసి జైలుకు పంపించారు. నెల రోజుల పాటు జైలు శిక్ష అనుభవించిన అరుణ్ కుమార్.. ఆతర్వాత బయటికి వచ్చాడు. ఆ తర్వాత పాతబస్తీకి చెందిన ఫ్రెండ్స్ ద్వారా మరో తుపాకీ కొనుగోలు చేసిన అరుణ్ కుమార్.. తన భార్యపై కాల్పులు జరిపి హత్య చేసినట్లు పోలీసులు భావిస్తున్నారు.

# షూటింగ్ కి అనువైన ప్రాంతం ములుగు జిల్లా

**సినిమా దర్శకుడు నేరెళ్ల దేవేందర్**
**అందుగులమేది ప్రాంతంలో సినిమా చిత్రీకరణ**

**పీపుల్స్‌డైరీ–ములుగు :** ఫైన్ స్టూడియో బ్యానర్ పై రూపొందుతున్న "ప్రొడక్షన్ నెం. 2 సినిమాను ములుగు జిల్లా వెంకటాపూర్ మండలం పాలంపేట గ్రామంలో గల రామప్ప దేవాలయంలో ఇటీవల మంత్రి సీతక్క తనయుడు సూర్య క్లాప్ కొట్టి సినిమా షూటింగ్ ను ప్రారంభించిన విషయం తెలిసిందే. కాగా, సినిమా సినిమా దర్శకుడు నేరెళ్ల దేవేందర్ ఆధ్వర్యంలో గత కొద్దిరోజులుగా సదురు సినిమా చిత్రీకరణ వెంకటాపూర్ మండలంలోని పలు ప్రాంతాల్లో ముమ్మరంగా కొనసాగుతుంది. ఈ క్రమంలో బుధవారం వెంకటాపూర్ మండలంలోని అందుగులమేది గ్రామ పరిసర ప్రాంతాల్లో సైతం సినిమా చిత్రకరణ జరిపారు. హీరో–హీరోయిన్ పై పలు సన్నివేశాలను గ్రామ శివారులోని ఓ మంచె వద్ద డైరెక్టర్ దేవేందర్ ఆధ్వర్యంలో యూనిట్ సభ్యులందరూ చిత్రీకరించారు. ఈ సందర్భంగా చిత్ర దర్శకుడు నరేళ్ళ దేవేందర్ మాట్లాడుతూ... సినిమా షూటింగులకు ములుగు జిల్లా అనువైన ప్రాంతమని ఆయన కొనియాడారు. ములుగు జిల్లాలో అనేక పుణ్యక్షేత్రాలతో పాటు అనేక పర్యాటక ప్రాంతాలు ఉన్నాయని పేర్కొన్నారు. అలాంటి ములుగు ప్రాంతంలో సినిమా చిత్రీకరణ జరిపే అవకాశం లభించడం తాను అదృష్టంగా భావిస్తున్నానని అన్నారు. ఫైన్ స్టూడియోస్ బ్యానర్ పై సినిమాను చిత్రీకరించడం జరుగుతుందని అన్నారు. ఈ కార్యక్రమం లో ప్రొడ్యూసర్ వేణు యాదవ్, హీరో – హీరోయిన్ లతో పాటు మూవీ డైరెక్టర్ నేరెళ్ల దేవేందర్, కో డైరెక్టర్ ఆర్య అరవింద్, లిరిక్స్ రైటర్ రాజ్ కుమార్, మూవీ ఎడిటర్ యూనిక్, డిఓపి తరుణ్, అసిస్టెంట్ డైరెక్టర్ లోకేష్, ప్రొడక్షన్ మేనేజర్, ఎగ్జిక్యూటివ్ ప్రొడ్యూసర్ గౌతమ్, యూనిట్ సభ్యులు సిద్దు, రఘు, రాహుల్, రఘుపతి, శ్రీనాథ్, తదితరులు పాల్గొన్నారు.



# ప్రభుత్వ వైద్యరంగంలో కీలక అడుగు...

(మొదటి పేజీ తరువాయి)

రానున్న టిమ్స్‌లోనూ ప్రారంభించేందుకు తెలంగాణ ప్రభుత్వం అడుగులు వేస్తోంది. యూరప్, ఇతర పాశ్చాత్య దేశాలతో పోల్చితే అంతర్జాతీయ నాణ్యతా ప్రమాణాలతో కూడిన వైద్య చికిత్సలు దేశంలో తక్కువ ధరకే లభిస్తుండటంతో.. దేశ రాజధాని ఢిల్లీ, ముంబైల తర్వాత విదేశీ రోగులు హైదరాబాద్‌ను ఆశ్రయిస్తున్నారు. ఈ క్రమంలోనే ప్రభుత్వ వైద్య రంగంలోనూ విదేశీయులకు కార్పొరేట్ స్థాయి సేవలను అందించేందుకు వీలుగా ప్రభుత్వం సరికొత్త కార్యాచరణను షురూ చేసింది. ప్రస్తుతం ఈస్ట్ ఆఫ్రికా, మధ్య ఆసియా దేశాల నుంచి వస్తున్న పలువురు రోగులు నిమ్స్ ఆసుపత్రిలో తక్కువ ఫీజుతోనే అత్యాధునిక వైద్య సేవలు పొందుతున్నారు. అయితే, ప్రభుత్వ ఆసుపత్రుల్లో అత్యున్నత స్థాయి వైద్య నిపుణులు ఉన్నప్పటికీ.. మౌలిక వసతుల కొరత, పరిశుభ్రత లోపించడం, సిబ్బందిలో నిబద్ధత లేకపోవడం వంటి కారణాల వల్ల విదేశీయులకు వీటిని పూర్తి స్థాయిలో సిఫార్సు చేయలేని పరిస్థితి నెలకొంది. దీనిని ఆసరాగా చేసుకుని ప్రైవేటు ఆసుపత్రులు ప్రత్యేక డెస్క్‌లను ఏర్పాటు చేసుకుని విదేశీ రోగులను ఆకర్షిస్తున్నాయి. ఈ లోపాలను అధిగమించి, ప్రభుత్వ ఆసుపత్రుల్లో అంతర్జాతీయ వైద్య పర్యాటకాన్ని ప్రోత్సహించడానికి అవసరమైన మౌలిక వసతుల కల్పనపై అధ్యయనం చేసి సిఫార్సులు సమర్పించేందుకు వీలుగా ప్రభుత్వం తాజాగా ఒక ఉన్నత స్థాయి నిపుణుల కమిటీని ఏర్పాటు చేసింది.

కార్పొరేట్ ఆసుపత్రులతో పోల్చితే ప్రభుత్వ ఆసుపత్రుల్లో వైద్య ఖర్చులు మూడో వంతు మాత్రమే ఉండటం విదేశీ రోగులకు పెద్ద వరంగా మారనుంది. ప్రైవేటు ఆసుపత్రుల్లో మోకీళ్ల మార్పిడి చికిత్సకు రూ. 6 నుంచి 7 లక్షలు వసూలు చేస్తుంటే.. నిమ్స్‌లో ఆ చికిత్సను కేవలం రూ. 2 లక్షల లోపే పూర్తి చేస్తున్నారు. అలాగే బైపాస్ సర్జరీకి ప్రైవేటులో రూ. 7 నుండి 8 లక్షలు ఖర్చవుతుండగా.. నిమ్స్‌లో కేవలం రెండున్నర లక్షల రూపాయలకే అత్యంత నాణ్యమైన సేవలు అందుతున్నాయి. ఇంతటి భారీ ధరల వ్యత్యాసం ఉండటం వల్ల మౌలిక వసతులు మెరుగుపడితే విదేశీ రోగుల తాకిడి గణనీయంగా పెరుగుతుందని ప్రభుత్వం భావిస్తోంది.

ఈ ప్రణాళికలో భాగంగా త్వరలోనే ప్రారంభం కానున్న టిమ్స్ ఆసుపత్రిలో ప్రత్యేకంగా ఇంటర్నేషనల్ మెడికల్ టూరిజం బ్లాక్‌ను ఏర్పాటు చేయనున్నారు. ఈ బ్లాక్‌లో విదేశీ రోగులకు అందించాల్సిన ప్రత్యేక వైద్య సేవలు, విదేశీ కరెన్సీకి అనుగుణంగా ధరల విధానం, ఆకర్షణీయమైన హెల్త్ ప్యాకేజీలపై కొత్తగా ఏర్పాటైన కమిటీ సమగ్ర అధ్యయనం చేయనుంది. దీంతో పాటు నిమ్స్, గాంధీ, ఉస్మానియా వంటి జనరల్ ఆసుపత్రులలో సైతం నిర్దిష్ట సంఖ్యలో ప్రత్యేక పడకలను, విలాసవంతమైన విదేశీ ప్రత్యేక వార్డులను కేటాయించనున్నారు. ఈ నిర్ణయం ద్వారా ప్రభుత్వ ఆసుపత్రుల ఆదాయం పెరగడమే కాకుండా.. పేద ప్రజలకు అందించే ఉచిత వైద్యానికి మరింతగా నిధులు సమకూరే అవకాశం ఉందని వైద్య ఆరోగ్య శాఖ వర్గాలు వెల్లడించాయి.

# ఒంటరిపోరుకే మొగ్గు

(మొదటి పేజీ తరువాయి)

ఈ వ్యాఖ్యలు ఇప్పుడు సరికొత్త చర్చకు దారి తీస్తున్నాయి. ఇది ఒక సాధారణ రాజకీయ ప్రకటనగా కాకుండా.. దక్షిణాది రాష్ట్రాల్లో పార్టీని విస్తరించేందుకు బీజేపీ అవలంబిస్తున్న దీర్ఘకాలిక వ్యూహానికి సంకేతంగా రాజకీయ విశ్లేషకులు భావిస్తున్నారు. మరీ ముఖ్యంగా తెలంగాణలో ఇతర పార్టీలపై ఆధారపడకుండా.. సొంతంగానే బీజేపీని నిలబెట్టాలని దృష్టి పెట్టినట్లు అనుమానం వ్యక్తం చేస్తున్నారు. ఎన్నికలు జరిగే ప్రతి రాష్ట్రంలో ఒంటరిగానే పోటీ చేసి.. బీజేపీని అధికారంలోకి తీసుకురావడమే తమ లక్ష్యమని తాజాగా అమిత్ షా పేర్కొన్నట్లు తెలుస్తోంది. ఈ క్రమంలోనే దక్షిణాది రాష్ట్రాలు.. మరీముఖ్యంగా తెలంగాణపై బీజేపీ ప్రత్యేక దృష్టి పెట్టిందని కూడా అమిత్ షా తేల్చి చెప్పినట్లు సంబంధిత వర్గాలు చెబుతున్నాయి. తమిళనాడు, ఆంధ్రప్రదేశ్‌లలో బీజేపీ.. ఎక్కువకాలం ప్రాంతీయ పార్టీలపై ఆధారపడటం వల్ల.. స్వతంత్రంగా బలాన్ని పెంచుకోలేకపోయామనే భావన బీజేపీ అగ్రనాయకత్వానికి వచ్చిందని రాజకీయ వర్గాలు చర్చించుకుంటున్నాయి. అందుకే ఇతర పార్టీలపై ఆధారపడకుండా.. బీజేపీ బలాన్ని సొంతంగా పెంచాలని యోచిస్తున్నట్లు అమిత్ షా వ్యాఖ్యలు అర్థం చేసుకోవాలని రాజకీయ విశ్లేషకులు పేర్కొంటున్నారు.




ప్రాంతీయ పార్టీలతో పొత్తు పెట్టుకోవడం వల్ల.. అప్పటికప్పుడు ఎన్నికల సమయంలో కొన్ని సీట్లు, ఇతర పార్టీలతో కలిసి అధికారంలోకి వచ్చినప్పటికీ.. దీర్ఘకాలంలో మాత్రం అవి బీజేపీని ఎదగకుండా అడ్డుకుంటున్నాయనే ఆలోచనకు బీజేపీ వచ్చినట్లు తెలుస్తోంది. అందుకే పొత్తుల ద్వారా సీట్లు, అధికారాన్ని దక్కించుకోవడం కంటే.. కాస్త ఆలస్యమైనా సరే సొంతంగా కేడర్, ఓటు బ్యాంకును సాధించాలనే లక్ష్యంతో కమలం పార్టీ అడుగులు వేస్తున్నట్లు విశ్లేషకులు చెబుతున్నారు. జాతీయ పార్టీగా ఉన్న శాశ్వతంగా నిలదొక్కుకోవాలంటే.. ఇతర పార్టీలపై ఆధారపడకుండా సొంత బలంతో ఎదగాల్సిందేననే బీజేపీ నాయకత్వం ఆలోచిస్తుందని అభిప్రాయపడుతున్నారు. అమిత్ షా చేసిన ప్రకటనతో ఇప్పుడు తెలంగాణలో త్రిముఖ పోరు నెలకొననుంది. నిజంగానే బీజేపీ పొత్తులు లేకుండా ఎన్నికల బరిలోకి దిగితే.. తెలంగాణ రాజకీయాలు కాంగ్రెస్, బీఆర్ఎస్, బీజేపీల మధ్య త్రిముఖ పోరుగా కొనసాగనున్నాయని రాజకీయ పరిశీలకులు భావిస్తున్నారు.

# బడికి పోదాం... ఆటోలో వద్దాం!

**ప్రభుత్వ బడుల బలోపేతానికి తిమ్మంపేట గ్రామస్థుల వినూత్న 'ఉచిత' విద్యా సంకల్పం**

**దుగ్గొండి, జూన్ 10 (పీపుల్స్ డైరీ) :** ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థుల చేరికలను పెంచేందుకు మరియు విద్యావ్యవస్థను బలోపేతం చేసేందుకు దుగ్గొండి మండలంలోని తిమ్మంపేట గ్రామస్థులు ఒక వినూత్నమైన మరియు ఆదర్శవంతమైన నిర్ణయం తీసుకున్నారు. గ్రామానికి చెందిన విద్యార్థులను ప్రభుత్వ పాఠశాలల్లో చేర్పిస్తే, వారికి ఇంటి నుండి బడికి, బడి నుండి ఇంటికి ఉచిత ఆటో సౌకర్యం కల్పించాలని గ్రామ పెద్దలు, యువత కలిసికట్టుగా తీర్మానించారు.




**ముఖ్య విశేషాలు :**

ఉచిత రవాణా సౌకర్యం: ప్రైవేట్ పాఠశాలలకు పోటీగా, ప్రభుత్వ బడి పిల్లల కోసం ప్రత్యేక ఆటో వసతి.

**నమ్మకం – నాణ్యత :** ప్రభుత్వ బడుల్లో విద్యా ప్రమాణాలు మెరుగుపడుతుండటంతో, ప్రజల్లో మరింత విశ్వాసం పెంచేందుకు ఈ నిర్ణయం దోహదపడుతుంది.

**తల్లిదండ్రులకు ఊరట:** రవాణా ఖర్చులు భరించలేక ఇబ్బంది పడే పేద కుటుంబాలకు ఈ నిర్ణయం ఎంతో మేలు చేకూరుస్తుంది.

**గ్రామ పెద్దల అభిప్రాయం:**

"ప్రభుత్వ పాఠశాలల్లో అనుభవజ్ఞులైన ఉపాధ్యాయులు, మంచి వసతులు ఉన్నాయి. కేవలం రవాణా సౌకర్యం లేదనే కారణంతో ఏ ఒక్క బిడ్డా చదువుకు దూరం కాకూడదనే ఉద్దేశంతోనే మేమంతా కలిసి ఈ 'ఉచిత ఆటో' నిర్ణయం తీసుకున్నాం. ఈ విద్యా సంవత్సరం నుండి విద్యార్థుల సంఖ్యను భారీగా పెంచడమే మా లక్ష్యం."ఈ డిజిటల్ యుగంలో ప్రైవేట్ పాఠశాలల వైపు పరుగులు తీస్తున్న తల్లిదండ్రులను ప్రభుత్వ బడుల వైపు తిప్పేందుకు తిమ్మంపేట గ్రామం తీసుకున్న ఈ నిర్ణయం చుట్టుపక్కల గ్రామాలకు కూడా ఆదర్శంగా నిలిచింది.

# ప్రజా సమస్యల పరిష్కారానికే గ్రామసభలు

**అన్ని మండలాల సమగ్ర అభివృద్దే లక్ష్యం**
**ప్రతి గ్రామాన్ని ఆదర్శ గ్రామంగా తీర్చిదిద్దుతాం**
**ప్రతిపక్ష నాయకుల విమర్శలు వారి అవివేకానికి నిదర్శనం**
**బస్వరాజుపల్లి, చెల్పూర్, గణపురం గ్రామ సభలలో ఎమ్మెల్యే గండ్ర**





**గణపురం,జూన్ 10 (పీపుల్స్ డైరీ) :** నియోజకవర్గంలోని అన్ని మండలాలను అభివృద్ధిలో అగ్రగామిలో నిలిపేందుకు అహర్నిశలు కృషి చేస్తున్నానని భూపాలపల్లి ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణ రావు అన్నారు. రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా నిర్వహిస్తున్న 99 రోజుల ప్రజా పాలన ప్రగతి ప్రణాళిక కార్యక్రమంలో భాగంగా మండలంలోని బసవరాజుపల్లి, గణపురం,చెల్పూర్ గ్రామాలలో సర్పంచ్ లు చింతకుంట్ల సునీత శ్రీనివాస్, కటుకూరి రాధిక శ్రీనివాస్,కావటి రజిత రవీందర్ ల అధ్యక్షతన నిర్వహించిన గ్రామ సభలకు వారు ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. ముందుగా బస్వరాజుపల్లి గ్రామంలో రూ 20లక్షల రూపాయలతో నూతనంగా నిర్మించిన గ్రామ పంచాయతీ నూతన భవనాన్ని ప్రారంభించారు. ఆయా గ్రామసభలో ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణ రావు మాట్లాడుతూ... గ్రామాల అభివృద్ధికి గ్రామపంచాయతీలు కీలక కేంద్రాలుగా పనిచేస్తాయని ప్రజలకు మెరుగైన సేవలు అందించేందుకు ప్రత్యేక కార్యాచరణతో ప్రభుత్వం నుండి నిధులు తీసుకువస్తున్నానని అవసరమైన మౌలిక సదుపాయాలను ప్రభుత్వం కల్పిస్తోందని తెలిపారు. నూతన గ్రామపంచాయతీ భవనం ద్వారా గ్రామ ప్రజలకు పరిపాలనా సేవలు మరింత సులభంగా అందుబాటులోకి వస్తాయని పేర్కొన్నారు.ప్రజల అవసరాలను దృష్టిలో ఉంచుకొని గ్రామీణ ప్రాంతాల్లో అభివృద్ధి కార్యక్ర మాలను వేగవంతం చేస్తున్నామని,ప్రతి గ్రామాన్ని ఆదర్శ గ్రామంగా తీర్చిదిద్దడమే ప్రభుత్వ లక్ష్యమని ఎమ్మెల్యే పేర్కొన్నారు. గ్రామాభివృద్ధిలో ప్రజల భాగస్వామ్యం ఎంతో ముఖ్యమని, అందరూ కలిసి గ్రామ ప్రగతికి సహకరించాలని పిలుపునిచ్చారు. గ్రామాల సమగ్ర అభివృద్దే ప్రభుత్వ లక్ష్యమని పేర్కొన్నారు. విద్య, వైద్యం, వ్యవసాయం, విద్యుత్,ప్రజా సంక్షేమం వంటి అంశాలకు సంబంధించిన సమస్యలను గుర్తించి,సంబంధిత అధికారులతో సమన్వయం చేసుకుంటూ గ్రామాల అభివృద్ధి కోసం కృషి చేయాలని సూచించారు. కాంగ్రెస్ ప్రభుత్వం ప్రజా సంక్షేమానికి పెద్దపీట వేస్తోందని పేర్కొంటూ,రైతు రుణమాఫీ,గృహ జ్యోతి పథకం,ఆర్టీసీ బస్సుల్లో మహిళలకు ఉచిత ప్రాణంతో పాటు ప్రయాణం తోపాటు ప్రభుత్వం నూతనంగా రాష్ట్రంలోని ప్రతి కుటుంబానికి భద్రత కల్పించాలని లక్ష్యంతో పోషణకర్తకు ఇన్సూరెన్స్ చేయడం జరుగుతుందని తద్వారా ఏదైనా ప్రమాదం ఇతర కారణాలవల్ల మృతి చెందినట్లయితే బాధిత కుటుంబానికి రూ 5 లక్షల రూపాయల పరిహారం అందుతుందని ఎమ్మెల్యే గండ్ర వివరించారు. ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాలను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని ఎమ్మెల్యే పిలుపునిచ్చారు. గ్రామ సభల్లో ప్రజల నుంచి సమస్యలు, వినతులను స్వీకరించి,వాటి పరిష్కారానికి తగిన చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. మండల కేంద్రంలోని గణప సముద్రమును టూరిజం కేంద్రముగా తీర్చిదిద్దుతానని,త్వరలోనే నూతన పెన్షన్లు మంజూరు కానున్నాయని, మొదటి దశ లో మంజూరు చేసిన ఇందిరమ్మ ఇండ్లను త్వరి తగతిన పూర్తి చేసుకొని గృహప్రవేశాలు చేయాలని, రెండో విడత ఇందిరమ్మ ఇళ్లను కూడా మంజూరు చేస్తామని వారు తెలిపారు. ప్రభుత్వం విద్యకు సంబంధించి కోట్లాది రూపాయలు విడుదల చేస్తు న్న దృష్ట్యా తల్లిదండ్రులు తమ పిల్లలను ప్రభుత్వ పాఠశాలలో చేర్పించి పాఠశాలలను బలోపేతం చేసేందుకు సహకరించాలని, విద్యాశాఖ మంత్రిగా ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఉండడంతో ప్రైవేటు పాఠశాలలకు దీటుగా ప్రభుత్వ పాఠశాలలను తీర్చిదిద్దుతున్నారని ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. బడిబాట గోడ పత్రికను ఉపాధ్యాయులతో కలిసి ఆవిష్కరించారు. చెరువులు, కుంటల పరిరక్షణకు చర్యలు తీసుకోవాలి, మండలంలోని చెరువులు కుంటలు అన్యాక్రాంతం కాకుండా ఎఫ్‌టిఎల్ ఆధారంగా హద్దులు ఏర్పాటు చేయాలని అధికారులను ఆదేశించారు. బుద్ధారం గ్రామంలో నెలకొన్న నీటి ఎద్దడి నివారించాలని ప్రజలు గ్రామ సభ దృష్టికి తీసుకురాగా వెంటనే సమస్య పరిష్కారం చేయాలని మిషన్ భగీరథ అధికారులను ఆదేశించారు. భూ సమస్యల పరిష్కారానికి ప్రత్యేక చొరవతో మండలం లోని వివిధ గ్రామాల రైతుల భూ సమస్యలను పరిష్కరించేందుకు ప్రత్యేక కార్యాచరణతో ముందుకు వెళ్తున్నామని లైసెన్స్ డ్ సర్వేయర్ ల ద్వారా త్వరలోనే భూముల కొలతలు నిర్వహించి అర్హులైన రైతులందరికీ పట్టా పాస్‌బుక్‌లు అందజే స్తామని తెలిపారు. అన్నీ మండలాలను సమాన స్థాయిలో అభివృద్ధి చేస్తున్నా ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ప్రత్యేక సహకారంతో రూ 15 వందల కోట్ల రూపాయలను మంజూరు చేయించి నియోజకవర్గం లోని అన్ని మండలాలను అభివృద్ధి చేస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో తహశీల్దార్ అడ్లూరి రాజేశ్వర రావు, ఎంపీడీవో భాస్కర్, మండల వ్యవసాయ అధికారి దేశబోయిన ఐలయ్య, పశు వైద్య అధికారి బాలకృష్ణ, ఎంఈఓ ఆఫ్రోజ్, ఏపిఎం రాజు, ఐసిడిఎస్ సూపర్వైజర్ లక్ష్మి, సర్పంచ్ లు పూజరి రాజేందర్, ఎలుకపల్లి రమేష్, కటుకూరి రాధిక శ్రీనివాస్, కావటి రజిత రవీందర్,, విడిది నేని శ్రీలత అశోక్, విద్యుత్ అధికారి వెంకటరమణ, సొసైటీ ఛైర్మన్ కుమార్ యాదవ్, మార్కెట్ కమిటీ వైస్ ఛైర్మన్ రేపాక రాజేందర్, డైరెక్టర్ కటుకూరి శ్రీనివాస్, ఉప సర్పంచ్ లు ఓరుగంటి కృష్ణ, పొనగంటి మలహాల్ రావు, మారవేణి ఐలయ్య, నాయకులు చోటే మియా వడ్లకొండ నారాయణ గౌడ్, దూడపాక శంకర్, తిక్క సంపత్, గంధం ఓధాకర్, బత్తిని శివశంకర్ గౌడ్, మామిండ్ల మల్లికార్జున్ గౌడ్, అంగన్వాడి టీచర్లు, వైద్య సిబ్బంది, ఆశా కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

## కాంగ్రెస్ అరాచక రాజకీయాలపై గంట ఆగ్రహం..

**బిజెపి దిష్టిబొమ్మ దహనాన్ని ఖండించిన గంట రవి**




**మట్టెవాడ, జూన్ 10 (పీపుల్స్ డైరీ):** తెలంగాణ కాంగ్రెస్ వ్యవహారాల ఇన్‌చార్జ్ మీనాక్షి నటరాజన్ రాజ్యసభ నామినేషన్ చట్టబద్ధంగా తిరస్కరణకు గురికావడాన్ని నిరసిస్తూ, కాంగ్రెస్ నాయకులు బీజేపీ నాయకుల దిష్టిబొమ్మను తగలబెట్టడం అత్యంత దుర్మార్గమైన, హేయమైన చర్య అని భారతీయ జనతా పార్టీ జిల్లా అధ్యక్షులు గంట రవికుమార్ తీవ్రంగా ఖండించారు. కాంగ్రెస్ పార్టీకి రాజ్యాంగం పట్ల, దేశ చట్టాల పట్ల కనీస గౌరవం లేదని ఈ ఘటనతో మరోసారి రుజువైందని ఆయన మండిపడ్డారు. అఫిడవిట్‌లో కోర్టు కేసుల వివరాలు, ఆస్తుల సమాచారాన్ని సమగ్రంగా పొందుపరచకుండా నిబంధనలను ఉల్లంఘించింది కాంగ్రెస్ అభ్యర్థి మీనాక్షి నటరాజన్. తప్పు మీ వైపు పెట్టుకుని, రిటర్నింగ్ అధికారి చట్టప్రకారం నామినేషన్ తిరస్కరిస్తే, దానికి ప్రధాని మోడీకి ఏం సంబంధం అని ఆయన ప్రశ్నించారు. ఎన్నికల సంఘం స్వతంత్రంగా, నిబంధనల ప్రకారం వ్యవహరిస్తుంది. దాన్ని అడ్డం పెట్టుకుని రాజకీయ లాభం పొందాలని చూడటం, విఫలమయ్యాక వీధుల్లోకి వచ్చి అరాచకాలు సృష్టించడం కాంగ్రెస్ మార్కు దిగజారుడు రాజకీయాలకు నిదర్శనం. మోడీ ప్రజాదరణను చూసి ఓర్వలేకే ఈ చర్యలకు పాల్పడుతున్నారని బీజేపీ శ్రేణులు ముక్తకంఠంతో వ్యతిరేకిస్తున్నారు. దేశ ప్రధాని దిష్టిబొమ్మను తగలబెట్టి, శాంతిభద్రతలకు విఘాతం కలిగించిన కాంగ్రెస్ నాయకులపై పోలీసులు తక్షణమే సుమోటోగా కేసులు నమోదు చేసి, కఠినంగా శిక్షించాలని గంట రవికుమార్ డిమాండ్ చేశారు.

## భవన నిర్మాణాలు నిబంధనలకు అనుగుణంగా ఉండాలి



**మట్టెవాడ, జూన్ 10 (పీపుల్స్ డైరీ) :** భవన నిర్మాణాలు నిబంధనలకు అనుగుణంగా ఉండాలని జిల్లా కలెక్టర్, జీడబ్ల్యూఎంసీ ప్రత్యేకాధికారి చాహత్ బాజ్‌పాయ్ అన్నారు. బుధవారం హన్మకొండ నగరంలోని వికాస్ నగర్, గోపాల్‌పూర్, భీమారం, ఎర్రగట్టుగుట్ట, ఎక్సైజ్ కాలనీ ప్రాంతాల్లో నిర్మించిన పలు భవనాలను జిల్లా కలెక్టర్ క్షేత్ర స్థాయిలో పరిశీలించారు. ఆక్యుపెన్సీ సర్టిఫికెట్ల కోసం దరఖాస్తు చేసుకున్న భవనాలకు సంబంధించిన పత్రాలను పరిశీలించడంతో పాటు, నిర్మాణాల కొలతలు, సెట్‌బ్యాక్‌లు, పార్కింగ్ సౌకర్యాలు, అనుమతుల ప్రకారం చేపట్టిన నిర్మాణ పనులను ఆమె తనిఖీ చేశారు. ఈ సందర్భంగా కలెక్టర్ చాహత్ బాజ్ పాయ్ మాట్లాడుతూ భవన నిర్మాణ అనుమతులు, ప్రభుత్వ నిబంధనలు, సాంకే తిక ప్రమాణాలను పూర్తిస్థాయిలో పాటించిన నిర్మాణాలకే ఆక్యుపెన్సీ సర్టిఫికెట్లు మంజూరు చేయబడతాయని స్పష్టం చేశారు. ప్రజల భద్రత, నగర ప్రణాళికాబద్ధ అభివృద్ధిని దృష్టిలో ఉంచుకొని ప్రతి దరఖాస్తును నిష్పక్షపాతంగా పరిశీలిస్తు న్నామని తెలిపారు. దరఖాస్తుదారులు సమర్పించిన వివరాలను క్షేత్రస్థాయిలో ధృవీకరించిన అనంతరమే తుది నిర్ణయం తీసుకుంటామని అన్నారు. భవన యజమానులు నిర్మాణాలను అనుమతులకు అనుగుణంగా చేపట్టి నగరాభివృద్ధికి సహకరించాలని సూచిం చారు. పరిశీలనలో సిటీ ప్లానర్ రవీందర్ రాడేకర్, టౌన్ ప్లానింగ్ అధికారులు అవినాష్, ప్రశాంత్ తదితరులు పాల్గొన్నారు.



## మీనాక్షి నటరాజన్ నామినేషన్ ఆమోదించాలి! : రాజనాల శ్రీహరి

**మట్టెవాడ , జూన్ 10 (పీపుల్స్ డైరీ):** కాంగ్రెస్ నేత మీనాక్షి నటరాజన్ రాజ్యసభ నామినే షన్ తిరస్కరించడం భారత రాజ్యాంగం తిరస్కరించడ మేనని, ఒక దళిత మహిళ ఏదో ఒక మహిళపై క్రమశిక్షణ చర్య తీసుకోలేదని అది క్రిమినల్ కేసుగా వక్రీకరించి రాజ్యసభ నామినేషన్ తిరస్కరించడం బిజెపి దురదృష్ట చర్య అని గ్రేటర్ వరంగల్ కాంగ్రెస్ వర్కింగ్ ప్రెసిడెంట్ రాజనాల శ్రీహరి అన్నారు. తెలంగాణలో కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి రావడానికి సఖ్యతతో మీనాక్షి నటరాజన్ కీలక పాత్ర పోషించింది, తెలంగాణ ఇన్చార్జిగా వ్యవహరిస్తూ అన్ని రంగాలలో తనదైన శైలిలో అందర్నీ ఆకట్టుకుంటూ రేపు 2029లో భారతదేశంలో కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వస్తుందనే భయంతో ఇలాంటి చర్యలకు పూనుకున్నారని విమర్శించారు. వెంటనే ఆమె రాజ్యసభ నామినేషన్ ఆమోదించాలని రాజనాల శ్రీహరి డిమాండ్ చేశారు. సమావేశంలో వరంగల్ జిల్లా కాంగ్రెస్ కార్యదర్శి పోలెపాక ప్రసాద్ పాల్గొన్నారు.

## సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కు అందించిన సర్పంచ్



**కేసముద్రం, జూన్ 10 (పీపుల్స్ డైరీ) :** కేసముద్రం మండలం అర్పణపల్లి గ్రామానికి చెందిన చీర భద్రయ్య అనారోగ్యానికి గురయ్యారు. ఈ నేపద్యంలో రాజ్యసభ సభ్యులు వేం నరేందర్ రెడ్డి, ఎమ్మెల్యే భూక్యా మురళీ నాయక్ సహకారంతోరూ . 60 వేల సీఎం రిలీఫ్ ఫండ్ చెక్ బాధితుడు చీర భద్రయ్యకు సంక్షన్ చేయగా గ్రామ సర్పంచ్ వెంకటమ్మ వీరస్వామి చేతుల మీదుగా బుధవారం అందజేశారు. ఈకార్యక్రమంలో కంచ కుమారస్వామి, వార్డు సభ్యులు గంధం శ్రీనివాస్, చీర బుచ్చి వీరం, చీర కృష్ణ, చిర వీరస్వామి కొమురయ్య, కశీచ కట్టయ్య , చిట్టె కొమురయ్య, చిట్టి కుమార్ స్వామి, చిట్టే ముత్తయ్య, అన్న అచ్చాలు పాల్గొన్నారు.

## మోదీ చిత్ర పటానికి క్షీరాభిషేకం, పండ్ల పంపిణీ



**మట్టెవాడ, జూన్ 10 (పీపుల్స్ డైరీ) :** భారతదేశ ప్రధాన మంత్రిగా నరేంద్ర మోదీ 2014 మే 26వ తేదీన తొలిసారిగా బాధ్యతలు చేపట్టారు. ఈ ఏడాది జూన్ 10 నాటికి విరామం లేకుండా 4,399 రోజులు పూర్తి చేసుకోనున్నారు. దీంతో నెహ్రూ రికార్డును ఒక్క రోజు తేడాతో అధిగమించి, దేశంలోనే సుదీర్ఘకాలం నిరంతరాయంగా పాలించిన ఏకైక ప్రజాస్వామ్య అధినేతగా మోదీ నిలవనున్నారు. ఈ శుభ సందర్భాన్ని పురస్కరించుకొని బుధవారం బిజెపి కార్యకర్తలు ప్రధాని నరేంద్ర మోదీ చిత్రపటానికి క్షీరాభిషేకం చేశారు. అనంతరం వరంగల్ బట్టల బజారులోని శ్రీ వెంకటేశ్వరస్వామి దేవాలయం ప్రాంతంలో బాటసారులకు పండ్లు, మజ్జిగ పంపిణీ చేశారు. 28వ డివిజన్ బీజేపీ మాజీ అధ్యక్షులు వెనిశెట్టి రోహిత్ ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో బీజేపీ రాష్ట్ర కార్యవర్గసభ్యులు సిద్దం నరేష్, సీనియర్ నాయకులు పొట్టి శ్రీనివాస్ గుప్త, సోమేష్ వర్మ, ఎర్రం శ్రీనివాస్, శివుడు, రమేష్, రవి కుమార్, శ్రీకాంత్, పవన్, లక్ష్మణ్, డివిజన్ నాయకులు పాల్గొన్నారు.

## పోగొట్టుకున్న మొబైల్ ఫోన్ అందజేత



**చిట్యాల, జూన్ 10 (పీపుల్స్ డైరీ) :** పోగొట్టకున్న మొబైల్ ఫోన్ ను బాధితుడికి అందజేసినట్లు చిట్యాల ఎస్ఐ సతీష్ బుధవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు చిట్యాల గ్రామానికి చెందిన సురేందర్ అనే వ్యక్తి తన మొబైల్ ఫోన్‌ను పోగొట్టుకుని చిట్యాల పోలీస్ స్టేషన్‌లో దరఖాస్తు సమర్పించగా పోలీస్ స్టేషన్ సిబ్బంది సిఇఐఆర్ పోర్టల్‌లో మొబైల్ వివరాలను నమోదు చేసి కానిస్టే బుల్ లాల్ సింగ్ నిరంతరం సాంకేతిక నిఘా ఉంచి సిఇఐఆర్ పోర్టల్ ద్వారా సదరు మొబైల్ ఫోన్ ఖచ్చితమైన సమాచారాన్ని లొకేషన్‌ను గుర్తించి ట్రేస్ చేసిన మొబైల్ ఫోన్‌ను విజయవం తంగా రికవరీ చేసి బాధితుడైన సురేందర్‌ను పోలీస్ స్టేషన్‌కు పిలిపించి అప్పగించినట్లు వెల్లడించారు. మరోవైపు బాధితుడు సురేందర్ ఎస్ఐ సతీష్‌కు కానిస్టేబుల్ లాల్ సింగ్‌కు ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు.

## పెంచిన గ్యాస్ ధరలను కేంద్ర ప్రభుత్వం వెంటనే తగ్గించాలి



**నర్సింహులపేట, జూన్ 10 (పీపుల్స్ డైరీ) :** కేంద్ర ప్రభుత్వం గత కొద్ది రోజులుగా పెరుగుతూ వస్తున్న గ్యాస్ ధరలను వెంటనే తగ్గించాలని కాంగ్రెస్ పార్టీ మండల ఎస్టీ సెల్ అధ్యక్షుడు బానోతు దస్రు నాయక్ ఒక ప్రకటనలో తెలిపారు.మూడు నెలల వ్యవధిలో రెండుసార్లు వంట గ్యాస్ ధరలు పెంచారని దశలవారీగా ఇష్టం వచ్చినట్లు గ్యాస్ ధరలు పెంచుతూ పేదవారి కుటుంబాలకు పెను భారంగా మారిందని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. ఇప్పటికైనా కేంద్ర ప్రభుత్వం పెంచిన ధరలను వెంటనే తగ్గించాలని డిమాండ్ చేశారు.

## పీఎం ఆరోగ్యంగా ఉండాలి



**చిట్యాల, జూన్ 10 (పీపుల్స్ డైరీ) :** ప్రధానమంత్రి నరేంద్ర మోడీ ప్రధానమంత్రిగా 12 సంవత్సరాలు పూర్తి చేసుకున్న సందర్భంగా ఆయన ఆయురారోగ్యాలతో ఉండాలని చిట్యాల మండల కేంద్రంలోని హనుమాన్ దేవాలయంలో బుధవారం ఆయన పేరు మీద పూజ చేయడం జరిగిందని బిజెపి చిట్యాల మండలాధ్యక్షుడు బుర్ర వెంకటేష్ గౌడ్ అన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 12 సంవత్సరాలు ప్రధానమంత్రి నరేంద్ర మోడీ పాలనలో ఎన్నో అభివృద్ధి సంక్షేమ పథకాలను పేద మధ్యతరగతి ప్రజల కోసం తీసుకువచ్చి మన భారతదేశాన్ని ప్రపంచ దేశాల్లో ప్రథమ స్థాయిగా నిలిపిన ఘనత ప్రధానమంత్రి నరేంద్ర మోడీదే అని అన్నారు. కార్యక్రమంలో బిజెపి సీనియర్ నాయకులు గుండ సురేష్ రాయిని శ్రీనివాస్ వల్లల ప్రవీణ్ తదితరులు పాల్గొన్నారు.

## గ్రామాల అభివృద్ధికి ప్రజల భాగస్వామ్యం అవసరం







**నర్సింహులపేట, జూన్ 10 (పీపుల్స్ డైరీ) :** రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా చేపట్టిన 'ప్రజా పాలన -- ప్రగతి ప్రణాళిక' 99 రోజుల కార్యక్రమం నర్సింహులపేట మండలంలో గ్రామసభల నిర్వహణతో బుధవారం ముగిసింది. కార్యక్రమం చివరి రోజున పెద్దనాగారం, వంతడపుల, వస్త్రం తండా, రామన్నగూడెం, రూపుల తండా గ్రామాల్లో ఆయా సర్పంచుల అధ్యక్షతన ప్రత్యేక గ్రామసభలు నిర్వహించారు. ఈ సందర్భంగా అధికారులు మాట్లాడుతూ ప్రణాళికాబద్ధమైన పాలన, మౌలిక వసతుల కల్పన, ప్రజల సహకారంతోనే గ్రామాలు అభివృద్ధి పథంలో ముందుకు సాగుతాయని తెలిపారు. వర్షాకాల సన్నద్ధత, సురక్షిత తాగునీటి సరఫరా, ఘన వ్యర్థాల నిర్వహణ, ఓటరు జాబితా ప్రత్యేక సమగ్ర సవరణ వంటి అంశాలపై గ్రామస్థులకు అవగాహన కల్పించారు. స్థానిక ఎస్సై బానోత్ వెంకన్న మాట్లాడుతూ.. యువతను గంజాయి వంటి మత్తు పదార్థాల బారిన పడకుండా కాపాడాల్సిన బాధ్యత సమాజంపై ఉందని పేర్కొన్నారు. గంజాయి వినియోగం వల్ల కలిగే అనర్థాలను వివరించి ప్రజల్లో చైతన్యం తీసుకురావాలని సూచించారు. కార్యక్రమాల్లో ఎంపీడీవో రాధిక, ఎంపీవో కిన్నెర యాకయ్య, ఏవో వినయ్‌కుమార్, ఏఈ వంశీకృష్ణ, ఏపీఎం రాములు, ఆర్ఐ శ్రావణ్, సర్పంచులు మాలోత్ బాల్య నాయక్, లచ్చు నాయక్, మందుల రఘు, ఉపసర్పంచ్ యాకూబ్, కార్యదర్శి ఉమారాణి, వార్డు సభ్యులు, వివిధ శాఖల అధికారులు, గ్రామస్థులు పాల్గొన్నారు.

## కిసాన్ మేళా కార్యక్రమాన్ని జయప్రదం చేయాలి

**ములుగు జిల్లా కాంగ్రెస్ అధ్యక్షులు పైడాకుల అశోక్ పిలుపు**



**గోవిందరావుపేట, జూన్ 10(పీపుల్స్ డైరీ) :** గురువారం మండల కేంద్రంలోని సోముల గడ్డ క్రాస్ రోడ్ వద్ద గురువారంపి ఎస్ ఆర్ గార్డెన్ లో ఉదయం 9 గంటలకు నిర్వహించే రైతు మేళా కార్యక్రమాన్ని కాంగ్రెస్ పార్టీ కార్యకర్తలు అధిక సంఖ్యలో పాల్గొని జయప్రదం చేయాలని పిలుపునిచ్చారు. ఈ సందర్భంగా అశోక మాట్లాడుతూ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు, పంచాయతీరాజ్ శాఖ మంత్రి దనసరి సీతక్క హాజరవుతున్నట్లు తెలిపారు, కాంగ్రెస్ పార్టీ భవిష్యత్తు ప్రణాళిక ప్రభుత్వం చేపడుతున్న ప్రజా సంక్షేమ క్షేమ పథకాలపై సమ్మేళన కార్యక్రమంలో వహించడం జరుగుతుందని కార్యక్రమానికి కాంగ్రెస్ పార్టీ జిల్లా మండల గ్రామ నాయకులు మహిళలు యువత అధిక సంఖ్యలో పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని అశోక్ కోరారు.





# ప్రజలకు ఇచ్చిన ప్రతి హామీని అమలు చేస్తున్నాం

**మున్నేరు వరద సమస్యలకు శాశ్వత పరిష్కారంగా రిటైనింగ్ వాల్ నిర్మాణం**

**పారిశుద్ధ్యం, పచ్చదనం పెంపుతో ఆరోగ్యకరమైన సమాజ నిర్మాణానికి కృషి**

**స్థానిక ప్రజాప్రతినిధులు అభివృద్ధి పనుల నాణ్యతను పర్యవేక్షించాలి**

**3.05 కోట్ల యూఐడీఎఫ్ నిధులతో బీటీ రోడ్డు, సీసీ డ్రెయిన్ నిర్మాణ పనులకు శంకుస్థాపన చేసిన మంత్రి తుమ్మల**



**ఖమ్మం, జూన్ 10 (పీపుల్స్ డైరీ) :** ప్రజలకు ఎన్నికల సమయంలో ఇచ్చిన ప్రతి హామీని రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తోందని రాష్ట్ర వ్యవసాయ, మార్కెటింగ్, చేనేత జౌళి శాఖ మంత్రి వర్యులు తుమ్మల నాగేశ్వరరావు అన్నారు. బుధవారం ఖమ్మం నగరంలోని ఎఫ్‌సీఐ గోదాం నుంచి బైపాస్ రోడ్డు వరకు రూ.3 కోట్ల 5 లక్షల యూఐడీఎఫ్ నిధులతో చేపట్టిన బీటీ రోడ్డు, సీసీ డ్రైన్ నిర్మాణ పనులకు సుడా చైర్మన్ పువ్వాళ్ల దుర్గా ప్రసాద్, ఖమ్మం మున్సిపల్ కమీషనర్ అభిషేక్ అగస్త్యతో కలిసి మంత్రి శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా మంత్రి తుమ్మల నాగేశ్వర రావు మాట్లాడుతూ... మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం, 200 యూనిట్ల వరకు ఉచిత విద్యుత్, రూ.500 గ్యాస్ సిలిండర్, సన్నబియ్యం పంపిణీ, కొత్త రేషన్ కార్డులు, పేద విద్యార్థుల కోసం యంగ్ ఇండియా పాఠశాలల ఏర్పాటు వంటి పథకాలను ప్రభుత్వం అమలు చేస్తోందన్నారు. ఇంట్లో కూడా అన్ని పనులను ఒకేసారి చేయలేమని, అదే విధంగా ప్రభుత్వ ఆర్థిక పరిస్థితిని దృష్టిలో ఉంచుకుని దశలవారీగా అభివృద్ధి కార్యక్రమాలు చేపడుతున్నామని తెలిపారు. గుడిసెల్లో నివసిస్తున్న పేదలకు కొత్త ఇళ్ల మంజూరుకు తాను ప్రత్యేక శ్రద్ధ తీసుకుంటానన్నారు. గతంలో మూడు రోజులకోసారి తాగునీరు సరఫరా జరిగేదని, ప్రస్తుతం ప్రతిరోజూ తాగునీరు అందించే దిశగా చర్యలు తీసుకుంటున్నామని తెలిపారు. మున్నేరు వరదల కారణంగా ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలకు శాశ్వత పరిష్కారం చూపేందుకు రిటైనింగ్ వాల్ నిర్మాణ పనులు చేపట్టామని చెప్పారు. కొన్ని ప్రాంతాల్లో ఉన్న సమస్యలను చర్చల ద్వారా పరిష్కరించి పనులను పూర్తి చేస్తామని పేర్కొన్నారు. డివిజన్లలో జరుగుతున్న అభివృద్ధి పనులను స్థానిక ప్రజాప్రతినిధులు పర్యవేక్షించాలని, రోడ్లు, డ్రెయిన్ల నాణ్యతపై దృష్టి పెట్టాలని మంత్రి సూచించారు. పరిసరాలను పరిశుభ్రంగా ఉంచకపోతే ప్రజల ఆదాయం ఆసుపత్రులకే వెచ్చించాల్సి వస్తుందని హెచ్చరించారు. ఖాళీ స్థలాలను పరిశుభ్రంగా ఉంచడంతో పాటు మొక్కలు నాటేందుకు ప్రత్యేక చర్యలు చేపట్టాలని సూచించారు. హైదరాబాద్ తరహాలో ఖమ్మం నగరం లోనూ వేగంగా అభివృద్ధి జరుగుతోందని, రోడ్ల విస్తరణ, జాతీయ రహదారుల నిర్మాణంతో వ్యాపార అవకాశాలు పెరుగుతున్నాయని మంత్రి తెలిపారు. సుడా చైర్మన్ పువ్వాళ్ల దుర్గాప్రసాద్ మాట్లాడుతూ... ఖమ్మం నగర అభివృద్ధిపై మంత్రి తుమ్మల నాగేశ్వరరావు ప్రత్యేక శ్రద్ధ చూపుతున్నారని అన్నారు. మున్నేరు వరదల నేపథ్యంలో రూ.600 కోట్లతో రిటైనింగ్ వాల్ ప్రాజెక్టుకు మంత్రి కృషి చేశారని, పనుల పురోగతిని స్వయంగా పర్యవేక్షిస్తున్నారని తెలిపారు.వెలుగుమట్ల అర్బన్ పార్కును హైదరాబాద్ కేబీఆర్ పార్కు తరహాలో అభివృద్ధి చేస్తున్నారని, ప్రజలు సాయంత్రం వేళల్లో ఆహ్లాదకరంగా గడిపే కేంద్రంగా తీర్చిదిద్దుతున్నారని చెప్పారు. ఖమ్మం మున్సిపల్ కమీషనర్ అభిషేక్ అగస్త్య మాట్లాడుతూ... మంత్రి ఆదేశాల మేరకు ప్రతి డివిజన్‌లో మెరుగైన రోడ్లు, డ్రెయిన్లు, ఇతర మౌళిక సదుపాయాల కల్పనతో పాటు పారిశుద్ధ్యం, పచ్చదనం పెంపునకు చర్యలు చేపడుతున్నామని తెలిపారు. రాష్ట్ర గిడ్డంగుల సంస్థ చైర్మన్ రాయల నాగేశ్వరరావు మాట్లాడుతూ... ప్రజా పాలనలో గత రెండున్నర సంవత్సరాలుగా మహిళా సంక్షేమానికి ప్రభుత్వం అధిక ప్రాధాన్యత ఇస్తోందన్నారు. మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం కల్పించడంతో పాటు స్వయం సహాయక సంఘాలకు ఆర్టీసీ బస్సులను అద్దె ప్రాతిపదికన అందించి ఆదాయ వనరులు కల్పిస్తున్నామని తెలిపారు. వర్షాకాలంలో పారిశుద్ధ్యంపై ప్రత్యేక దృష్టి సారించాలని, ప్రతి డివిజన్‌లో మొక్కలు నాటేందుకు అనువైన ప్రదేశాలను గుర్తించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర గ్రంథాలయ సంస్థ చైర్మన్ ఖాదర్ బాబా, ఖమ్మం మార్కెట్ కమిటీ చైర్మన్ హన్మంతరావు, ఆర్డీవో శ్రీనివాస్, సంబంధిత జిల్లా అధికారులు, ప్రజాప్రతినిధులు తదితరులున్నారు.

## ప్రభుత్వ బడుల్లో చేర్పించండి!

### సామాజిక వేత్త డాక్టర్ మంజుల సాగంటి



**మట్టెవాడ, జూన్ 10 (పీపుల్స్ డైరీ):** ఎన్నో మౌలిక సదుపాయాలున్న ప్రభుత్వ బడుల్లో పిల్లల్ని చేర్పించి నాణ్యమైన విద్యను వారికి అందిం చాలని సామాజిక వేత్త డాక్టర్ మంజుల సాగంటి తల్లిదండ్రులకు విజ్ఞప్తి చేశారు. అత్యాధునిక డిజిటల్ తరగతి గదులు, ప్రయోగ శాలలు, లైబ్రరీలు, ఆటస్థలాలు వంటి మౌలిక వసతులు, ఉచిత విద్య, ఇంగ్లీష్ మీడియంలో బోధన, ఉచిత పాఠ్య పుస్తకాలు, పౌష్టికాహార మధ్యాహ్న భోజనం, యూనిఫామ్ వంటి సంక్షేమ పథకాలు, కార్పొరేట్ సంస్థలకు ధీటుగా ఉన్నత ప్రమాణాలతో అర్హత అనుభవం కలిగి, శిక్షణ పొందిన ఉపాధ్యాయుల ద్వారా విద్యను అభ్యసించే అవకాశాన్ని వినియోగించుకోవాలని ఆమె కోరారు. ప్రభుత్వ పాఠశాలల్లో చదివిన విద్యార్థులకు భవిషత్తులో ఉన్నత విద్య అవకాశాల్లో, ఉద్యోగ అవకాశాల్లో అధిక ప్రయోజనం ఉంటుందని మంజుల సూచించారు

## కాట్రపల్లి సర్పంచ్‌పై క్రమశిక్షణ చర్యలు



**కేసముద్రం, జూన్ 10 (పీపుల్స్ డైరీ) :** మండలం కాట్రపల్లి గ్రామంలో బీఆర్ఎస్ గ్రామ పార్టీ ఆధ్వర్యంలో పత్రిక సమావేశం జరిగింది. ఈ సమావేశానికి గ్రామ కమిటీ అధ్యక్షుడు బొంత వెంకన్న అధ్యక్షత వహించారు.ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా మాజీ జెడ్పిటిసి రావుల శ్రీనాథ్ రెడ్డి, మండల అధ్యక్షుడు నజీర్ అహ్మద్ పాల్గొన్నారు.సమావేశంలో వక్తలు మాట్లాడుతూ స్థానిక గ్రామ సర్పంచ్ ఎదురబోయిన సూరయ్య కార్యకర్తల కృషితో, గత కెసిఆర్ ప్రభుత్వంలో చేసిన అభివృద్ధి అనే పునాదులపై గెలిచి, నేడు లోపాయికారి ఒప్పందాలు చేసుకొని పార్టీ మారి పార్టీకి మోసం చేసిన విషయాన్ని తీవ్రంగా ఖండించారు. ఇలాంటి మోసపూరిత నాయకుడు పార్టీ మారినంత మాత్రాన బీఆర్ఎస్ పార్టీ క్షీణించదని, పార్టీ కార్యకర్తలు అందరూ ధైర్యంగా ఉండి పార్టీ అభివృద్ధికి కృషి చేయాలని పిలుపునిచ్చారు. మాజీ శాసనసభ్యుడు శంకర్ నాయక్ చరవాణిలో కార్యకర్తలకు భరోసా కల్పిస్తూ మీ అందరికీ వెన్నంటి ఉండి సేవలందిస్తానని హామీ ఇచ్చారు. ఇకనుండి బీఆర్ఎస్ పార్టీకి గాని, ఎదురబోయిన సూరయ్యకు గాని ఎలాంటి సంబంధం లేదని గ్రామ కమిటీ, మండల కమిటీ తీవ్రంగా ఖండిస్తూ పార్టీ నుంచి సస్పెండ్ చేసినట్లు సభాముఖంగా ప్రకటించారు. కార్యక్రమంలో మండల వర్కింగ్ ప్రెసిడెంట్ రాకేష్ రెడ్డి, మాజీ సర్పంచ్ జల్లే సైదమ్మ రవీందర్, మాజీ ఉపసర్పంచ్ పుల్ల శ్రీనివాస్ యాదవ్, నూతన ప్రజా ప్రతినిధులు, కార్యవర్గ సభ్యులు, మహిళలు పాల్గొన్నారు.

## సాద బైనామ భూభారతి దరఖాస్తులను పరిష్కరించాలి

**చిట్యాల, జూన్ 10 (పీపుల్స్ డైరీ) :** తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన సాధబైనామా భూ భారతిలో భూములు పట్టా చేయాలని దరఖాస్తు చేసుకున్న వాటిని పరిశీలించి పట్టాదారునికి పట్టా పాస్ బుక్కులు ఇవ్వాలని తెలంగాణ రాష్ట్ర అంబేద్కర్ యువజన సంఘం రాష్ట్ర ఆర్గనైజింగ్ సెక్రటరీ పుల్ల మల్లయ్య ప్రభుత్వాన్ని సంబంధించిన అధికారులను డిమాండ్ చేశారు. చిట్యాల మండల కేంద్రంలో బుధవారం అంబేద్కర్ యువజన సంఘం మండల ప్రచార కార్యదర్శి కట్కూరి రాజు అద్యక్షతన రాష్ట్ర ఆర్గనైజింగ్ సెక్రటరీ పుల్ల మల్లయ్య మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్ర వ్యాప్తంగా గత బిఆర్ఎస్ ప్రభుత్వం హయంలో సాదా బైనామాలో వచ్చిన దరఖాస్తులను పరిస్కరించలేదని ఇప్పటి ప్రభుత్వం హయంలో భూ భారతిలో భూములు పట్టా బుక్కుల కోసం దరఖాస్తు చేసుకున్న వారందరికీ ఉచితంగా పట్టాబుక్కులు ఇస్తామని చెప్పి ఇప్పటికి పెండింగ్‌లో పెట్టడం సరియైనది కాదన్నారు.



## సినీ నటుడు బాలకృష్ణ జన్మదిన వేడుకలు

**ఏన్కూరు జూన్ 10 (పీపుల్స్ డైరీ) :** ఏన్కూరులో బుధవారం ప్రముఖ సినీ నటుడు పద్మ భూషణ్ అవార్డు గ్రహీత, హిందూపురం శాసనసభ్యులు నందమూరి బాలకృష్ణ 66వ జన్మదిన వేడుకలను ఆయన వీరాభిమాని కాలనీ నాచారం గ్రామానికి చెందిన ఇటుకాల రాజు ఆధ్వర్యంలో ఘనంగా జరిపారు. ఈ సందర్భంగా ఇటుకాల రాజు కేక్ కట్ చేసి అభిమానుల కు పంచిపెట్టారు, పండ్లు పంపిణీ చేశారు. ఆయురారోగ్యాలతో మరెన్నో జన్మదినాలు జరుపుకోవాలని ఆకాంక్షించారు .పేదలకు అండగా నిలుస్తూ ప్రజాసేవకు అంకితం అవుతున్న నందమూరి బాలకృష్ణకు జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు .ఈ కార్యక్రమంలో పూర్ణ కంటి మైసారావు, అత్తలూరి కోటా చారి, జయమ్మ ,మంకెన కృష్ణ, కళ్యాణ్ ,నరసింహారావు ,వేణు తదితరులు పాల్గొన్నారు.

## పినపాక నియోజకవర్గంలో ఎంపీ పర్యటనకై ఎదురుచూపులు




**పినపాక, జూన్ 10 (పీపుల్స్ డైరీ) :** మహబూబాబాద్ పార్లమెంట్ నియోజక వర్గ పరిధిలోని పినపాక అసెంబ్లీ నియోజకవర్గంలో ఎంపీ పర్యటన అంశం స్థానికంగా చర్చనీయాంశంగా మారింది. ఎన్నికల అనంతరం నియోజకవర్గ ప్రజలతో ప్రత్యక్షంగా సమావేశమై సమస్యలు తెలుసుకునే కార్యక్రమం కోసం ప్రజలు ఎదురుచూస్తున్నట్లు తెలుస్తోంది. పినపాక నియోజకవర్గంలోని గ్రామీణ, గిరిజన ప్రాంతాల్లో రహదారులు, తాగు నీరు, వైద్య సేవలు, ఉపాధి అవకాశాలు, మౌలిక వసతుల అభివృద్ధి వంటి పలు అంశాలు ప్రజల దృష్టిని ఆకర్షిస్తున్నాయి. ఈ సమస్యలపై ఎంపీ స్పందించి సంబంధిత శాఖలతో సమన్వయం చేస్తే పరిష్కారం వేగవంతమవుతుందని స్థానికులు అభిప్రాయపడుతున్నారు.ప్రజాప్రతినిధులు ప్రజలకు అందుబాటులో ఉండి వారి సమస్యలను ప్రత్యక్షంగా తెలుసుకోవడం ప్రజాస్వామ్య వ్యవస్థలో ముఖ్యమైన అంశమని పలువురు సామాజిక కార్యకర్తలు పేర్కొంటున్నారు. పినపాక ప్రాంత ప్రజలు కూడా తమ సమస్యలను ఎంపీ దృష్టికి తీసుకెళ్లే అవకాశాన్ని కోరుకుంటున్నారు.

## ఉద్యోగున్నతి పొందిన అధికారులకు సీపీ అభినందనలు



**ఖమ్మం, జూన్ 10 (పీపుల్స్ డైరీ) :** వివిధ పోలీస్ స్టేషన్ లలో కానిస్టేబుల్ గా నిరంతరంగా సేవలందించి హెడ్ కానిస్టేబుల్ గా ఉద్యోగున్నతి పొందిన 2000 బ్యాచ్ చెందిన ఎనిమిది మంది పోలీస్ అధికారులను పోలీస్ కమిషనర్ కార్యాలయంలో పోలీస్ కమిషనర్ సునీల్ దత్ పదోన్నతి చిహ్నాన్ని అలంకరించి, అభినందనలు తెలియజేశారు. పదోన్నతి పొందిన వారిని ఇతర జిల్లాలకు బదిలీ చేశారు. ఖమ్మం జిల్లాకు ఇద్దరు, మహబూబాబాద్ జిల్లా ఒక్కరు, భద్రాద్రి కొత్తగూడెం జిల్లాకు నలుగురు, ఇంటిలిజెన్స్ ఒక్కరు బదిలీపై వెళ్ళనున్నారు.

## చిన్నారిని ఆశీర్వదించిన కీర్తిరెడ్డి



**చిట్యాల, జూన్ 10 (పీపుల్స్ డైరీ) :** టేకుమట్ల మండలం రామకృష్ణాపూర్ (వి) గ్రామానికి చెందిన పుష్పలత రాజు దంపతుల కూతురు సాయి ప్రసన్న సారీ ఫంక్షన్ కు బిజెపి రాష్ట్ర కార్యవర్గ సభ్యురాలు చందుపట్ల కీర్తి రెడ్డి బుధవారం హాజరై చిన్నారిని ఆశీర్వదించారు. ఈ కార్యక్రమంలో మండల అధ్యక్షుడు గుర్రపు నాగరాజు గౌడు మండల ప్రధాన కార్యదర్శిలు బండారి సమ్మయ్య గాజుల అజయ్ సుబ్బక్క పల్లె సర్పంచ్ బొడ్డు రాజేందర్ బండపల్లి ఉపసర్పంచ్ ఆరే అశోక్ సీనియర్ నాయకుడు బట్టల మొగిలి మండల ఉపాధ్యక్షుడు శ్రీపతి రవి భూత్ అధ్యక్షుడు సాయి బీజేవైఎం మండల నాయకుడు ఎడ్ల శ్రీకాంత్ కలల సాయిలు దేశిని రాయమల్లు ఎర్ర రాకేష్ రెడ్డి తదితర కార్యకర్తలు పాల్గొన్నారు.

# అర్హులైన ప్రతి ఓటరు జాబితాలో ఉండేలా చర్యలు తీసుకోవాలి

**జిల్లాలో ఒక్క అర్హుడైన ఓటరు కూడా ఓటు హక్కు కోల్పోకూడదు**

**మ్యాపింగ్ పూర్తయిన ప్రతి ఓటరు తప్పనిసరిగా ఎన్యూమరేషన్ ఫారం సమర్పించాలి**

**ఎస్ఐఆర్ కార్యక్రమంపై రాజకీయ పార్టీల ప్రతినిధులతో సమీక్ష సమావేశం నిర్వహించిన జిల్లా కలెక్టర్**



**ఖమ్మం, జూన్ 10 (పీపుల్స్ డైరీ) :** అర్హులైన ప్రతి ఓటరు డ్రాఫ్ట్ జాబితాలో ఉండేలా ముందస్తు చర్యలు తీసుకోవాలని జిల్లా కలెక్టర్ దివాకర టిఎస్ తెలిపారు. బుధవారం కలెక్టరేట్ లో స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ డాక్టర్ పి.శ్రీజ, మునిసిపల్ కమీషనర్ అభిషేక్ అగస్త్య లతో కలిసి ప్రత్యేక సమగ్ర ఓటరు జాబితా సవరణ (ఎస్ఐఆర్) కార్యక్రమంపై రాజకీయ పార్టీల ప్రతినిధులతో జిల్లా కలెక్టర్ దివాకర టిఎస్ సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ దివాకర టిఎస్ మాట్లాడుతూ... జిల్లాలో సుమారు 12 లక్షల మంది ఓటర్లు ఉండగా, ఇప్పటివరకు 10 లక్షల మంది వరకు ఓటర్ల మ్యాపింగ్ పూర్తయిందన్నారు. వివిధ కారణాల వల్ల మిగిలిన 20 శాతం ఓటర్ల మ్యాపింగ్ జరగలేదని తెలిపారు. ఎస్.ఐ.ఆర్. కార్యక్రమాన్ని అన్ని రాజకీయ పార్టీలు అత్యంత బాధ్యతగా తీసుకోవాలని, బీఎల్‌వోలు ఇంటింటికి వచ్చినప్పుడు ఓటర్లు సకాలంలో స్పందించేలా చర్యలు తీసుకోవాలని కోరారు. జిల్లాలో ఒక్క అర్హుడైన ఓటరు కూడా ఓటు హక్కు కోల్పోకూడదనేదే జిల్లా యంత్రాంగం లక్ష్యమని స్పష్టం చేశారు. మ్యాపింగ్ పూర్తయిన ప్రతి ఓటరు కూడా తప్పనిసరిగా ఎన్యూమరేషన్ ఫారం సమర్పించాలని, ఫారం సమర్పించని పక్షంలో వారి పేరు డ్రాఫ్ట్ ఓటరు జాబితాలో ఉండదని స్పష్టం చేశారు. అనంతరం అభ్యంతరాలు నమోదు చేయాల్సిన పరిస్థితి ఏర్పడి సమస్యలు తలెత్తుతాయని, అర్హులైన ప్రతి ఒక్కరి పేరు డ్రాఫ్ట్ జాబితాలో ఉండేలా ముందస్తు చర్యలు తీసుకోవాలని సూచించారు. ప్రస్తుతం జిల్లాలో అనామలీలను గణనీయంగా తగ్గించగలిగామని, గతంలో 30 శాతం ఉన్న అనామలీలను ప్రస్తుతం 20 శాతానికి తగ్గించామని తెలిపారు. 80 శాతం మ్యాపింగ్ పూర్తయిన ఓటర్లలో సిస్టమ్ ద్వారా గుర్తించిన అనామలీలకు నోటీసులు జారీ చేసి పరిశీలన చేపడతామని చెప్పారు. తండ్రి-కొడుకు సంబంధంగా మ్యాపింగ్ చేసిన ఇద్దరి మధ్య వయస్సు వ్యత్యాసం 15 సంవత్సరాల కంటే తక్కువగా ఉన్నా, తాత-మనవడు సంబంధంగా నమోదు చేసిన వారి మధ్య తక్కువ వ్యత్యాసం ఉన్నా వాటిని అనామలీలుగా పరిగణించి నోటీసులు జారీ అవుతాయని తెలిపారు. అనామలీల సమస్య పరిష్కారానికి పూర్తి ప్రక్రియను అనుసరించాల్సి ఉంటుందని పేర్కొన్నారు. ఓటరు జాబితాలో గుర్తించిన లోపాలు గల ప్రతి అనామలీ ఓటరుకు నోటీసులు జారీ చేసి, వారి వివరణలు స్వీకరించి సవరణలు చేపట్టాల్సి ఉంటుందని చెప్పారు. మొత్తం ప్రక్రియను ఫోటోగ్రఫీ, వీడియోగ్రఫీ ఆధారాలతో భద్రపరుస్తామని తెలిపారు. అనామలీలుగా గుర్తించిన ఓటర్ల వద్ద సంబంధిత పత్రాలు ఉన్నాయా లేదా అనే విషయాన్ని నిర్ధారించేందుకు జూలై 15 వరకు ఇంటింటి సర్వే నిర్వహిస్తున్నామని తెలిపారు. బూత్ లెవల్ ఏజెంట్లు (బీఎల్ఏలు) ఈ కార్యక్రమానికి సహకరించాలని కోరారు. ప్రతి రాజకీయ పార్టీ బూత్ స్థాయిలో బీఎల్ఏలను నియమించి కార్యక్రమాన్ని పర్యవేక్షించాలని సూచించారు. పాత ఎస్ఎస్ఆర్ జాబితాలో ఉండి మ్యాపింగ్ కాని ఓటర్లు ఎన్నికల సంఘం గుర్తించిన 11 గుర్తింపు పత్రాల్లో ఏదో ఒకటి సమర్పించాలని, రేషన్ కార్డును గుర్తింపు పత్రంగా పరిగణించబోమని స్పష్టం చేశారు. మ్యాపింగ్ కాని ఓటర్ల ప్రస్తుత స్థితి, గ్రామంలోనే నివసిస్తున్నారా, జీవించి ఉన్నారా లేదా, శాశ్వతంగా ఇతర ప్రాంతాలకు వలస వెళ్లారా వంటి వివరాలను సేకరిస్తామని తెలిపారు. సమావేశంలో కల్లూరు సబ్ కలెక్టర్ అజయ్ యాదవ్, ఆర్డీఓ శ్రీనివాస్, బీఆర్ఎస్ పార్టీ ప్రతినిధులు బెల్లం వేణుగోపాల్, రమేష్, పి.నాగరాజు, బీజేపీ ప్రతినిధులు రాజేష్, వెంకటేశ్వర్ రావు, కాంగ్రెస్ పార్టీ ప్రతినిధులు గోపాలరావు, సత్యనారాయణ, సిపిఎం డి.తిరుపతి, ఎన్.వీరబాబు, ఆప్ ప్రతినిధి పి.శ్రీనివాస్, టీడీపీ పాలడుగు టిఆర్ కృష్ణప్రసాద్, బిఎస్పి సిహెచ్ నాగేశ్వర రావు, ఎం.నాగేశ్వర రావు, ప్రజా ప్రతినిధులు, సంబంధిత అధికారులు, తదితరులున్నారు.

# వడదెబ్బ సోకి ఒకరు మృతి





**మొగుళ్లపల్లి జూన్ 10 (పీపుల్స్ డైరీ ):** మండలంలో వడదెబ్బ సోకి ఒకరు మృతి చెందారు. ఘటనకు సంబంధించి స్థానికులు అందించిన సమాచారం మేరకు. మొగుళ్లపల్లి మండలం ఎల్లారెడ్డిపల్లి గ్రామానికి చెందిన కల్లేపల్లి చంద్రమౌళి (55) వడదెబ్బ తలిగి మృతి చెందడం జరిగింది. మృతుడు కల్లేపల్లి చంద్రమౌళి తన కూతురు కరీంనగర్ జిల్లా హుజురాబాద్ ఆసుపత్రిలో ప్రసవం జరిగి బాబుకు జన్మనివ్వగా మనువాన్ని చూసొద్దామని జూన్ 6 శనివారం హుజురాబాద్ ఆసుపత్రికి వెళ్లి తన కూతురితోపాటు మనువన్ని చూసిన కల్లేపల్లి చంద్రమౌళి. సంతోషంగా తిరుగు ప్రయాణంలో స్వగ్రామంకు వెళ్దామని బయలుదేరి హుజూరాబాద్ బస్టాండుకు చేరువలోనే కల్లేపల్లి చంద్రమౌళి స్పృహ కోల్పోయి ఒక్కసారిగా కుప్పకూలాడు. హుటాహుటిన 108 సిబ్బంది హుజురాబాద్ ప్రభుత్వ ఆసుపత్రిలో చికిత్స అందించిన స్థానిక వైద్యులు మెరుగైన చికిత్స అందించాలని సూచించగా వైద్యం అందించేందుకు వరంగల్ ఎంజీఎం ఆసుపత్రికి తరలించగా చికిత్స పొందుతూ. బుధవారం మృతి చెందాడు వడదెబ్బతో మృతి చెందిన కల్లేపల్లి చంద్రమౌళి కుటుంబాన్ని ఆర్థికంగా ప్రభుత్వం ఆదుకోవాలని గ్రామస్తులు నాయకులు కోరారు. మృతిని అంతిమయాత్రలో ఎల్లారెడ్డిపల్లి గ్రామ సర్పంచ్ నల్ల అరుణ లింగరెడ్డి, ఉప సర్పంచ్ వంగ కోమల కుమార్, డీలర్ నిమ్మల భద్రయ్య, ఉస్మానియా యూనివర్సిటీ, జాక్ ప్రెసిడెంట్ డాక్టర్ నలిగంటి శరత్ చమార్, కాకతీయ యూనివర్సిటీ కేతపాక ప్రసాద్, ఎమ్మార్పీఎస్ నాయకులు,విద్యార్థి సంఘాల నాయకులు పాల్గొన్నారు

# పర్యావరణాన్ని రక్షించుకుందాం.. మొక్కలను నాటుదాం: ఆర్డీఓ ఉమారాణి

**నాగరాజుపల్లె గ్రామసభలో ఆర్డీఓ ఉమారాణి, సర్పంచ్ లలిత**



**నల్లబెల్లి జూన్ 10 పీపుల్స్ డైరీ :** 'ప్రజా పాలన ప్రగతి ప్రణాళిక' 99 రోజుల కార్యాచరణలో భాగంగా నల్లబెల్లి మండలం నాగరాజుపల్లె గ్రామ పంచాయతీలో గ్రామసభ ఘనంగా నిర్వహించారు. ఈ సభకు ముఖ్యఅతిథిగా రెవెన్యూ డివిజనల్ అధికారి (ఆర్డీఓ) ఉమారాణి హాజరయ్యారు.గ్రామసభలో ఆర్డీఓ ఉమారాణి ప్రజలను ఉద్దేశించి మాట్లాడుతూ పర్యావరణాన్ని రక్షించుకోవాల్సిన ఆవశ్యకతను వివరించారు.ఎల్ నినో ప్రభావంతో రానున్న రోజుల్లో తీవ్ర వర్షాభావ పరిస్థితులు లేదా అధిక వర్షపాతం నమోదై వాతావరణ సమతుల్యత దెబ్బతినే ప్రమాదం ఉందన్నారు.మారుతున్న వాతావరణ పరిస్థితులకు అనుగుణంగా రైతులు పంటల ఎంపికలో తగిన జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు.ప్రతి ఒక్కరూ బాధ్యతగా మొక్కలను నాటి, వాటిని సంరక్షించాలని కోరుతూ సభలో ఉన్నవారందరితో ప్రతిజ్ఞ చేయించారు.గ్రామ సర్పంచ్ ఎరుకల లలిత రఘు మాట్లాడుతూ.. గత 99 రోజులుగా గ్రామంలో చేపట్టిన వివిధ అభివృద్ధి కార్యక్రమాలను, అందుకోసం ఏర్పాటు చేసిన కమిటీల వివరాలను విపులంగా వివరించారు."ప్రజల చేత ఎన్నుకోబడిన ఈ ప్రజా ప్రభుత్వం సంక్షేమ పథకాలను నేరుగా ప్రజల వద్దకే తీసుకువచ్చి అర్హులైన ప్రతి ఒక్కరికీ అందిస్తుంది. గ్రామస్థాయిలో ఉన్న సమస్యలను గుర్తించి, వాటిని ఒక్కొక్కటిగా పరిష్కరిస్తూ ముందుకు సాగుతాం." అని ఆమె గ్రామసభ సాక్షిగా హామీ ఇచ్చారు.ఈ కార్యక్రమంలో ఎమ్మార్వో ముప్పు కృష్ణ, పశు వైద్యాధికారి సురేష్, ప్రధానోపాధ్యాయులు రామ్మూర్తి, పంచాయతీ కార్యదర్శి, వివిధ శాఖల ప్రభుత్వ అధికారులు, గ్రామ పంచాయతీ పాలకవర్గ సభ్యులు మరియు గ్రామస్తులు పెద్ద సంఖ్యలో పాల్గొని గ్రామసభను విజయవంతం చేశారు.

# ఉప సర్పంచ్‌ల ఫోరం జిల్లా వర్కింగ్ కమిటీ అధ్యక్షుడిగా గుమ్మడి వేణు ఏకగ్రీవం



నల్లబెల్లి జూన్ 10 పీపుల్స్ డైరీ : ఉప సర్పంచ్‌ల ఫోరం జిల్లా వర్కింగ్ కమిటీ అధ్యక్షుడిగా నల్లబెల్లి గ్రామ ఉపసర్పంచ్ గుమ్మడి వేణు ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. ఈ మేరకు ఫోరం ప్రతినిధులు ఆయన నియామకాన్ని అధికారికంగా ప్రకటించారు. ఈ సందర్భంగా జిల్లా నలుమూలల నుంచి వచ్చిన ఉప సర్పంచులు ఆయనకు ఘనంగా శుభాకాంక్షలు తెలిపారు.

**చెక్ పవర్ పునరుద్ధరణే లక్ష్యం: గుమ్మడి వేణు**

తన ఎన్నిక అనంతరం గుమ్మడి వేణు మాట్లాడుతూ... తనపై నమ్మకంతో ఈ బాధ్యతను అప్పగించిన ప్రజాప్రతినిధులందరికీ కృతజ్ఞతలు తెలిపారు. ఉప సర్పంచ్‌లు ఎదుర్కొంటున్న సమస్యల పరిష్కారానికి నిరంతరం కృషి చేస్తానని ఆయన హామీ ఇచ్చారు. ముఖ్యంగా, ఉప సర్పంచ్‌ల చెక్ పవర్ పునరుద్ధరణ కోసం గట్టిగా పోరాడతానని స్పష్టం చేశారు."గ్రామాల సర్వాంగీణ అభివృద్ధిలో ఉప సర్పంచ్‌ల పాత్ర ఎంతో కీలకమైనది. నిధులు, విధుల సాధన కోసం అందరినీ కలుపుకొని, సమష్టిగా ముందుకు సాగుతాం."

# రోడ్డుపై కూలిన భారీ చెట్టు.. గంటలపాటు రాకపోకలకు అంతరాయం



**నర్సంపేట జూన్ 10 పీపుల్స్ డైరీ :** నర్సంపేట--కొత్తగూడ రహదారిపై బుధవారం భారీ చెట్టు ఒక్కసారిగా రోడ్డుపై కూలిపోవడంతో రాకపోకలు నిలిచిపోయాయి. దీంతో వాహనదారులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొన్నారు. సమాచారం అందుకున్న స్థానికులు, ప్రయాణికులు కలిసి చెట్టు కొమ్మలను తొలగించి మార్గాన్ని పునరుద్ధరించారు. చెట్టు కూలిన సమయంలో వాహనాలు లేకపోవడంతో ప్రమాదం తప్పింది. కొంతసేపు ట్రాఫిక్‌కు అంతరాయం ఏర్పడగా, అనంతరం చెట్టును పూర్తిగా తొలగించి వాహనాల రాకపోకలను పునరుద్ధరించారు. ఘటనతో ప్రయాణికులు ఊపిరి పీల్చుకున్నారు.

# నేడు విద్యుత్ సరఫరా నిలిపివేత

**ఉదయం 7:30 నుండి 11:30 గంటల వరకు అంతరాయం: ఏఏఈ విజయ్ భాస్కర్**

**నర్సంపేట, జూన్ 10:జూన్ 10 పీపుల్స్ డైరీ :** నర్సంపేట పట్టణంలోని పలు ప్రాంతాల్లో నేడు (గురువారం) ఉదయం విద్యుత్ సరఫరాకు అంతరాయం కలగనుందని విద్యుత్ శాఖ ఏఏఈ (ూూాజు) విజయ్ భాస్కర్ ఒక ప్రకటనలో తెలిపారు.ద్వారకపేట నూతన సబ్‌స్టేషన్కు సంబంధించిన టవర్ లైన్ నిర్మాణ మరియు అనుసంధాన పనుల (×త్వతీశ్రీఱఅని ఔశీతీఎం) కారణంగా రేపు ఉదయం 7:30 గంటల నుండి 11:30 గంటల వరకు విద్యుత్ సరఫరాను నిలిపివేస్తున్నట్లు ఆయన పేర్కొన్నారు.ఎమ్మెల్యే క్యాంప్ కార్యాలయ పరిసరాలు,ఆర్డీవో (=ఖూ) కార్యాలయ ప్రాంతం,కాకతీయ నగర్,డీఎస్పీ (ఖ్రూ) కార్యాలయ పరిసరాలు,శాంతినగర్ పైన పేర్కొన్న ప్రాంతాల వినియోగదారులు, గృహిణులు మరియు వ్యాపారస్థులు ఈ సమయాన్ని గమనించి, విద్యుత్ శాఖ సిబ్బందికి సహకరించాల్సిందిగా కోరడమైనది. పనులు పూర్తి కాగానే విద్యుత్ సరఫరాను పునరుద్ధరిస్తామని ఏఏఈ తెలిపారు.

# వర్షాకాలంలో ప్రజలు అప్రమత్తంగా ఉండాలి

**ఎస్ఐ పోచంపల్లి సతీష్**



చిట్యాల,జూన్10(పీపుల్స్ డైరీ) : వర్షాకాలంలో ప్రజలు భద్రతను దృష్టిలో ఉంచుకుని జాగ్రత్తలు పాటించి అప్రమత్తంగా ఉండాలని చిట్యాల ఎస్ఐ పోచంపల్లి సతీష్ బుధవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. వర్షాలకు రోడ్లపై నీరు చేరినప్పుడు ముఖ్యంగా కల్వర్టులు వాగులు ప్రవహిస్తున్నప్పుడు సాహసాలు చేసి వాటిని దాటడానికి ప్రయత్నించవద్దని భారీ వర్షాలు కురుస్తున్నప్పుడు అత్యవసరం అయితే తప్ప రాత్రి వేళల్లో ప్రయాణాలు చేయకపోవడమే మంచిదని రోడ్లపై గుంతలు చెట్ల కొమ్మలు విరిగిపడటం వంటి ప్రమాదాలు పొంచి ఉంటాయి అని తెలిపారు. వాహనదారులు రోడ్లపై నెమ్మదిగా జాగ్రత్తగా ప్రయాణించాలన్నారు. వీధుల్లో ఉండే విద్యుత్ స్తంభాలు ట్రాన్స్‌ఫార్మర్లు వేలాడే విద్యుత్ తీగలను తాకవద్దు అని పశువులను కూడా వాటికి దూరంగా ఉంచాలి అని ఇళ్లలో తడి చేతులతో స్విచ్‌లు కరెంట్ బోర్డులను ముట్టుకోవద్దు అని తెలిపారు. గోడలు తడిస్తే కరెంట్ షాక్ వచ్చే అవకాశం ఉంటుంది కాబట్టి అప్రమత్తంగా ఉండాలి అన్నారు. మండలంలోని గ్రామాల ప్రజలు పాతబడిన శిథిలావస్థలో ఉన్న ఇళ్లలో ఉండకూడదని భారీ వర్షాలకు ఇళ్లు కూలే ప్రమాదం ఉంటే వెంటనే సురక్షిత ప్రాంతాలకు లేదా పునరావాస కేంద్రాలకు వెళ్లాలన్నారు. పాత గోడల పక్కన నిలబడటం లేదా వాహనాలు నిలపడం చేయవద్దు అని తెలిపారు. పిడుగులు పడే అవకాశం ఉన్నందున వర్షం వచ్చేటప్పుడు పొలాల్లో ఉండే రైతులు పశువుల కాపరులు పెద్ద పెద్ద చెట్ల కింద విద్యుత్ స్తంభాల కింద నిలబడకూడదు అన్నారు. సురక్షితమైన భవనాలలో ఆశ్రయం పొందాలి అని తెలిపారు. పిల్లలను వర్షపు నీటిలో గుంతల వద్ద చెరువులు లేదా కుంటల దగ్గరకు వెళ్లకుండా తల్లిదండ్రులు గమనిస్తూ ఉండాలని సూచించారు. నీరు నిలిచిన చోట కరెంట్ తీగలు తెగిపడే ప్రమాదం కూడా ఉంటుందని వెల్లడించారు. వర్షాలు వరదలకు సంబంధించి సోషల్ మీడియాలో వచ్చే తప్పుడు వార్తలను పుకార్లను నమ్మవద్దని అధికారిక సమాచారాన్ని మాత్రమే పరిగణనలోకి తీసుకోవాలని ఏదైనా ప్రమాదం జరిగినా లేదా అత్యవసర సహాయం కావాలన్నా వెంటనే డైల్ 100 కు లేదా స్థానిక చిట్యాల పోలీస్ స్టేషన్ అధికారులను సంప్రదించాలని సూచించారు.

# ఖమ్మంలో బీసీ రజక మైనర్ బాలికపై జరిగిన దారుణ ఘటనపై గౌస్‌పై కఠిన చట్టపరమైన చర్యలు తీసుకోవాలి

- బాధితురాలికి వెంటనే న్యాయం చేయాలి
- బిఆర్ఎస్ పార్టీ ఇల్లందు మండల నాయకురాలు వడ్డపల్లి రాజేశ్వరి డిమాండ్



ఇల్లందు (భద్రాద్రి కొత్తగూడెం) జూన్ 10 (పీపుల్స్ డైరీ) : ఖమ్మం జిల్లా, ఖమ్మం పట్టణంలో బీసీ రజక కులానికి చెందిన ఓ మైనర్ బాలికపై లైంగిక దాడి జరిగిందనే ఆరోపణలు, అనంతరం ఆమెను భవనం పై నుంచి తోసివేసి హత్యాయత్నానికి పాల్పడ్డారనే వార్తలు తీవ్ర ఆందోళనకు గురిచేస్తున్నాయని బిఆర్ఎస్ పార్టీ మండల నాయకుల నాయకురాలు వడ్డపల్లి రాజేశ్వరి పేర్కొన్నారు. ఈ ఘటన అత్యంత అమానుషమైనది, సభ్య సమాజం తలదించుకునే విధంగా ఉందన్నారు. మహిళలు, బాలికల భద్రత కోసం ప్రత్యేక చట్టాలు అమల్లో ఉన్నప్పటికీ ఇలాంటి ఘటనలు జరగడం అత్యంత బాధాకరమని అన్నారు. మైనర్ బాలికలపై లైంగిక దాడులు, వేధింపులు, హింసాత్మక చర్యలకు పాల్పడే వ్యక్తులపై ప్రభుత్వం రాజీపడకుండా కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. ఈ ఘటనలో ఆరోపణలు ఎదుర్కొంటున్న గౌస్‌పై పోలీసులు వెంటనే సమగ్ర దర్యాప్తు నిర్వహించి, వర్తించే అన్ని చట్టాల కింద, ముఖ్యంగా పోక్సో చట్టం ప్రకారం కఠిన కేసులు నమోదు చేసి, వేగంగా విచారణ జరిపి బాధితురాలికి న్యాయం చేయాలని కోరారు. మహిళల భద్రతకు కట్టుబడి ఉన్న ప్రభుత్వం అని కాంగ్రెస్ ప్రభుత్వం హయాంలో ఇటువంటి ఘటనలు జరగడం అత్యంత విచారకరమని పేర్కొన్నారు. రాష్ట్ర ప్రభుత్వం, పోలీసు శాఖ, ప్రజాప్రతినిధులు ఈ ఘటనపై ప్రత్యేక దృష్టి సారించి బాధిత కుటుంబానికి అండగా నిలవాలని కోరారు. ఉమ్మడి ఖమ్మం జిల్లా ముగ్గురు మంత్రులు ఈ ఘటనపై స్పందించి బాధిత బాలికకు న్యాయం జరిగేలా చర్యలు తీసుకోవాలని విజ్ఞప్తి చేశారు. మైనర్ బాలికపై జరిగిన ఈ దారుణ ఘటనలో నిజానిజాలను వెలికితీసి, దోషులుగా తేలిన వారిపై చట్టం అనుమతించే అత్యంత కఠిన శిక్షలు అమలు చేయాలని డిమాండ్ చేశారు. బాధితురాలికి పూర్తి న్యాయం జరిగే వరకు పోరాటాన్ని కొనసాగిస్తుందని హెచ్చరించారు.

# ప్రజా సమస్యల పరిష్కారానికే వార్డు సభలు



ఇల్లందు (భద్రాద్రి కొత్తగూడెం) జూన్ 10 (పీపుల్స్ డైరీ) : ప్రజల గడప వద్దకే పాలన తీసుకెళ్లే లక్ష్యంతో వార్డు సభలు నిర్వహిస్తున్నామని, ప్రజా సమస్యలను నేరుగా తెలుసుకొని సత్వర పరిష్కారానికి ఇవి దోహదపడతాయని 22వ వార్డ్ కౌన్సిలర్ కొర్లపాటి శివ కిరణ్ అన్నారు. ఇల్లందు పట్టణంలోని 22వ వార్డు వాటర్ ట్యాంక్ ఆవరణలో మున్సిపల్ ఆధ్వర్యంలో వార్డు సభ జరిగింది. పెద్ద సంఖ్యలో మహిళలు, వృద్ధులు, స్థానిక ప్రజలు హాజరయ్యారు. ఈ సందర్భంగా కౌన్సిలర్ మాట్లాడుతూ, వార్డులో తాగునీరు, పారిశుధ్యం, డ్రైనేజీ, వీధి దీపాల నిర్వహణ వంటి మౌలిక సమస్యలపై ప్రత్యేక దృష్టి సారించామని తెలిపారు. ప్రజల సూచనల మేరకు ప్రాధాన్యతా క్రమంలో అభివృద్ధి పనులు చేపడతామని హామీ ఇచ్చారు. రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన సమగ్ర ఇంటింటి సర్వే పై ప్రజలకు అవగాహన కల్పించారు. ప్రతి కుటుంబం వివరాలు సక్రమంగా నమోదు చేయించుకోవాలని, దీని ద్వారానే భవిష్యత్తులో అన్ని సంక్షేమ పథకాలు వర్తిస్తాయని వివరించారు. సభలో ప్రజల నుంచి వినతులు వెల్లువెత్తాయి. నూతన పెన్షన్లు, కొత్త రేషన్ కార్డులు, రేషన్ కార్డులో పేర్ల మార్పు, గృహజ్యోతి పథకం కింద 200 యూనిట్ల ఉచిత విద్యుత్, ఇందిరమ్మ ఇళ్ల కోసం పెద్ద సంఖ్యలో దరఖాస్తులు అందాయి. స్వీకరించిన దరఖాస్తులను వెంటనే పరిశీలించి అర్హులైన వారందరికీ న్యాయం చేస్తామని, సంబంధిత శాఖల అధికారులతో సమన్వయం చేసుకొని సమస్యలు పరిష్కరిస్తామని కౌన్సిలర్ భరోసా ఇచ్చారు. మున్సిపల్ కమిషనర్ సందీప్ మాట్లాడుతూ, ప్రజల నుంచి వచ్చిన ప్రతి ఫిర్యాదును రిజిస్టర్‌లో నమోదు చేసి, నిర్ణీత గడువులోగా పరిష్కరించేలా చర్యలు తీసుకుంటామన్నారు. వార్డు సభలు నిరంతర ప్రక్రియ అని, ప్రతి నెలా ఒకసారి నిర్వహిస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో జూనియర్ అకౌంట్ ఆఫీసర్ జగదీశ్వరి, వార్డ్ ఆఫీసర్ రజిని, జిపిఓ వెంకటరమణ, ఆర్పి మమత, అంగన్వాడి టీచర్లు సక్కుబాయి, యాకమ్మ, కాంగ్రెస్ నాయకులు కోలపురి ఝాన్సీ, ఆలేటి చిన్ని, వార్డు పెద్దలు, యువకులు పాల్గొన్నారు.

# తెలంగాణ సాయుధ పోరాట స్ఫూర్తిని నేటి తరాలకు అందించాలి

**ఎస్ఎఫ్ఐ రాష్ట్ర కార్యదర్శి తాళ్ల నాగరాజు**

**గోవిందరావుపేట, జూన్ 10( పీపుల్స్ డైరీ )** తెలంగాణ సాయుధ పోరాటం భారతదేశ చరిత్రలోనే ఒక మహోన్నత ప్రజా ఉద్యమమని, భూమి కోసం, భుక్తి కోసం, వెట్టి చాకిరి నిర్మూలన కోసం రైతాంగం సాగించిన ఈ పోరాటం నేటి తరాలకు స్ఫూర్తిదాయకమని ఎస్ఎఫ్ఐ రాష్ట్ర కార్యదర్శి తాళ్ల నాగరాజు అన్నారు. బుధవారం గోవిందరావుపేట మండల కేంద్రంలోని పీఎస్ఆర్ గార్డెన్ లో నిర్వహిస్తున్న ఎస్ఎఫ్ఐ రాష్ట్రస్థాయి శిక్షణ తరగతులలో నాగరాజు ముఖ్యఅతిథిగా హాజరై పాల్గొని మాట్లాడుతు నిజాం నిరంకుశ పాలనకు, భూస్వాముల దోపిడీకి వ్యతిరేకంగా 1946 నుంచి 1951 వరకు సాగిన తెలంగాణ సాయుధ పోరాటం సామాజిక న్యాయం, సమానత్వం, ప్రజాస్వామ్య విలువల కోసం జరిగిన చారిత్రక ఉద్యమమని తెలిపారు. ఈ పోరాటం ద్వారా వేలాది మంది రైతులు, కూలీలు, విద్యార్థులు, మహిళలు తమ ప్రాణత్యాగాలతో ప్రజల హక్కుల సాధనకు మార్గం చూపారని కొనియాడారు. నేటి విద్యార్థి యువత తెలంగాణ సాయుధ పోరాట చరిత్రను అధ్యయనం చేసి, అందులోని త్యాగాలు, పోరాట స్ఫూర్తిని ఆదర్శంగా తీసుకోవాలని పిలుపునిచ్చారు. సమాజంలో పెరుగుతున్న అసమానతలు, విద్యా రంగ సమస్యలపై ప్రజాస్వామ్య పద్ధతుల్లో పోరాడుతూ సమాన హక్కుల సాధనకు కృషి చేయాలని సూచించారు. తెలంగాణ సాయుధ పోరాట అమరవీరులకు ఎస్ఎఫ్ఐ తరఫున ఘన నివాళులు అర్పిస్తూ, వారి ఆశయాల సాధనే వారికి నిజమైన నివాళి అని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో ఎస్ఎఫ్ఐ రాష్ట్ర నాయకులు మమత, కిరణ్, శంకర్, రంజిత్ రెడ్డి, శంకర్ ములుగు జిల్లా అధ్యక్ష కార్యదర్శులు జాగటి రవితేజ , రవి, జిల్లా కమిటీ సభ్యులు రమేష్, రాకేష్,లు ఉన్నారు,



# అత్యాధునిక హియరింగ్ ఇంప్లాంట్ శస్త్రచికిత్సతో 8 ఏళ్ల బాలికకు వినికిడి పునరుద్ధరణ..

**-మలక్‌పేట్ యశోద సూపర్ స్పెషాలిటీ ఆసుపత్రిలో విజయవంతమైన చికిత్స**

ఖమ్మం, జూన్ 10 (పీపుల్స్ డైరీ) : పిల్లల్లో వినికిడి లోపం, ముఖ్యంగా పుట్టుకతోనే లేదా చిన్న వయస్సులోనే ఉంటే, మాటల అభివృద్ధి, కమ్యూనికేషన్ నైపుణ్యాలు, మొత్తం జీవన నాణ్యతపై తీవ్ర ప్రభావం చూపుతుంది. మైక్రోటియా వంటి మైక్రోటీయాల్లో బయటి చెవి సరైన రీతిలో అభివృద్ధి చెందకపోవడం వల్ల వినికిడి లోపం ఏర్పడుతుంది. ఈ సమస్యను సమయానికి గుర్తించి చికిత్స చేయకపోతే, పిల్లల భాషా అభివృద్ధి ఆలస్యమవడంతో పాటు వారి విద్యా, సామాజిక అభివృద్ధిపై కూడా ప్రతికూల ప్రభావం పడుతుంది.

ఆధునిక ఈఎన్టీ (ఈ ఎన్టి) వైద్యంలో బీసీ కన్డక్షన్ హియరింగ్ ఇంప్లాంట్స్ (ఓసియా వంటి పద్ధతులు) ఎంతో సమర్థవంతమైన పరిష్కారాలుగా నిలుస్తున్నాయి. ఈ విధానంలో శబ్ద తరంగాలను నేరుగా అంతర్గత చెవికి పంపించడం ద్వారా బయటి లేదా మధ్య చెవిలో ఉన్న లోపాలను అధిగమించి వినికిడి సామర్థ్యాన్ని మెరుగుపరుస్తుంది.

కల్వకుర్తికి చెందిన 8 ఏళ్ల బాలికకు చిన్ననాటి నుంచి కుడి చెవిలో వినికిడి లోపం ఉండగా, మలక్‌పేట్ యశోద సూపర్ స్పెషాలిటీ ఆసుపత్రిలో విజయవంతంగా చికిత్స అందించారు. పరీక్షల అనంతరం ఆమెకు 'రైట్ మైక్రోటియా విత్ హియరింగ్ లాస్' అని నిర్ధారించగా, వైద్యులు శస్త్రచికిత్సను సూచించారు.

అత్యాధునిక శస్త్రచికిత్స

డా.రఘు కుమార్ ఎస్.సి.హెచ్ (కన్సల్టెంట్ ఈఎన్టీ సర్జన్)




ఆధ్వర్యంలో 13--02--2026న బాలికకు రైట్ బోన్ కన్డక్షన్ హియరింగ్ ఇంప్లాంట్ (ఓసియా 300) శస్త్రచికిత్సను సాధారణ మత్తులో (జనరల్ అనేస్తేసినా) విజయవంతంగా నిర్వహించారు.

శస్త్రచికిత్స ముఖ్యాంశాలు:

- ఆధునిక ఓసియా 300 హియరింగ్ ఇంప్లాంట్ అమరిక
- మినిమల్లీ ఇన్వేసివ్ (స్వల్ప శస్త్రచికిత్స) విధానం
- కన్డక్షన్ ద్వారా వినికిడి పునరుద్ధరణ

ఈ శస్త్రచికిత్స ఎటువంటి అంతర్గత సమస్యలు లేకుండా విజయవంతంగా పూర్తయింది.

**శస్త్రచికిత్స అనంతర సంరక్షణ**

శస్త్రచికిత్స అనంతరం బాలికకు సమగ్ర వైద్య పర్యవేక్షణలో కింద పేర్కొన్న చికిత్సలు అందించారు:

- ఐవి ద్రవాలు (ఐవి ఫ్లూయిడ్స్), యాంటీబయాటిక్స్, నొప్పి నివారణ మందులు
- నిరంతర పర్యవేక్షణ, సహాయక చికిత్స
- పోస్ట్-ఆపరేటివ్ దశ సజావుగా సాగి, బాలిక ఆరోగ్యం మెరుగుపడింది. అనంతరం బాలికను స్థిర స్థితిలో డిశ్చార్జ్ చేసి, ఫాలోఅప్ కోసం సూచనలు ఇచ్చారు.

**అద్భుతమైన ఫలితం**

- డిశ్చార్జ్ సమయానికి బాలిక స్థితి స్థిరంగా ఉంది
- వినికిడి మెరుగుదలకు అనుకూల పరిస్థితి
- ఎటువంటి శస్త్రచికిత్స అనంతర సమస్యలు లేవు
- రెగ్యులర్ ఫాలోఅప్ సూచించారు

**వైద్యుల అభిప్రాయాలు**

మైక్రోటియా, కన్డక్టివ్ హియరింగ్ లాస్ ఉన్న పిల్లల్లో ఓసియా వంటి బోన్ కన్డక్షన్ ఇంప్లాంట్లు అత్యంత సమర్థవంతమైన పరిష్కారం. ముందస్తు జోక్యం ద్వారా వినికిడి మెరుగుపడటంతో పాటు, మాటల, బాషా అభివృద్ధికి ఇది కీలకంగా సహాయపడుతుంది. ఈ కేసులో సమయానికి శస్త్రచికిత్స చేయడం వల్ల బాలికకు మెరుగైన వినికిడి, భవిష్యత్ అభివృద్ధికి మంచి అవకాశం లభించింది.

**డా.రఘు కుమార్ ఎస్.సి.హెచ్, కన్సల్టెంట్ ఈఎన్టీ సర్జన్, యశోద సూపర్ స్పెషాలిటీ ఆసుపత్రి, మలక్‌పేట్**

### ఈ కేసు ప్రాధాన్యత

- పిల్లల్లో వినికిడి లోపాన్ని ముందుగానే గుర్తించడం అవసరం
- మైక్రోటియా కేసుల్లో ఓసినా ఇంప్లాంట్ల ప్రభావం
- ఆధునిక ఈఎన్టీ శస్త్రచికిత్సల ప్రాముఖ్యత
- మాటల, భవిష్యత్ అభివృద్ధి మెరుగుదలలో కీలక పాత్ర

**యశోద ఆసుపత్రి యాజమాన్యం స్పందన**

ఈ కేసు యశోద సూపర్ స్పెషాలిటీ ఆసుపత్రిలో అందుబాటులో ఉన్న ఆధునిక ఈఎన్టీ వైద్య సేవలు, నిపుణుల శస్త్రచికిత్స నైపుణ్యం, మరియు రోగి-కేంద్రిత వైద్య విధానానికి నిదర్శనమని యాజమాన్యం పేర్కొంది. క్లిష్టమైన పిల్లల వినికిడి సమస్యలను కూడా అత్యున్నత ప్రమాణాలతో చికిత్స చేసే సామర్థ్యం ఆసుపత్రి ప్రత్యేకతగా వారు తెలిపారు. అత్యాధునిక ఆపరేషన్ థియేటర్లు, ఆధునిక నిర్ధారణ సదుపాయాలు, అనుభవజ్ఞులైన వైద్య నిపుణుల సమన్వయం ఈ విజయానికి కారణమని వెల్లడించారు. మలక్‌పేట్ యశోద సూపర్ స్పెషాలిటీ ఆసుపత్రి డైరెక్టర్ గోరుకంటి పవన్, యూనిట్ హెడ్ కె. శ్రీనివాస్ రెడ్డి, అసోసియేట్ వైస్ ప్రెసిడెంట్ శ్రీనివాస్ చిదుర మాట్లాడుతూ... అత్యాధునిక సాంకేతికత, నిపుణుల బృందంతో పిల్లల్లో వినికిడి లోపాలను సమర్థవంతంగా చికిత్స చేస్తున్నామని తెలిపారు. ముందస్తు చికిత్స ద్వారా పిల్లల భవిష్యత్ అభివృద్ధిని మెరుగుపరచడం తమ లక్ష్యమని స్పష్టం చేశారు.

# రోడ్డు భద్రత అవగాహన కార్యక్రమం - సి సి టి ఎన్ ఎస్ పనితీరుపై సమీక్ష

**ఏన్కూరు జూన్ 10 పీపుల్స్ డైరీ :** ప్రజాపాలన ప్రగతి ప్రణాళికలో భాగంగా ఏన్కూర్ మండలంలోని నూకాలంపాడు గ్రామంలో నిర్వహించిన గ్రామసభలో "అరైవ్ అలైవ్" రోడ్డు భద్రత అవగాహన కార్యక్రమం నిర్వహించబడింది. ఈ కార్యక్రమంలో కల్లూరు డివిజన్ ఏసీపీ వసుంధర యాదవ్ పాల్గొని గ్రామస్థులకు రోడ్డు భద్రతపై అవగాహన కల్పించారు. ట్రాఫిక్ నిబంధనల పాటింపు, హెల్మెట్ మరియు సీట్‌బెల్ట్ వినియోగం, మద్యం సేవించి వాహనాలు నడపడం వల్ల కలిగే ప్రమాదాలు, అతివేగం నివారణ వంటి అంశాలపై ప్రజలకు సూచనలు చేశారు. రోడ్డు ప్రమాదాల నివారణకు ప్రతి ఒక్కరూ బాధ్యతాయుతంగా వ్యవహరించాలని కోరారు.

ఈ కార్యక్రమంలో సత్తుపల్లి రూరల్ సీఐ ముత్తిలింగయ్య మరియు ఏన్కూర్ ఎస్సై ఎన్. సంధ్య పాల్గొని గ్రామస్థులతో మమేకమై రోడ్డు భద్రతా నియమాల ప్రాముఖ్యతను వివరించారు.

అనంతరం ఏసీపీ వసుంధర యాదవ్ ఏన్కూర్ పోలీస్ స్టేషన్‌ను సందర్శించి సి సి టి ఎన్ ఎస్. పనితీరును సమీక్షించారు. రికార్డులు, ఆన్‌లైన్ ఎంట్రీలు, పెండింగ్ పనులను పరిశీలించి స్టేషన్ రైటర్లు మరియు సిబ్బందికి అవసరమైన సూచనలు జారీ చేశారు. రికార్డుల నవీకరణ, డేటా ఖచ్చితత్వం, పెండింగ్ పనుల సత్వర పరిష్కారంపై ప్రత్యేక దృష్టి సారించాలని ఆదేశించారు.

రోడ్డు భద్రతపై ప్రజల్లో అవగాహన పెంపొందించడం, సాంకేతిక ఆధారిత పోలీసింగ్‌ను బలోపేతం చేయడం మరియు ప్రజలకు మెరుగైన సేవలు అందించడం లక్ష్యంగా ఖమ్మం పోలీస్ శాఖ నిరంతరం కృషి చేస్తోందనీ ఎస్సై సంధ్య తెలిపారు.






EDITED, PRINTED, PUBLISHED AND OWNED BY **KONDAPARTHI KIRAN,** PRINTED AT SATYANARAYANA PRINTERS, H.NO.4-6-144, TILAK ROAD, KARIMNAGAR-505001, KARIMNAGAR DISTRICT, TELANGANA, STATE. PUBLISHED AT H.NO. 10-3-488, OPP: RTC WORK SHOP, KARIMNAGAR-505001, KARIMNAGAR DISTRICT, TELANGANA STATE,
**EDITOR : KONDAPARTHI KIRAN.RNI NO: TEL/TEL/2009/28544, CELL:9493019044,** e-mail : peoplesdairydaily@gmail.com